ఓ హిప్పీ కథ

సికిందర్

గణగణమని ఫోను మోగింది.

పరమానందం హఠాత్తుగా ఉలిక్కిపడ్డాడు. అతని చేతిలోని చుట్ట జారి నేలమీద పడింది. అతను ఓ క్షణం టీపాయ్‌మీది టెలిఫోన్‌నీ, నేలమీద చుట్టనీ చూస్తూ దేన్ని

Dec 1978

అందుకోవాలా అని ఆలోచించాడు. ఆ తర్వాత కాలితో చుట్ట నలిపేసి చేత్తో రిసీవర్ అందుకున్నాడు.

"హలోవ్! హలోవ్! పరమానందం స్పీకింగ్."

"మధ్యాహ్నం పన్నెండు గంటల పదమూడు నిమిషాలకి...." ఆగిపోయాయి అవతలి మాటలు.

పరమానందం ముఖం చిట్లించాడు. "...నిమిషాలకి?"

"నిన్ను చంపేస్తాను."

పరమానందం అదిరిపడి అర్చాడు, "ఏయ్! ఎవర్నువ్వు? ఏమిటి నువ్వనేది? ఆఁయ్?"

"నిన్ను చంపేస్తాను. నువ్వు చచ్చిపోతావు."

పరమానందం కంగారు ఇంకా ఎక్కువైంది. "అసంభవం! నేనింకా ఇరవై ఏళ్ళు ఈజీగా బ్రతుకుతాను!"

"చెప్పిన టైం దాటి ఇరవై క్షణాలు బ్రతకవు."

అప్పుడు కుదుటపడ్డాడు పరమానందం. "ఓహో! నువ్వా హిప్పీ? పిచ్చికూతలు కూయకు. పోలీసులతో తన్నిస్తాను!"

అవతల వికటాట్టహాసం. "తన్నించలేవు! నేనెవరికీ చిక్కని చోట వుంటాను చెట్టెక్కి. ఆ చెట్టెక్కడో ఎవరూ తెలుసుకోలేరు! హి—హి...."

"ఏమిటి నాన్నా?" పరమానందం పంథొమ్మిదేళ్ళ కూతురు మాలతి గదిలోంచి వచ్చింది.

"ఏయ్ హిప్పీ! ఈ రోజు నీకు బుద్ధిచెప్తాను!" పరమానందం అర్చాడు.

మాలతి రిసీవర్ లాక్కుంది. "ఏమిటి బెదిరిస్తున్నావ్, కంపు సన్నాసీ?"

"అయ్యో! అబ్బ! మాలతీ! నువ్వా!"

"ఛీ, నోర్మూయ్! ఏమిటి బెదిరిస్తున్నావ్?"

"పట్టపగలు పన్నెండుగంటల పదమూడు నిమిషాలకి మంచి ముహూర్తమని శాస్త్రి చెప్పాడు. నీ తండ్రిని చంపేసి, నీకు తాళి కట్టేస్తాను!"

గజగజ వణికింది మాలతి. తండ్రి రిసీవర్ లాక్కున్నాడు.

"చూడు హిప్పీ, మమ్మల్నెందుకిలా వేధిస్తున్నావు?"

"నీ కూతురి కోసం—నాకిచ్చి పెళ్ళిచేయ్! ప్రాణాలు దక్కుతాయ్...."

"ఆమె నీకు దక్కదు! మర్చిపో!"

"నీకు చావు తప్పదు! ఆమెను నేను మర్చిపోలేను. నేను దేవదాసుని. నువ్వు మర్చిపో!"

"సరే," ఒక నిశ్చయానికి వచ్చాడు పరమానందం. "నువ్వు మనిషివి కావు. చెబితే వినవు. జంతులక్షణా లున్నాయి. పోలీసులకి చెప్పి తన్నిస్తాను!"

"ప్చ్, పాపం! పరమానందం....పట్టపగలు....పరలోక ప్రయాణం కడుతున్నాడు!" హఠాత్తుగా వికటాట్టహాసం, "నువ్వు ఎవరికి రిపోర్టు చేసినా నిన్ను చంపేసి నీ కూతుర్నెత్తుకపోవటం ఖాయం! నాకు పిచ్చి పట్టిందనుకోకు! నీ కూతుర్ని ప్రేమిస్తున్నాను-నాకిచ్చి పెళ్ళిచేయకపోతే నేనే చేసుకుంటాను—నిన్ను అడ్డు తొలగించి" మళ్ళీ నవ్వు. "కాబట్టి నీకేది ఇష్టమో ఇప్పుడు చెప్పు! పిల్లనిస్తావా? పీక కోసేయమంటావా?"

పరమానందం మాట్లాడలేదు. చెమటలు కక్కుతున్నాడు.

"నేను దుర్మార్గుణ్ణి కాను," మళ్ళీ వినిపించాయి అవతలి మాటలు. "దుర్మార్గుడినైతే నీ కూతురిపైన దౌర్జన్యం చేసేవాడ్ని. నాది కామంకాదు, ప్రేమ. నా మంచి తనం నీ కర్థంగావడంలేదు! మరోసారి అడుగుతున్నాను

నీ సమాధానం ఏమిటి?"

పరమానందం వేగంగా ఆలోచించాడు. "హిప్పీ, నేను ఆలోచించి ఏ విషయం తెలియజేస్తాను. నువ్వెక్కడ వుంటావు?"

"చెట్టెక్కి వుంటానని చెప్పాను. ఆ చెట్టెక్కడో చెప్పను. తర్వాత ఫోన్ చేస్తాను—సరిగ్గా పన్నెండు గంటలకి. ఏ విషయం తెలియజేయ్."

లైన్ కట్ అయింది.

పరమానందం చాలాసేపు పరధ్యానంగా వుండి పోయాడు. మాలతి అసహనంగా చూస్తోంది. "నాన్నా, వాడికి మీరు బుద్ధి చెప్పండి!"

పరమానందం మాలతి తలనిమిరి, "అవును మాలతీ, ఈ రోజు వాడి అంతు చూడాలి!" అన్నాడు ఆందోళనగా.

2

ఉదయం సరిగ్గా పదిగంటలకి జాన్ ఏజన్సీ ఆఫీసులోకి ప్రవేశించి, పత్రిక చదువుతోన్న లాల్‌ని చూసి, "అరె, క్యాహై యార్....ఏం చేస్తున్నావిక్కడ?" అనడిగాడు.

లాల్ తలెత్తి నూటిగా చూశాడు. "ఇంత ఆలస్యమైందేం!"

జాన్ నసిగాడు. "రాత్రి-గర్ల్‌ఫ్రెండ్-సెకెండ్ షో..."

"షటప్ యూ డర్టీ పార్ట్‌నర్!" సిగరెట్ విసిరికొట్టి అర్చాడు లాల్.

గుమ్మందగ్గర కిర్రుచెప్పుల చప్పుడూ, గాజుల గలగలలూ విన్పించాయి.

ఇద్దరూ తలలు తిప్పి చూశారు.

పరమానందం ఏనుగులా వూగుతూ వచ్చి సోఫాలో

కూలబడ్డాడు.

మాలతి జింకలా ఎగురుతూ వచ్చి లాల్ ఎదురుగా నిల్చుంది.

లాల్ పరమానందాన్ని, జాన్ మాలతినీ పరిశీలనగా చూస్తున్నారు. చూపులయ్యాక పరిచయాలు ముగిశాయి. ఆ తర్వాత లాల్ అడిగాడు: "మిస్టర్ పరమానందం, ఏమిటి సమస్య?"

"మమ్మల్ని వేధిస్తున్న హిప్పీ పీడ తొలగించాలి!" పరమానందం చెప్పాడు ఆందోళనగా.

"మిమల్ని ఎందుకు వేధిస్తున్నాడు? మీ కూతురి కోసమా?"

"అవును. వాడికిచ్చి పెళ్ళిచేయకపోతే చంపుతానని కూడ ఈవాళ బెదిరించాడు సార్!"

"ఇదేమీ పెద్ద సమస్యకాదు" లాల్ అన్నాడు. "హిప్పీలని మీరు పట్టించుకోనవసరం లేదు. అమ్మాయిల వెంట అలాగే పడతారు. అదొక పిచ్చి."

"కాదు సార్! వాడు నన్ను చంపేస్తాడు తప్పకుండా!"

"అని చెప్పాడా?"

పరమానందం తలూపాడు.

"హత్యలు చెప్పి చేయడమన్నది సాధారణంగా జరగదు" అన్నాడు లాల్.

"హత్య చేస్తానని చెప్పి ఆ తర్వాత మానుకున్నా. ఆ అవకాశాన్ని ఎవరైనా ఉపయోగించుకుంటే సీరియస్‌గా చిక్కుల్లో పడతారు!" జాన్ అన్నాడు.

లాల్ విసుగ్గా చూశాడు జాన్‌ని. "కాబట్టి ఆ హిప్పీది ఉట్టి బెదిరింపు. మీరు వెళ్ళండి! ఏమీకాదు...." జాన్ వంటున్నాడు.

"జాన్, ద్వారకాలో నిన్న టిఫిన్ చేసి బిల్లు చెల్లించినట్టులేదు, వెళ్ళి కనుక్కుని రా!" లాల్ మాటలకి అర్థం తెలుసుకుని నోరు మూసుకున్నాడు జాన్. లాల్ లోలోన తిట్టుకొని, "మిస్టర్ పరమానందం, మీ సమస్య వివరించి 'నాతో' చెప్పండి!" అన్నాడు.

కండువాతో ముఖం తుడుచుకుని, చెప్పడం ప్రారంభించాడు పరమానందం.

పరమానందం చెప్పిన సారాంశం ఇది:—

వారం రోజుల నుంచి మాలతిని దేవదాస్ అనే హిప్పీ వెంటాడుతున్నాడు—ఇంటినుంచి కాలేజికీ, కాలేజినుంచి ఇంటికీ....ఎక్కడికెళితే అక్కడికి.

దారిలో అందరూ ఈ చోద్యం చూసి నవ్వుకుంటే మాలతికి తల కొట్టేసినట్టవుతోంది. చిత్రమేమిటంటే హిప్పీ ఒక్కసారి కూడా కనీసం 'ఏమండీ!' అని పలకరించలేదు!

కానీ రోజుకో ప్రేమలేఖ వ్రాస్తున్నాడు. ఇప్పటివరకు ఆరు లేఖలందాయి. ఆ లేఖల్లో ఏ కవికీ సాధ్యం కాని విధంగా వర్ణనలుంటున్నాయి. తానెంత విరహం చెందుతున్నదీ, గుండెలో ఎంత గుబులుగా వుందీ, ఆమెతో ఏకాంతంగా గడిపే సమయంకోసం ఎంత తపించిపోతున్నదీ చక్కగా వివరించాడు. కాని పెళ్ళిగొడవ ఎత్తలేదు.

పెళ్ళిగురించి ఫోనులో పరమానందానికి ప్రస్తావిస్తున్నాడు. పరమానందం ఈ హిప్పీ ప్రవర్తనతో విసిగిపోయి పోలీసురిపోర్టు ఇద్దామనుకుని మానుకున్నాడు—నలుగురి నోళ్ళలో పడటం ఇష్టంలేక.

హిప్పీ సతాయింపు యింకా ఎక్కువైంది. ఇక లాభం లేదనుకుని పాలేరుచేత కొట్టించాలని నిశ్చయించుకున్నాడు. కానీ హిప్పీ ఒక హెచ్చరిక చేశాడు—తనమీద చర్య తీసుకుంటే మాలతిని నవ్వులపాలు చేస్తానని!

ఆ హిప్పీతో విసిగిపోయిన మాలతి ఒకసారి చెంప వాయించబోయి మానుకుంది. ముళ్ళకంపలావున్న అతని గడ్డం చూసి కంపరం పుట్టింది.

కాలేజీలో రూమర్లు పుట్టాయి. మాలతి గురించి రకరకాలుగా చెప్పుకుంటూ ఆనందిస్తున్నారంతా. ప్రిన్సిపాల్ మాలతిని సంజాయిషి కోరాడు. మాలతి పెద్దపెట్టున ఏడ్చేసి అవమానభారంతో ఇంటికి వచ్చేసింది. ఆమె కాలేజి మానేసి రెండురోజులైంది.

ఈ రెండురోజులు ఆమె ఇల్లు కదలలేదు. అయినా ఫోన్‌కాల్స్, ఉత్తరాలు వస్తూనేవున్నాయి. డాబా ఎక్కిచూస్తే వీధి మలుపు దగ్గర హిప్పీ కన్పిస్తున్నాడు.

ఈ రోజు చంపేస్తానని బెదిరించడంతో పరమానందం

ఆ హిప్పీ అంతు చూడాలన్న అంతిమ నిర్ణయంతో బయలు దేరి డిటెక్టివ్‌లని కలుసుకున్నాడు.

"ఆ హిప్పీతో ప్రత్యక్షంగా మాట్లాడారా?"

ఈ రోజు చంపేస్తానని బెదిరించడంతో పరమానందం ఆ హిప్పీ అంతు చూడాలన్న అంతిమ నిర్ణయంతో బయలు దేరి డిటెక్టివ్‌లని కలుసుకున్నాడు.

"లేదు. ఎందుకలా అడిగారు?"

"నాకు సమాధానం చెప్పండి. ఫోన్ చేస్తోంది హిప్పీ అని మీకెలా తెలుసు?"

"మాలతిని వెంటాడుతున్నది వాడు కాబట్టి. ఉత్తరాలు వ్రాస్తోంది వాడు కాబట్టి...."

లాల్ అడ్డంగా తలూపాడు. "మాలతి, మీరు హిప్పీతో మాట్లాడారా? ఫోన్‌లో కాదు."

"మాట్లాడాను. కానీ వాడు నోరు విప్పలేదు. నేను తిట్టినా నోరు విప్పి ఒక్క ముక్క మాట్లాడడు!"

"కానీ ఫోన్‌లో మాట్లాడుతాడు కదూ?"

"అవును."

"ఫోన్‌లో మీరతనితో మాట్లాడారా?"

"మాట్లాడాను. కాని మాట్లాడింది వాడితోనే అని చెప్పలేను."

"అదీ నేను ఆశించే పాయింట్. కాబట్టి ఫోన్ చేస్తోంది హిప్పీ అని చెప్పలేరు. అంతేనా?"

మాలతి తల వూపింది.

"అంటే హిప్పీకీ ఫోన్ కాల్స్‌కీ అసలు సంబంధం లేదు. అవునా?"

మాలతి షాక్ తిన్నట్టు చూపింది. "కాదు! నేనేమీ చెప్పలేను!"

లాల్ నవ్వాడు. "ఫోన్ చేస్తోంది హిప్పీ అని మీకు తెలియదు. పరిస్థితుల్నిబట్టి మీరలా అనుకుంటున్నారు. అంతేనా?"

మాలతి, పరమానందం తలలూపారు.

జాన్ మాలతికి వచ్చిన ప్రేమలేఖల్ని పరిశీలిస్తోన్నాడు.

"పరమానందంగారూ, అయితే ఇప్పుడు మమ్మల్ని ఏం చేయమంటారు?" అడిగాడు లాల్.

"ఆ హిప్పీకి బుద్ధిచెప్పాలి. నన్ను చంపుతానని బెదిరించాడు. అది ఎంతవరకు నిజమో తెలియదు. మీరు వాడ్ని పట్టుకుని పోలీసులకి అప్పజెప్పాలి! వాడిమీద న్యూసెన్సు కేసు పెట్టాలి!"

"మేమా!"

"కాదు, నేను. పన్నెండు గంటలలోపున ఈ పని మీరు పూర్తిచేయాలి! ఫీజు ఎంతకావాలో అడగండి!"

"ఎలా పట్టుకోవాలో అర్థంకావడంలేదు," లాల్ అన్నాడు. "చెట్టెక్కి వుంటాడన్నది వట్టిజోక్. ఈ రోజు ఎప్పటిలా మాలతిని వెంటాడదనుకుంటాను. పన్నెండు గంటలవరకు ఏం జరుగుతుందో వేచి చూస్తే? లేకపోతే పెళ్ళికి ఒప్పుకున్నట్టు మీరు చెప్పండి. ఆ తర్వాత వల పన్నుదాం?"

పరమానందం మాట్లాడలేదు.

జాన్ అన్నాడు, "లాల్, ఆ హిప్పీని నేను పట్టుకుంటాను."

"ఎలా?"

జాన్ ఉత్తరాల్ని ముందుకి తోశాడు. "ఈ ఉత్తరాల్ని జాగ్రత్తగా పరిశీలించు. ప్రతిరోజూ ఇవి జి.పి.ఓ. లో 11 : 30-12 : 00 మధ్య పోస్ట్ చేయబడుతున్నాయి.

జి.పి.ఓ. లో ప్రతి అరగంటకి క్లియరెన్స్ చేస్తారు. ఈ ఉత్తరాల మీద జి.పి.ఓ. కాన్సిలింగ్ స్టాంప్స్ 12 : 00 గంటల సమయం చూపిస్తున్నాయి. అంటే వీటిని పోస్ట్ చేస్తున్న వ్యక్తి ఈ రోజు కూడా వస్తాడు—నేను పట్టుకుంటాను."

3

జాన్ కారు డ్రైవ్ చేస్తూ మాలతిని సూటిగా చూశాడు.

"మాలతి, మీ రెవరైనా ప్రేమిస్తున్నారా?"

ఉలిక్కిపడి చూసింది మాలతి, "ఏమిటి మీరన్నది?"

"మీ రెవరైనా ప్రేమిస్తున్నారా?"

"లేదు!"

"మిమ్మల్నెవరైనా ప్రేమిస్తున్నారా?"

"ఆ హిప్పీ ప్రేమిస్తున్నాడు-మీకు తెలుసు!"

"నాకు తెలుసు. కానీ, ఈ ఉత్తరాలు హిప్పీ వ్రాయ లేదు. మీరేమంటారు?"

మాలతి విస్తుపోయింది. "ఆ హిప్పీ వ్రాశాడంటాను! ఏమిటి మీ ఉద్దేశ్యం?"

జాన్ జేబులోంచి ఉత్తరాల్ని తీసి మాలతి వాళ్లోకి విసిరాడు.

"అక్షరాల్ని జాగ్రత్తగా పరిశీలించండి. దస్తూరి ఎవరిది?"

"హిప్పీది!"

"మాలతి, కాస్సేపు హిప్పీని మర్చిపోండి!" జాన్ అన్నాడు సీరియస్‌గా.

"ఫోన్ చేస్తుందెవరో మీకు కచ్చితంగా తెలియదు. అలాగే ఈ ఉత్తరాల విషయంలో కూడా పొరబడు

తున్నారు. ఈ ఉత్తరాలు మొత్తంటికీ ఆ హిప్పీ వ్రాయ లేదని పందెం కడతాను. ఒక హిప్పీకి, మానసిక పీడితుడికి, ఇంత చక్కటి దస్తూరీ వుందంటే ఎవరూ నమ్మరు మాలతి."

"హిప్పీ కాక ఇంకెవరు రాస్తారు?"

"మీకు తెలుసు. ఈ దస్తూరీ మీరు గుర్తుపడతారు!"

"గుర్తు పట్టను! ఈ దస్తూరీ ఎవరిదో నాకు తెలియదు! హిప్పీదని నా అనుమానం!"

"హిప్పీది కాదు. హిప్పీలకి ఇంత శ్రద్ధ వుండదు— వర్ణనలతో చక్కటి అక్షరాలతో ఉత్తరాలు వ్రాయడానికి. ఈ వ్రాత మీ స్నేహితులలో ఎవరిదేనా కావచ్చా?"

"కాదు, కాదు...."

జాన్ స్పీడుగా డ్రైవ్ చేయసాగాడు. సరిగ్గా 11 : 20కి కారు జి.పి.ఓ. చేరుకుంది.

"మాలతి, మీ చూపులు పోస్టుబాక్స్ మీద వుంచండి" జాన్ అన్నాడు. "మీకు తెలిసినవాళ్ళు కన్పిస్తే నాకు చెప్పండి."

మాలతి తలూపింది. జాన్ సిగరెట్ వెల్గించాడు.

పోస్టుబాక్స్ దగ్గర రద్దీగా వుంది. రకరకాల వ్యక్తులు ఉత్తరాలు పోస్టుచేసి వెళుతున్నారు....వృద్ధులు, నడివయస్కులు, యువకులు .... వాళ్ళలో స్త్రీలూ పురుషులూ వున్నారు.

"మాలతి జాగ్రత్తగా చూడండి" మళ్ళీ అన్నాడు జాన్. సమయం 11 : 35 అయింది. మాలతికి తెలిసిన వ్యక్తులెవరూ కన్పించడంలేదు.

ఉన్నట్టుండి నవ్వాడు జాన్. "ఒకవేళ హిప్పీకాక ఇంకెవరైనా పరిచయస్తులు కన్పిస్తే ఆ వ్యక్తిని రక్షించ

డానికి నాకు చెప్పరేమో? అలా జరక్కూడదు. ఆ వ్యక్తి ఎవరైనా నాకు చెప్పాలి. అర్థమైందా?"

"నాన్సెన్స్! అటు చూడండి! హిప్పీ!" అర్చింది మాలతి.

జాన్ చూశాడు. పొడవాటి కవరు జేబులోంచి తీసి బాక్స్‌లో పడేసి వెనక్కి తిరిగాడు, హిప్పీలాంటి యువకుడు.

అతనికి ఇరవైఅయిదేళ్లుంటాయి. సన్నగా పొడుగ్గా వుంటాడు. చిన్న కళ్లు. పొడవాటి ముక్కు చెవులకిందికి వేలాడుకున్న జుత్తు. 40 ఇన్‌చెస్ బెల్‌బాటమ్. రంగు రంగుల పొడుగు చేతుల చొక్కా. గుండె భాగంమీద బ్రూస్‌లీస్టిక్కర్. కాళ్ళకి కాన్వాస్ బూట్లు. మెడలో రోల్డ్‌గోల్డ్ గొలుసు....

జాన్ కారుదిగి అతని దగ్గరికి నడిచాడు. హిప్పీ ఎగాదిగా చూశాడు. జాన్ విజిటింగ్ కార్డు అందించి నవ్వాడు.

హిప్పీ కార్డు చదివి, "గ్లాడ్ టు మీట్యూ!" అన్నాడు.

జాన్ షేకాండిచ్చాడు. ఆ తర్వాత ఇద్దరూ కారు దగ్గరికి నడిచారు.

మాలతి భయంగా ఒదిగి కూచుంది.

హిప్పీ విజిటింగ్‌కార్డు జేబులో పెట్టుకుని, "దేవదాస్ ఈజ్ ది నేమ్. ఐయామ్ వెరీ గ్లాడ్ టు మీట్యూ మిస్టర్ జాన్! ది డిటెక్టివ్! వాటె సర్‌ప్రైజ్!" అన్నాడు ఆశ్చర్యంగా.

"అండ్ మీట్ మిస్ మాలతి, మిస్టర్ దేవదాస్." జాన్ అన్నాడు తాపీగా.

దేవదాస్ అదిరిపడి చూశాడు కార్లో. "మాలతీ

నువ్వా!....''

"ఆర్యూ ఇన్ లవ్ విత్ హర్?" జాన్ అడిగాడు.

"దటీజ్ వై ఐయామ్ డయింగ్ ఫర్!" అర్చాడు దేవదాస్.

"కమాన్, గెట్ ఇన్ ది కార్" డోర్ తెరిచాడు జాన్. "కాంట్ యూ స్పీక్ ఇన్ తెలుగు?"

"వై నాట్?" దేవదాస్ కారెక్కాడు.

"దెన్ స్పీక్ ఇన్ తెలుగు...." అన్నాడు కారు స్టార్ట్ చేసి.

"మిస్టర్ జాన్, నన్నెక్కడికి తీసుకెళుతున్నారు?" అడిగాడు దేవదాస్.

"నీతో కొన్ని విషయాలు మాట్లాడాలి!" అన్నాడు జాన్. "నువ్వంటే మాలతికి యిష్టంలేదు. ఆమెను వేధించడం మానెయ్యాలి. దిసీజ్ మై వార్నింగ్. మళ్ళీ ఆమెని వెంటాడినట్టు నాకు తెలిస్తే, పోలీసుల కప్పగిస్తాను."

దేవదాస్ నవ్వాడు. "జాన్, హత్య చేయడం నేరం. దొంగతనం చేయడం నేరం. రేప్చేయడం నేరం. ఈ మూడింటిలో నేనేదీ చేయడంలేదు. మాలతిని ప్రేమిస్తున్నాను....అది నేరం కాదు....నన్నెవరూ యేమీ చేయలేరు!"

"ఆల్‌రైట్, ఆమెకి ఉత్తరాలు వ్రాస్తోంది ఎవరు?"

"ఎవరంటా రేమిటి! నేనే! మరొకడు వ్రాస్తే చేతులు విరగ్గొడతాను!"

"అబద్ధాలాడకు. అ ఉత్తరాలను నువ్వు వ్రాయడం లేదు!"

"అవును. నేను వ్రాయడంలేదు" ప్రశాంతంగా అన్నాడు దేవదాస్. "వ్రాయిస్తున్నాను. ఉత్తరాలు వ్రాయించడం

నేరమని ఏ చట్టం చెప్తుందో చెప్పు!"

"ఎవరిచేత వ్రాయిస్తున్నావ్?"

"మీ కనవసరం. లుక్ జాన్, మీరు ఏ దొంగతనం కేసులో, హత్య కేసులో పరిశోధించండి. ప్రేమ విషయాల్లో జోక్యం చేసుకోకండి!"

జాన్ కారాపేశాడు.

"ఇష్టంలేని అమ్మాయిని పెళ్ళికి బలవంతం చేయడం నేరం" అన్నాడతను. "మిస్టర్ దేవదాస్, నువ్వు మాలతిని ప్రేమించడం నా కభ్యంతరంకాదు. అది ఆమెకి సంబంధించిన సమస్య—నువ్వామె తండ్రిని చంపుతానని బెదిరించడం నా కభ్యంతరం. మాలతి, ఇప్పుడు చెప్పండి! ఫోన్‌లో విన్పిస్తోంది ఇతని కంఠమేనా?"

అడ్డంగా తలూపింది మాలతి వెంటనే.

"ఇతని కంఠం కాదు!"

"వెరీ గుడ్. దేవదాస్, ఫోన్ యెవరిచేత చేయిస్తు న్నావ్?"

"నేనే చేస్తున్నాను."

"మాలతి సమాధానం విన్నావా?"

"విన్నాను. ఆమెతో ఒక విషయం చెప్పండి! ఫోన్‌లో అందరి కంఠాలూ ఒకేలా విన్పిస్తాయి, ఎంతో పరిచయిస్థులైతే తప్ప. అదీ వారితో తరచు ఫోన్‌లో మాట్లాడితే తప్ప వారి కంఠాన్ని గుర్తించలేం. ఈ విషయం మీకు తెలియదా జాన్?"

జాన్ కోపంగా చూశాడు. "దేవదాస్, నువ్వు నాటక మాడుతున్నావు. అన్నీ అబద్ధాలు చెప్తున్నావు. ఆల్‌రైట్, చెప్పిన సమయం ప్రకారం పరమానందాన్ని చంపుతావా?"

ఫకాలున నవ్వాడు దేవదాస్. "ఆయన్ని చంపే అవసరంలేదు జాన్. ఇలా నాలుగుసార్లు బెదిరిస్తే దారికొస్తాడు. నా బెదిరింపు ఎలా పనిచేసిందో యిప్పుడర్థమైంది. అతను మిమ్మల్ని కలుసుకున్నాడన్నమాట! మీ పరిశోధన మాని మా యిద్దరికీ పెళ్ళిచేయండి జాన్! రుణపడి వుంటాను— ఓ. కే, మాలతి, పెళ్ళి చేసుకున్నాక నిన్ను పార్వతి అని పిలుస్తాను. వాడ్డూయూ సే?"

"యూ డర్టీబిచ్! ఐవిల్ స్లాప్ ఆన్ యువర్ ఫేస్!" ఉద్రేకంతో అర్చింది మాలతి.

దేవదాస్ కోపంగా చూశాడు. "అనుభవిస్తావు! జీవితాంతం అనుభవిస్తావు!"

"ఓహ్! జాన్! వాడ్ని కిందికి నెట్టండి!"

"ఆల్‌రైట్, బ్రదర్" కల్పించుకున్నాడు జాన్. "ఇక నువ్వు వెళ్ళవచ్చు. మళ్ళీ మాలతి వెంట కన్పించావా, నా

చేతిలో బ్రూస్‌లీ దెబ్బలు తింటావు! పొరపాటున చచ్చి పోతావు! గెటవుట్, ప్లీజ్."

దేవదాసు కారు దిగి ఇద్దర్నీ నవ్వుతూ చూశాడు.

"డియర్ మాలతి, మిస్టర్ జాన్! వేచి చూడండి, ఏం జరుగుతుందో.పరమానందానికి మరొక వార్నింగ్ ఇస్తాను. వినకపోతే మాలతిని బలవంతంగా ఎత్తుకుపోతాను—గోవా! హిప్పీలుండేచోట! మాలతిని అక్కడ హిప్పీగా మార్చేస్తాము! హిప్పీల జీవితం మీకు తెలుసు. వావివరస వుండదు! ఆనందాన్ని అనుభవించడం మా పరమాదర్శం! గుడ్‌బై."

చకచక నడిచి వెళ్ళిపోయాడు దేవదాస్.

"జాన్, నాకు చాలా భయంగా వుంది!"అంది మాలతి గాభరాగా.

జాన్ నిట్టూర్చాడు. "డోంట్ బాదర్! ఈసారి అతను ఫోన్ చేస్తే వెంటనే మాకు తెలియజేయండి. మాలతి, మీ కొక విషయం చెప్తే భయం తొలగుతుంది! ఆ హిప్పీ గురించి నాకు చాలా సందేహాలున్నాయి. మీరు హిప్పీ మాటల్ని మర్చిపొండి! అతనేమీ చేయడు!"

ఆ తర్వాత జాన్ మాలతిని ఇంటిదగ్గర వదిలి ఆఫీసు కెళ్ళాడు.

లాల్‌తో హిప్పీ గురించి అంతా వివరించి చెప్పాడు.

"ఇందులో యేదో మిస్టరీ వుంది లాల్. ఉత్తరాలు వ్రాస్తుందెవరో తెలుసుకుంటేనే తప్ప అది తేలదు. దేవదాస్ అబద్ధాలు చెప్తున్నాడు."

లాల్ ఆలోచించాడు. ఆ తర్వాత అన్నాడు: "ఉత్తరాలెవరు వ్రాస్తున్నారో తేలాలంటే హిప్పీని వెంబడించాలి

లేదా మాలతి గురించి దర్యాప్తు చేయాలి—ఆమెకి ప్రేమికు డున్నాడేమో!"

4

సరిగ్గా రాత్రి ఎనిమిది గంటలకి ఏజన్సీ ఆఫీసులో ఫోన్ మోగింది.

ఒక కేసు తాలూకు ఫైలుతో బిజీగావున్న జాన్ పరధ్యానంగా రిసీవర్ ఎత్తి చెవిదగ్గర పెట్టుకున్నాడు.

"మిస్టర్ జాన్?" అవతలి పురుష కంఠం అడిగింది.

"యస్."

"మిస్టర్ జాన్, వెంటనే బయలుదేరి నా యింటికి వస్తారా? మీతో ఒక ముఖ్య విషయం మాట్లాడాలి" అస్పష్టంగా విన్పించాయి మాటలు.

ముఖం చిట్లించాడు జాన్. "క్షమించండి, మీరెవరో చెప్పలేదు."

"చలపతి అని పిలవండి" పిచ్చి పిచ్చి ధ్వనులతో సహా అవతలి కంఠం విన్పించింది.

"ఎక్కడినుంచి మాట్లాడుతున్నారు? ఏమిటి విషయం"

"క్షమించండి, ఫోన్‌లో చెప్పకూడదు. వెంటనే నా యింటికి రండి" అని అడ్రసు చెప్పాడు అవతలి వ్యక్తి. ఆ తర్వాత లైను కట్ అయింది.

జాన్ రిసీవర్ పెట్టేశాడు. ఆ తర్వాత ఆఫీసు మూసేసి కిందికివచ్చి కారెక్కాడు. వేగంగా డ్రైవ్ చేస్తూ తీవ్రంగా ఆలోచించసాగాడు.

ఆ మనిషి ఎక్కడనుంచి ఫోన్ చేశాడు? అతనెవరు? అతను మాట్లాడే విషయం ఏమిటి? జాన్‌కి ఒక విషయం మాత్రం కచ్చితంగా తెలుసు: అతను ఇంటినుంచి ఫోన్

చేయలేదు.

ఫోన్‌లో పిచ్చి పిచ్చి ధ్వనులు విన్పించాయి-అరుపులు, కేకలు, వహనాల చప్పుడు, హారన్స్....ఏ బూత్ నుంచైనా ఫోన్ చేసివుండవచ్చు. కానీ మళ్ళీ అతనితో మాట్లాడితే గొంతు గుర్తించడం అసాధ్యం!

ఆలోచనల్లో అడ్రసు ప్రకారం ఆ యిల్లు చేరుకున్నాడు జాన్—

అంబర్ పేటలో చిన్న డాబాయిల్లు. ఆ వీధి అంతా నిర్మానుష్యంగా, అంధాకారంగా వుంది. ఎక్కడా స్ట్రీట్ లైట్స్ వెలగడంలేదు.

జాన్ కార్లోనే కూచోని మూడుసార్లు హారన్ మోగించాడు. సమాధానంలేదు. ఇంట్లో దీపాలు వెలుగుతున్నాయి. కిటికీలు తెరిచివున్నాయి గానీ, తలుపు మూసివుంది.

జాన్ కేమీ అర్థంకాలేదు. తనని రమ్మని పిలిచిన మనిషి నిజానికి తనకోసం ఎదురుచూస్తూ బయట నిలబడాలి. ఇప్పుడు తను హారన్ మోగించినా సమాధానం లేదు!

కారుదిగి గేటు చేరుకున్నాడు. తాళం వేసిలేదు. గడియ తీసి లోనికి అడుగుపెట్టాడు.

అప్పుడే తలుపు తెరుచుకుని వరండాలోకి ఓ వ్యక్తి వచ్చాడు-ఇరవై ఏళ్ళ యువకుడు. గళ్ళలుంగీ, బనియన్ ధరించాడు-చేతిలో ఏదో పత్రికవుంది.

జాన్ గబగబ అతన్ని చేరుకుని, "హల్లో, మిస్టర్ చలపతి...." అన్నాడు.

ఆ యువకుడు వింతగా చూశాడు. జాన్ ఆశ్చర్యపోయాడు.

"ఎవరు మీరు? నాపేరు మీకెలా తెలుసు?" అతని

మాటలు ఇంకా విచిత్రంగా తోచాయి జాన్‌కి.

"మీరే చెప్పారు. ఫోన్‌చేసి నన్ను వెంటనే రమ్మన్నారు. మర్చిపోయారా?" బలవంతంగా నవ్వు తెచ్చుకున్నాడు జాన్.

"మిస్టర్! మీరెవరో నాకు తెలియదు! మీరనేదేమిటో అర్థంగావడంలేదు!" అర్చాడా యువకుడు.

జాన్ అసహ్యంగా చూశాడతన్ని. "లోనికెళ్ళి మాట్లాడుకుందాం రండి!"

జాన్ చేయి పట్టుకుని ఆపాడతను. "మిస్టర్!" మళ్ళీ అర్చాడు. "దొంగతనానికి ఇదేదో టెక్నిక్ కాదుకదా?"

జాన్ అతన్ని తీక్షణంగా చూసి ఫక్కున నవ్వాడు.

"నాకు చాలా టెక్నిక్స్ తెలుసుకానీ, మిస్టర్ చలపతి, వాటిని ఆచరణలో పెట్టే అదృష్టం నాకు లేదు!"

జాన్ మాటలు విని ఆ యువకుడు గమ్మత్తుగా చూశాడు.

"అయ్యోపాపం! ఎందుకులేదూ?"

"మీరనుకుంటున్నట్టు దొంగను కానందువల్ల. నా పేరు జాన్. డిటెక్షన్ ఈజ్‌మై బిజినెస్."

చలపతి ముఖంలో నవ్వు మాయమైంది. "డిటెక్టివా?"

"కమాన్, చలపతీ! పరాచికాలాడేందుకు నేనిప్పుడు మూడ్‌లో లేను!" జాన్ లోనికెళుతూ అన్నాడు. "ఎందుకు రమ్మన్నారో చెప్పండి! మీ నాటకం కట్టి అవతల పెట్టండి! కమాన్!"

జాన్‌వెనక పరిగెత్తి వచ్చాడు చలపతి. "మిస్టర్ జాన్! నాకేమీ అర్థంగావడంలేదు! నేను మిమ్మల్ని రమ్మన్నానా! ఎందుకు? డిటెక్టివ్‌తో నాకు పనేమిటి? మీరు పొరబడ్డారు జాన్—"

"అరగంట క్రితం మీరు ఫోన్ చేశారు చలపతి."

"ఫోన్! నేను చేయలేదు మిస్టర్ జాన్!"

"చేశారు. కచ్చితంగా మీకు జ్ఞాపకం చేయాలంటే బస్ డిపో నుంచి చేశారు—హారన్ శబ్దాలు, పాసింజర్స్ కేకలు, అనౌన్సర్ కంఠం నాకు స్పష్టంగా విన్పించాయి."

"జాన్, నా గొంతు మీరు గుర్తించారా? ఫోన్‌లో మాట్లాడింది నేనేనా!"

అడ్డంగా తలూపాడు జాన్. "ఫోన్‌లో కంఠం గుర్తించ వీల్లేకుండా అస్పష్టంగా విన్పించింది."

"ఇప్పుడు చెప్పండి—నేను ఫోన్ చేశానని యెలా అంటున్నారు?"

"ఫోన్‌చేసిన కంఠం తనపేరు చలపతి అని చెప్పింది. ఈ ఇంటి అడ్రస్సు చెప్పి వెంటనే రమ్మంది—ఏదో ముఖ్యవిషయం మాట్లాడేందుకు. సరిగ్గా ఎనిమిది గంటలకి మీరెక్కడ వున్నారు?"

"జైభారత్ విలాస్, చిక్కడపల్లి. భోజనం చేస్తున్నాను. ఎప్పుడూ అక్కడే చేస్తాను."

"ఇంట్లో ఎవరూ లేరా?"

"అంతా వూరికెళ్ళారు—సాయంత్రం ఏడు గంటలకి."

"బస్సులోనా?"

"అవును. జాన్, మీరు వేసే మరో ప్రశ్నకి కూడా సమాధానం ముందుగానే చెప్తున్నాను: వాళ్ళతో నేను బస్‌డిపోకి వెళ్ళలేదు. ఇంట్లోనే వున్నాను, వారపత్రిక చదువుతూ."

"ఊరికి ఎవరెవరు వెళ్ళారు?"

"అమ్మా, నాన్నా, చెల్లాయి" ప్రశాంతంగా చెప్పాడు చలపతి. "మచిలీపట్నం వెళ్ళారు. మిస్టర్ జాన్, నాన్న

మీకు ఫోన్‌చేసి వుండడని నా నమ్మకం. ఎందుకంటే ఆయనకి ముఖ్యవిషయాలంటూ ఏవీ వుండవు గనుక. ఒకవేళ ఫోన్ చేశాడనుకోండి, మిమ్మల్ని ఇంటికి రమ్మని చెప్పి తను బస్సెక్కేంత మతిమరుపు మా నాన్నకి లేదు. ఇక ఫోన్‌కాల్‌తో నాకు సంబంధం లేదు. మీరు డిటెక్షన్ చేస్తానంటే నా కభ్యంతరం లేదు."

జాన్ మాట్లాడలేదు. చలపతికి షేకాండిచ్చి వెనక్కి తిరిగి చకచక నడిచి కారు చేరుకున్నాడు. కారెక్కి స్టార్ట్ చేసి వేగంగా దూసుకుపోతూ ఆలోచించాడు. ఏమిటీ టెలిఫోన్ మిస్టరీ?

'జై భారత్ విలాస్'కి వెళ్తే కొన్ని సందేహాలు తీరుతాయని అతనికి తోచింది. కాబట్టి మరింత వేగంతో డ్రైవ్ చేస్తూ పదినిమిషాల్లో అక్కడికి చేరుకున్నాడు.

కౌంటర్‌వెనక కూచున్న ప్రొప్రయిటర్ సర్రున మీల్స్ టికెట్ చించి జాన్ ముందుకి విసిరి చెయ్యి జాపాడు డబ్బు కోసం. జాన్ మనీపర్సులోంచి విజిటింగ్ కార్డుతీసి అతని చేతిలో పెట్టాడు.

ప్రొప్రయిటర్ ఆ కార్డుని తికమకగా చూసి, "ఇంగ్లీషు రాదు" అన్నాడు.

జాన్ ఆ కార్డు తిరిగి తీసుకుని, "నేను అపరాధ పరిశోధకుడ్ని" అన్నాడు.

"అపరాధం! ఎవరుచేశారు!" ప్రొప్రయిటర్ అర్చాడు.

"మీరు కాదు, మీ పేరేమిటి?"

"పరంధామం."

"గుడ్. మీకు చలపతి తెలుసా?"

పరంధామం ముఖం ఒక్కసారిగా విచ్చుకుంది: "వాడు తెలీకపోడమేమిటి? వాడి నాన్నా నేనూ మచిలీపట్నంలో

కొబ్బరితోటలు పెంచుతున్నాం!"

"గుడ్. చలపతి ఇక్కడికి వచ్చాడా?"

"ఇంట్లో వాళ్ళంతా వూరికెళ్ళారు. ఇందాక వచ్చి భోజనం చేశాడు."

"ఎన్ని గంటలకి?"

"ఏడున్నర, ఎనిమిది ప్రాంతాల."

"థాంక్స్, అతనెవరికేనా ఫోన్ చేశాడా?"

"లేదు."

"థాంక్యూ వెరీమచ్" అని కాస్సేపు ఆలోచించాడు జాన్.

"చలపతి ఏం చేశాడు?"

తేరుకున్నాడు జాన్. "ఏమీ చేయలేదు. నేను ఫోన్ ఉపయోగించవచ్చా?"

పరంధామం తలూపాడు. జాన్ కాస్సేపు దిక్కులు చూశాడు. ఇంతలో కౌంటర్‌దగ్గర జనం పోగయ్యారు. పరంధామం బిజీగా వున్నాడు.

జాన్ రిసీవర్ ఎత్తి లాల్‌కి డయల్ చేశాడు.

ఈ రాత్రి అతనికి జరిగిన అనుభవమంతా వివరించి చెప్పాడు. జాన్ మాటలు అసహనంగా, పూర్తిగా విన్నాక "జాన్, నువ్వెక్కడ వున్నావు?" అనడిగాడు లాల్.

లాల్ చెప్పాడు.

లాల్ అవతలినుంచి నిట్టూర్చాడు. "జాన్, ఇందాక ఇన్‌స్పెక్టర్ కృష్ణన్ ఫోన్ చేశాడు___వెంటనే ఆఫీసుకి రమ్మని."

"ఎందుకు?"

"చెప్పలేదు. పదినిమిషాల క్రితం ఫోన్‌చేసి వెంటనే ఆఫీసుకి రమ్మన్నాడు. నాకేమీ అర్థంకాలేదు. ఏదో జరిగి

వుంటుందని అనుమానించాను. నువ్వు ఫోన్ చేస్తావని ఎదురుచూస్తున్నాను. ఏం జరిగింది జాన్?"

జాన్ పూర్తిగా ఆశ్చర్యపోయాడు. "జరిగింది నీకు చెప్పాను లాల్."

కాస్సేపు నిశ్శబ్దం. "ఆల్‌రైట్, జాన్. వెంటనే ఆఫీసుకి రా. నేనూ వస్తున్నాను. మనం వూహించనిది ఏదో జరిగింది—కృష్ణన్ ఎదురుచూస్తుంటాడు...."

జాన్ విసురుగా బయటికి వచ్చి, కారు స్టార్ట్‌చేసి వేగంగా డ్రైవ్ చేశాడు.

జాన్‌కి ఇప్పుడు సమాధానాలు దొరకని ప్రశ్నలు వేధిస్తున్నాయ్. ఫోన్ చేసిందెవరు? చలపతికి ఎలిబీ వుంది. ఒకవేళ అతని తండ్రి చేశాడా? ఎందుకు?

ఆఫీసు దగ్గరపడింది. దూరంగా ఆఫీసు బిల్డింగ్ దగ్గర ఒక పోలీస్ పాట్రోలింగ్ కారు, ముగ్గురు అధికారులు, సిగరెట్ తాగుతూ లాల్ కన్పిస్తున్నారు....

జాన్ గుండెలు వేగంగా కొట్టుకున్నాయి. ఏం జరిగింది? వాళ్ళంతా తనకోసమే యెదురు చూస్తున్నట్టు కనిపిస్తున్నారు.

తనేం చేశాడు?

కారు ఆఫీసు చేరుకుంది. ఇన్‌స్పెక్టర్ కృష్ణన్ వేగంగా కదిలి వచ్చాడు. జాన్‌కేమీ అంతుపట్టలేదు. లాల్ అక్కడే నిలబడి సిగరెట్ తాగుతున్నాడు. మరో ఇద్దరు అధికారులు కృష్ణన్ వెనక వచ్చారు.

కృష్ణన్ నవ్వుతూ చూసి, కార్లో చెయ్యి పెట్టి తాళం చెవులు తీసుకుని ఇన్‌స్పెక్టర్స్‌కి అందించాడు. వాళ్లు వెనక్కి తిరిగారు.

జాన్ అలాగే కళ్ళప్పగించి చూస్తున్నాడు.

కృష్ణన్ మళ్ళీ నవ్వాడు. "వెల్, జాన్. శవాల్ని రవాణా చేయడం ఎప్పటినుంచీ?"

5

ఇన్‌స్పెక్టర్స్ అర్చారు: "ఇటీజ్ ఓ.కే., సర్!"

"డిక్కీ మూసేయండి" కృష్ణన్ ఆజ్ఞాపించాడు. "మిస్టర్ జాన్, మీరు కారు దిగి మా కారు ఎక్కండి. ఐ పిటీ యూ!"

జాన్ హఠాత్తుగా తేరుకుని పరిస్థితి గ్రహించాడు. లాల్ స్థంబం దగ్గిర నిల్చుని తాపీగా సిగరెట్ కాలుస్తున్నాడు.

"ఇన్‌స్పెక్టర్," జాన్ కారుదిగి కృష్ణన్‌తో అన్నాడు. "వాట్ హేపెండ్?"

"మిస్టర్ జాన్! యూ ఆర్నాట్ ఇన్నోసెంట్! క్లవర్, టూ క్లవర్!"

"కృష్ణన్," జాన్‌కి సహనం చచ్చిపోయింది. "నా కార్లో శవం యెలా వచ్చింది? యెవరు చెప్పారు మీకు?"

కృష్ణన్ కోపంగా చూశాడు. "జాన్, ప్రశ్నలు అడగవలసింది నేను! కారెక్కండి! మీ కార్లో శవాన్ని మీరే వేసుకుని వచ్చారు! మాకు సమాచారం అందింది!"

"ఏమని?"

"స్టాపిట్! కారెక్కండి!"

నిస్సహాయంగా చూశాడు జాన్. లాల్ కదిలివచ్చాడు. "జాన్, నువ్వు కార్లో శవాన్ని తీసుకుని ఆఫీసుకి వస్తున్నట్టు యెవరో ఫోన్ చేశారు కృష్ణన్‌కి."

"ఎవరి శవం? ఫోన్ ఎవరు చేశారు?"

"ఫోన్ యెవరు చేశారో కనుక్కుంటాను జాన్.

కృష్ణన్, మాకు శవాన్ని చూపించండి—ఎవరిదో తెలుసు కోవాలి."

"ఓ. కే." తాళంచెవి తీసుకుని డిక్కీ వేపు కదిలాడు కృష్ణన్.

మరు నిమిషం డిక్కీ తెరువబడింది.

స్ట్రీట్ లైట్స్ వెలుగులో డిక్కీలో అస్పష్టంగా ఒక ఆకారం కన్పిస్తోంది. డిటెక్టివ్ లిద్దరూ దగ్గరికెళ్ళి చూసి ఉలిక్కిపడి వెనక్కి అడుగువేశారు.

కడుపులో కత్తితో, రక్తంతో తడిసిన చొక్కాతో, జీవంలేని కళ్ళతో చూస్తున్నాడు...హతుడైన హిప్పీ— మాలతిని వెంటాడే హిప్పీ.

"జాన్, ఏమిటిది?" లాల్ ప్రశ్న.

"ఈ శవం యెక్కడినుంచి వచ్చిందో నువ్వు వూహించ గలవు" జాన్ సమాధానం.

"అతనికీ ఇతనికీ సంబంధం ఏమిటి?" లాల్ ప్రశ్న.

కృష్ణన్ కోపంగా అర్చాడు. "ఏమిటి కేసు రోడ్డుమీదే తేల్చేస్తారా! కేసు తేల్చవలసింది నేనూ! కారెక్కండి జాన్—"

"కృష్ణన్, నేను లాల్‌తో కొన్ని విషయాలు మాట్లాడాలి. అనుమతిస్తారా?"

"ఇవ్వను! దిసీజ్ లా! కారెక్కండి?"

"ఆల్‌రైట్ జాన్, నువ్వు కారెక్కు" లాల్ అన్నాడు. "నువ్వేమీ చెప్పనవసరంలేదు. ఏం చేయాలో నాకు తెలుసు."

"విష్యూ గుడ్‌లక్ లాల్!"

"థాంక్స్. గుడ్‌నైట్ జాన్!"



6

లాల్ టాక్సీదిగి అటూ ఇటూ చూశాడు. ఎక్కడా స్ట్రీట్ లైట్స్ వెలగడంలేదు. టాక్సీవాడ్ని పంపించేసి ఆ యింటి గేటు తెరిచాడు.

ఇంట్లో దీపాలు వెలుగుతున్నాయి. సమయం సరిగ్గా తొమ్మిదీనలభై. లాల్ చక చక నడిచి వరండా చేరుకుని తలుపుమీద చప్పుడు చేశాడు. రెండు నిమిషాలు గడిచాక తలుపు తెరుచుకుంది-చేతిలో పత్రికతో ప్రత్యక్షమయ్యాడు చలపతి.

చలపతిని చూసి, లాల్ నవ్వి లోనికి అడుగువేశాడు. చలపతి ముఖం కోపంతో యెర్రబడింది. చేతిలో పత్రికను నలిపేస్తూ లాల్ని చూసి, "ఎవరు మీరు?" అని గర్జించాడు.

చెప్పాడు లాల్.

"ఓహ్ గాడ్!" చలపతి అర్చాడు. "నాకు పిచ్చెక్కుతోంది! గెటవుట్ ఆఫ్ హియర్!"

"చూడబ్బాయ్, నువ్వు చాలా బాగా నటిస్తున్నావు?"

"అబ్బాయ్? నేనా!"

"నువ్వే! మిస్టర్, నువ్వు మర్డర్ చేశావు. మమ్మల్ని ఇరికించావు. జాన్‌ని ఇక్కడికి పిలిచి అతని కార్లో హిప్పీ శవాన్ని యెక్కించావు—"

"స్టాపిట్! మర్డర్ చేశానా? హిప్పీనా!" చలపతి విపరీతంగా చెమటలు కక్కుతున్నాడు.

"అవును, దేవదాస్" ప్రశాంతంగా అన్నాడు లాల్. "అతను నీకు తెలుసుకదూ? ఇక చెప్పు, అతన్ని ఎందుకు చంపావు?"

చలపతి పిచ్చిగా అర్చి పత్రిక చింపేశాడు.

లాల్ మౌనంగా చూస్తున్నాడు.

"గాడ్! హిప్పీ చచ్చాడా! ఎవరు చంపారు లాల్?"

పరీక్షగా చూశాడు లాల్. "నువ్వు కాదా?"

"కాదు. వాడ్ని చంపే అవసరం నాకులేదు! మిస్టర్ లాల్—" ఏడ్వడానికి సిద్ధంగా వున్నాడు చలపతి. "మిస్టర్ లాల్! నన్ను రక్షించండి! ఇలా జరుగుతుందనుకోలేదు-ఈ వ్యవహారం ఇలా బెడిసి కొడుతుందనుకోలేదు!"

"ఏ వ్యవహారం?"

"నన్ను రక్షిస్తానని మాటివ్వండి—చెప్తాను."

"నువ్వు నేరంచేస్తే నేను రక్షించలేను!"

"పగతీర్చుకోడం నేరమా, మిస్టర్ లాల్?"

"ఏమిటి నీ పగ?"

"మాలతి అనే అమ్మాయి మీద నాకు పగరగిలింది."

"ఎందుకు?"

"ఆమె నన్ను అవమానించింది. నేనూ అవమానిస్తే నా పగ తీరుతుంది! ఇరవై రోజులక్రితం ఫ్రెండ్స్‌తో

నేను పందెం కట్టాను-వంద రూపాయలు-మాలతి చేతిని ముద్దాడితే ఆ డబ్బు ఇస్తామన్నారు ఫ్రెండ్స్! కాలేజీలో పదిమంది అమ్మాయిల ముందు ఆమె చేతిని ముద్దాడాను-వంద రూపాయలు గెలుచుకున్నాను. అది వేరే విషయం.

"కానీ, నేను వూహించనిది ఒకటి జరిగింది-మాలతి నా చెంప వాయించింది! అంతా ఫక్కున నవ్వారు! నా ఫ్రెండ్స్ కూడా నవ్వేశారు! తీరని అవమానం!"

"మాలతి మీద పగతో ఏంచేశావు?"

"ఆ హిప్పీని యెన్నుకున్నాను. మాలతిని వెంబడించ మన్నాను-క్షణం వదలకుండా - అందుకు రోజుకి పది రూపాయలిస్తున్నాను. వారం రోజులనుంచి ఆ హిప్పీ ఆమెని వెంబడిస్తోన్నాడు. ఆమె పడే అవస్థచూసి ఆనం దిస్తున్నాను! ఆమెని ఇంకా ఏడిపించేందుకు ఉత్తరాలు వ్రాస్తున్నాను. ఆమెనేగాక ఆమె తండ్రిని కూడా వేధించ సాగాను-ఫోన్ కాల్స్ చేస్తూ.

"ఉత్తరాలు వ్రాస్తోందీ, ఫోన్ చేస్తోందీ నువ్వేనా?"

గతుక్కుమన్నాడు చలపతి. "మీకెలా తెలుసు లాల్?"

"మాలతి తండ్రితో సహా మమ్మల్ని కలుసుకుంది."

"గాడ్, కలుసుకుని?"

"ఆ హిప్పీ పీడ తొలగించమని చెప్పారు. జాన్ హిప్పీని కలిశాడు. హిప్పీ నీతో చెప్పలేదా?"

"చెప్పలేదు!" చలపతి ముఖంలో నెత్తురు చుక్క లేదు.

"ఫోన్ కాల్స్ యెక్కడనుంచి చేస్తున్నావు?"

"కాలేజి దగ్గర హోటల్‌నుంచి."

"మాలతి తండ్రిని చంపుతానని యెందుకు బెదిరించావు?"

"సరదాకి. వాళ్ళని యెంత ఏడిపిస్తే నాకంత ఆనందం! మాలతిని ప్రిన్సిపాల్ సంజాయిషీ అడిగినప్పుడు ఆమె యెంత ఏడ్చిందో నేనంత సంతోషించాను! హిప్పీ ఆమెని వెంబడిస్తోంటే ఆమెకి ఫ్రెండ్స్ దూరమయ్యారు! కాలేజీలో రకరకాలు పుకార్లు చేసారు. మిస్టర్ లాల్. నేను చాలా మంచివాడ్ని. ఆమె నన్ను అంత ఘోరంగా అవమానిస్తే ఆమెనెలా శిక్షించాలో నాకు తెలిసినా—ఆ నీచపు పనికి ఒడిగట్టలేదు!"

"ఆల్‌రైట్, ఇక ఈ హత్య గురించి చెప్పు!"

"నాకేమీ తెలియదు. అది పరమానందం పనై వుంటుంది. నాకు సహకరిస్తున్న మనిషిని నేనెందుకు చంపుతాను లాల్?"

"డబ్బు పేచీ వచ్చిందా?"

"ఏమిటి మీరనేది?"

"డబ్బు విషయంలో నువ్వూ, హిప్పీ తగవులాడుకున్నారా?"

"నాన్సెన్స్! దేవదాస్‌ని నేను బాగా మేపుతున్నాను."

"హిప్పీలు మానసిక పీడితులు. వారితో యెంత బాగా వ్యవహరించినా చిక్కులు వస్తాయి."

"దయచేసి అతన్ని హిప్పీ అని పిలవకండి! దేవదాస్‌తో నాకు తగవురాలేదు."

ఆ తర్వాత లాల్ మాట్లాడలేదు. రెండు నిమిషాలు ఆలోచించి ఆ తర్వాత అడిగాడు. "చలపతి, జాన్‌ని పిలిచిందెవరు?"

"మిస్టర్ లాల్, దేవదాస్‌ని చంపేందుకు నాకంటే పరమానందానికే మోటివ్ వుంది. మీరే ఆలోచించండి. అతను ఫోన్ చేసి వుండకూడదా?"

లాల్ చిన్నగా నవ్వాడు. "చలపతి, నేనిప్పుడు అడగ బోయే ప్రశ్నకి సమాధానం చెప్పలేవనుకుంటాను."

అనుమానంగా చూశాడు చలపతి. "అడగండి."

"నువ్వు హోటల్‌లో భోజనం చేయడానికి కారణం ఏమిటి? ఇంట్లో వంట చేయలేదా?"

చలపతి ముఖం యెర్రబడింది. "నా కర్థం కావడం లేదు!"

"నీ తలిదండ్రులు సాయంత్రం ఏడు గంటల బస్సుకి మచిలీపట్నం వెళ్లారు. అవునా? చేసేది దూరప్రయాణం-బయలుదేరేది భోజన సమయానికి. వాళ్ళు ఇక్కడ భోజనంచేసే బయలుదేరారనుకుంటాను?"

"అవును."

"వెరీగుడ్. ఇప్పుడు చెప్పు-వండిందంతా వాళ్ళే తినేసి వెళ్ళిపోయారా, నీకు మిగల్చకుండా?"

చలపతి సూటిగా చూశాడు. "నేను ఇంట్లో భోజనం యెందుకు చేయలేదో తెలుసుకోవాలి. అంతేనా?"

"అంతే."

"నాతో రండి."

"ఎక్కడికి?"

"వంట గదికి."

లాల్ లేచాడు. ఇద్దరూ వంట గదిలోకి నడిచారు.

"చూడండి"

లాల్ చూశాడు. గదిలో గిన్నెలు చిందర వందరగా పడివున్నాయి. నేలమీద పడ్డ పదార్థాల్లో చెంచాలు కన్పిస్తున్నాయి.

"ఎవరు చేశారు?" లాల్ అడిగాడు.

"పిల్లి అనుకుంటాను___"

"మరి శుభ్రం చేయలేదేం? నాకు చూపించేందుకు అలాగే వదిలేశావా?"

"అంటే, ఈ పని నేను చేశానంటున్నారా?"

లాల్ సమాధానం ఇవ్వలేదు.

తిరిగి హాల్లోకి వచ్చారు.

"చలపతీ, నీ తలిదండ్రులని బస్సు యెక్కించడానికి నువ్వెళ్ళకపోవడం నా కాశ్చర్యంగా వుంది!"

"నాన్సెన్స్! మీ మెదడునిండా అనుమానాలే!" కసురుకున్నాడు చలపతి. "లాల్, ఇక మీ ప్రశ్నలకి సమాధానాలివ్వను! నేను హత్య చేయలేదు. ఏంచేశానో మీకు చెప్పాను. ఇంకేమీ అడక్కండి. ప్లీజ్ వెళ్ళిపోండి!"

"చలపతి! శవం మీ ఇంటినుంచి వెళ్ళిందని మరువకు! నువ్వు మాకు చాలా ముఖ్యం. నీ గురించి పోలీసులకి ఇంకా చెప్పలేదు."

చలపతి వణికాడు. "దయచేసి చెప్పకండి. ఈ వ్యవహారంలో నా భాగమెంతో మీరు తెలుసుకున్నారు."

లాల్ బయిటికి నడిచాడు. "నువ్వు నాతో రావాలి."

"ఎందుకు?"

"హత్య గురించి వీధిలో దర్యాప్తు చేయాలి. చీకటిగా వుంది. టార్చి పట్రా!" మారు మాట్లాడకుండా చెప్పినట్లు చేశాడు చలపతి.

ఇద్దరూ వీధిలోకి వచ్చారు.

"లైట్లేమయ్యాయి? చీకటిగా వుంది?" లాల్ అడిగాడు.

"అవును లాల్! మీకో విషయం చెప్పాలి. హోటల్ కెళ్ళినప్పుడు ఈ వీధిలో లైట్లు వెలుగుతున్నాయి. కానీ తిరిగి వచ్చినప్పుడు చీకటిగా వుంది."

"అదెలా జరిగింది? అన్ని బల్బులూ ఒకేసారి ఎలా కాలుతాయి?" లాల్ టార్చి కాంతి స్ట్రీట్ లైట్ స్థంభం మీద వేశాడు. బల్బులేదు. కింద నేలమీద గాజు ముక్కలు పడివున్నాయి—వరసగా నాలుగు స్థంభాలూ అలాగే దర్శన మిచ్చాయి.

"అర్థమైందా? బల్బుల్ని ఎవరో పగులగొట్టారు" అన్నాడు లాల్.

ఆశ్చర్యపోయి చూశాడు చలపతి.

లాల్ టార్చికాంతి గేటు దగ్గర వేశాడు. తారు రోడ్డు కావడంవలన టైరు గుర్తులు కన్పించలేదు. అలాగే కొంత దూరం నడిచాడు. ముప్పై గజాల దూరాన సిగరెట్ పీకలు కన్పించాయి. చార్మినార్ బ్రాండ్ సుమారు పది వున్నాయి. వాటిని స్వాధీనం చేసుకున్నాడు.

ఆ తర్వాత లాల్ ఒక ఇంటి గేటు దగ్గర నిలబడి చప్పుడు చేశాడు. మరుక్షణం ఇంట్లోంచి ఓ స్త్రీ వచ్చింది. ఆమె కంగారుగా వచ్చి, "ఇంత ఆలస్యమైందేం?" అని అడిగింది.

"క్షమించండి నేను...." అంటున్నాడు లాల్.

ఆమె ఉలిక్కిపడి అరవబోయింది: "మీరెవరు?"

"నేను మీతో ఒక విషయం మాట్లాడాలి."

"దేనికి? ఏం జరిగింది? యెవరి తరపున వచ్చారు?"

"మీరంత గాభరాపడవలసిన విషయం కాదు. ఈ వీధి చీకటిగా యెందుకు వుంది."

ఆమె ఇంకా అనుమానంగా చూసింది.

"చెప్పండి!"

"ఎందుకు? ఏం చేశారు ఆ కుర్రాళ్ళు?"

"ఏ కుర్రాళ్ళు?"

"మీకు తెలీదా? జేబు దొంగలు!"

"ప్లీజ్, ప్రశాంతంగా చెప్పండి. వాళ్ళని చూశారా?"

"బాల్కనీలో నిలబడి ఆయన కోసం యెదురు చూస్తున్నాను. ఇంత రాత్రయినా ఆయన యెందుకు రాలేదో అర్థం గాలేదు. సుమారు యెనిమిది గంటలకు అనుకుంటాను, వీధిలో ఇద్దరు కుర్రాళ్ళు కన్పించారు. చేతుల్లో రాళ్ళున్నాయి. గబగబ వురుకుతూ నిమిషాల్లో ఆ బల్బులన్నీ పగులగొట్టేశారు."

"వాళ్ళు జేబుదొంగలా?"

"అవును. నాకు తెలుసు! బస్స్టాపులో చాలాసార్లు చూశాను."

"వయసెంత వుంటుంది?"

"పదహారు ఇరవై మధ్య వుంటుంది."

"వాళ్ళెక్కడ వుంటారో మీకు తెలుసా?"

"ఎక్కువ బస్టాపులో కన్పిస్తుంటారు - మలక్‌పేట ప్రాంతాల."

"బల్బులు పగలగొట్టి యెటు వెళ్ళారు?"

"కుడివేపు. ఈ వీధిలో నేను తప్ప యెవరూ చూడలేదు. లేకపోతే గొడవ అయ్యేది. వాళ్ల దోచుకోడానికి అలా చేశారని నాకు తెలిసినా యెవరికీ చెప్పలేదు. తలుపు లేసుకుని భయంగా ఇంట్లోనే కూచున్నాను."

"ధన్యవాదాలు. ఆ దొంగల్ని వర్ణించగలరా?"

"ఒకడు నల్లగా వుంటాడు. చేతిలో కడియం వుంటుంది. మరొకడు కాస్త తెలుపు. కాలర్‌లో యెర్ర రుమాలు వుంటుంది. మలక్‌పేట ప్రాంతాల బస్‌స్టాప్స్‌లో కన్పిస్తారు. సరే, ఏం జరిగింది? మీ డబ్బు కొట్టేశారా?" అడిగిందామె.



"నా దగ్గర డబ్బు వుండదు" అన్నాడు లాల్.

ఆమె నవ్వింది. "ఆయన యెవరు? అరె! చలపతీ! నువ్వా?"

"అవునండీ."

"ఏమిటి ఏం జరిగింది?"

"ఏమీ లేదు" అన్నాడు లాల్. "మీరు నిశ్చింతగా వుండండి. అడుగో మీ ఆయన వచ్చేస్తున్నారు."

"మీకెలా తెలుసు?" స్కూటర్‌పైన వస్తోన్న ఆకారాన్ని చూసి అడిగిందామె.

"నాకెలా తెలుసు?" నవ్వాడు లాల్. "ఊహించాను. నేను డిటెక్టివ్‌ని. నా పేరు లాల్."

"కాంతిలాల్!" ఆశ్చర్యంగా అర్చిందామె.

7

లాల్ చకచక నడిచాడు టాక్సీ దిగి. ఎదురుగా కిళ్లీ కొట్టు దగ్గర ఆగి సిగరెట్టు పాకెట్టు కొని ఒక సిగరెట్ ముట్టించాడు.

సమయం పదకొండున్నరవుతోంది. మలక్‌పేట బస్

స్టాప్‌లో యెవరూ లేరు. చలికి రిక్షావాళ్లు ముసుగు తన్ని పడుకున్నారు.

లాల్ కిళ్లీషాపతన్ని చూశాడు. అతను అదోలా చూసి, "మిగతా డబ్బు ఇచ్చానుకదా సార్?" అన్నాడు.

"ఇచ్చావు. ఒక మాట అడగాలి."

"ఏమిటి?"

"ఈ ప్రాంతాల నీకు జేబుదొంగలు తెలుసా?"

ఉలిక్కిపడ్డాడు. "మీరెవరు?"

"నా జేబు యెవరో కొట్టేశారు. ఆ పర్సులో డబ్బు లేదుగానీ, విలువయిన కాయితాలున్నాయి."

"పోలీసు రిపోర్టు యివ్వలేదా?"

"ఇవ్వలేదు. ఈ ప్రాంతాల జేబుదొంగ లెవరు?"

అతను భయంగా చూశాడు.

"చెప్పు! నువ్వు చెప్పినట్టు ఎవరికీ తెలియదు. నీకు బహుమతి యిస్తాను."

"వాళ్లు చాలా కిరాతకలు. ఈ ప్రాంతాల చాలా మంది వున్నారు. కానీ, వాళ్లల్లో ఇద్దరు మాత్రం ఘరానా దొంగలు!"

"ఎలా వుంటారు?"

"సమీర్‌గాడు కాలర్లో ఎర్ర రుమాలు పెడతాడు. నర్సిగాడి చేతిలో కడియం వుంటుంది. మీ పర్సును ఎవరు కొట్టారో మీకెలా తెలుసు?"

"వీళ్లిద్దరూ ఎక్కడ వుంటారు?"

అతను టైం చూశాడు. "కరెక్టు అడ్రసు చెప్పాలంటే ఇప్పుడు కమల్ థియేటర్ దగ్గర వుంటారు. ఇంటర్వెల్ సమయం-పదో పాతికో సంపాయించుకుంటారు."

"వెరీ గుడ్" అతనికి పది రూపాయలు అందించాడు

లాల్.

"జాగ్రత్త! వాళ్లతో పేచీ పెట్టుకోకండి!" హెచ్చరించాడతను.

లాల్ వెనక్కి తిరిగి ఆటో యెక్కి కమల్ థియేటర్ దగ్గర దిగాడు.

అప్పుడే ఇంటర్వెల్ అయింది. కొత్త పిక్చరు. జనం యెక్కువగా వున్నారు. కాబట్టి లాల్‌కి కావలసిన మనుషులు కన్పించడంలేదు. తిరిగి ఆట ప్రారంభమైతే తేలిగ్గా కన్పిస్తారు. లాల్ యెదురుగా ఇరానీకేఫ్‌లో కెళ్ళి టీ తాగాడు. ఆ తర్వాత పరమానందానికి ఫోన్ చేశాడు.

"మిస్టర్ పరమానందం! రాత్రి యెనిమిది గంటలకి బస్ డిపోకి మీరెందుకెళ్ళారు?"

"ఏమిటి మీరనేది?"

"మీరు జాన్‌కి యెందుకు ఫోన్ చేశారు?"

"నేనా? లేదే! నేనెవరికీ ఫోన్ చేయలేదు. ఫోన్ అంటే భయం పట్టుకుంది ఆ హిప్పీగాడివల్ల—"

"హిప్పీ మళ్ళీ ఫోన్ చేశాడా?"

"లేదు. కానీ సాయంత్రం మాలతి వెంటబడ్డాడు."

"యెన్ని గంటలకి?"

"సుమారు ఏడు గంటలకి. ఆమె కూరగాయలకి వెళ్ళి వచ్చింది."

"మిస్టర్ పరమానందం. హత్యకు మీరు నియమించిన జేబుదొంగల్ని నేను పట్టుకోబోతున్నాను...."

"హత్య!" పరమానందం అర్చాడు. "లాల్! ఎవరి హత్య?"

"హిప్పీ హత్య" అన్నాడు లాల్. "మీరు చేయించారు కదూ?"

"ఏమిటి మీరనేది? హిప్పీ చచ్చాడా! ఎవరు చంపారు? నేనా?"

"అవును. మీరు. హత్య మీరు చేయించినట్టు ఆ జేబు దొంగలతో చెప్పిస్తాను. గుడ్ నైట్."

రిసీవర్ పెట్టేసి బయటికి వచ్చాడు లాల్.

ఇప్పుడు థియేటర్‌దగ్గర జనంలేరు. నిర్మానుష్యంగా వుంది. చకచక నడిచాడు లాల్. థియేటర్ ఆవరణలో యెవరూ లేరు. చుట్టూ కలయజూసి బయటికి వచ్చాడు.

అప్పుడు కన్పించారు ఇద్దరు కుర్రాళ్ళు. ఆనవాలు సరిపోయాయి. కిళ్ళీకొట్టుదగ్గర బీడీ కాలుస్తూ నిలబడ్డారు.

లాల్ వాళ్ళని చేరుకుని నవ్వుతూ చూశాడు. వాళ్ళు ఆశ్చర్యంగా చూశారు.

లాల్ సిగరెట్ వెలిగించి, "కలెక్షనెంత?" అనడిగాడు.

వాళ్లు బిత్తరపోయారు.

"సమీర్, నిన్నే అడుగుతున్నాను—కలెక్షనెంత?"

"యెవర్నువ్వు?"

"మాటలు మర్యాదగా పలుకు. నా జేబులో పిస్తోలు వుంది" తన్నాడు లాల్ కర్కశంగా. ఆ తర్వాత వెనక్కి తిరిగి చప్పట్లు చరిచాడు, "టాక్సీ!"

రివ్వుమని దూసుకువచ్చి పక్కన ఆగింది టాక్సీ.

లాల్ పిస్తోలు గురిపెట్టి అర్చాడు, "కారెక్కండి!"

ఆ యిద్దరూ భయంగా చూశారు. చుట్టూ జనం మూగారు.

"కారెక్కండి! లేదా కాల్చేస్తాను!"

డ్రైవర్ డోర్ తెరిచాడు.

జేబుదొంగలు భయపడుతూ కారెక్కారు. ముందు సీట్లో కూచున్నారు.

లాల్ వెనకసీట్లో కూచోని, "డ్రైవర్ పోసీయ్!" అన్నాడు,

కారు స్టార్టయింది. "యెక్కడికి? ..." అడిగాడు డ్రైవర్.

"పోలీస్ హెడ్‌క్వార్టర్స్."

కారు రివ్వున దూసుకుపోతోంది.

"అయితే మీరు పోలీసా! మమ్మల్నెందుకు పట్టుకున్నారు?" సమీర్ అడిగాడు.

"హిప్పీని యెందుకు చంపారు?" అడిగాడు లాల్.

వాళ్ళిద్దరూ కొయ్యబారిపోయారు. "మేం చంపలేదు! ...."

"బల్బులెందుకు పగలగొట్టారు?"

యెవరూ మాట్లాడలేదు.

"చెప్పండి!" అర్చాడు లాల్.

అయినా యెవరూ మాట్లాడలేదు.

"ఆల్‌రైట్. మిమ్మల్ని పోలీసుల కప్పగిస్తాను. మీ వాళ్ళు మాలీషచేస్తే తప్ప నోరు విప్పరన్నమాట?"

"మిస్టర్! మేం యెవర్నీ చంపలేదు! మేం హంతకులం కాము! జేబుదొంగలం!" సమీర్ అర్చాడు.

"ఆల్‌రైట్, నాతో యేమీ చెప్పనవసరంలేదు. పోలీసులకి చెప్తే చాలు."

యెవరూ మాట్లాడ లేదు. ప్రయాణం నిశ్శబ్దంగా సాగింది. ఇరవై నిముషాల్లో గమ్యస్థానం చేరుకున్నాక కారాగింది.

ఇన్‌స్పెక్టర్ బాలకృష్ణన్‌కు వాళ్ళిద్దరినీ అప్పగించి, జరిగింది చెప్పాడు లాల్.

పోలీసులు వాళ్ళిద్దరికీ ప్రథమ చికిత్స మొదలెట్టారు.

ఇన్‌స్పెక్టర్ కృష్ణన్ ప్రశాంతంగా, మృదువుగా అడిగాడు: "ఇక మీరు తప్పించుకుని వెళ్ళలేరు. నా ప్రశ్నలకి సమాధానా లివ్వకపోతే ఇక చిత్రహింసకి గురవుతారు. మిమ్మల్ని మృత్యువుకి దగ్గరగా దూరంగా, దగ్గరగా దూరంగా తీసికెళతాను. కమాన్! స్పీకప్!"

సమీర్ నోరు విప్పాడు, బలహీనంగా అన్నాడు: "మేము అతన్ని చంపాలని చంపలేదు...."

అందరూ షాక్ తిన్నారు.

"ఎందుకు?"

"నెక్లేస్‌కోసం! అప్పుడతను ఓ అమ్మాయిని వెంటాడుతున్నాడు. ఆ వీధి చీకటిగా వుంది. ఆ అమ్మాయి మెడలో బంగారపు నెక్లేసు వుంది. దాన్ని కాజేయాలని వెంటాడాం. హిప్పీ ఈ విషయం పసిగట్టి అడ్డుపడ్డాడు. ఆ అమ్మాయి వెళ్ళిపోయింది.

ఆమెమీద చేతులేస్తే నరికేస్తానని కత్తి తీసి బెదిరించాడు హిప్పీ. తీవ్రంగా కొట్టుకున్నాం. అతను కత్తితో మా మీదికి దాడి చేశాడు. నర్సిగాడు కత్తి లాక్కుని కడుపులో పొడిచాడు. అంతే! హిప్పీ చచ్చిపోయాడు...."

లాల్, జాన్ ఒకర్నొకరు చూసుకున్నారు.

"అయితే శవాన్ని కార్లో యెలా యెక్కించారు? జాన్ మీకు తెలుసా?" కృష్ణన్ అడిగాడు.

"ఆయన తెలియదు. హిప్పీ చచ్చాక అతన్ని పక్కనే వున్న సందులో పాడుబడ్డ ఇంట్లో పడేసాం. వెంటనే పారిపోవాలనుకున్నాం.

"కాని, నర్సిగాడు శవం జేబులు వెతికాడు—డబ్బు కోసం. అప్పుడొక విజిటింగ్‌కార్డు దొరికింది. దానిమీద జాన్ అడ్రసు వుంది.

"అప్పుడే ఆ ప్రక్కయింట్లో వాళ్లు వూరికెళుతున్నారు. కానీ, గళ్ళలుంగి కట్టుకున్నతను వెళ్ళడంలేదు.

"సార్, శవాన్ని అలాగే వదిలేస్తే మాకు ప్రమాదం. అందుకు ఒక మార్గం ఆలోచించాం. ఆ వూరికెళుతున్న వారిని బస్‌డిపోవరకు వెంబడించాం.

"వాళ్ళు బస్సు యెక్కాక నేను నెమ్మదిగావెళ్ళి వాళ్ళని అడిగాను: రామారావు వూరికి వెళ్ళడం లేదా అని. వాళ్ళకి అర్థం కాలేదు. రామారావు నా ఫ్రెండని చెప్పాను. వాళ్లు అతనెవరో తమకి తెలియదన్నారు. నేను ఆశ్చర్యం నటించి అతను మీ అబ్బాయి కాదా అని అడిగాను. వాళ్లు కాదని చెప్పి చలపతి తమ అబ్బాయి అని చెప్పారు. క్షమాపణ చెప్పి వెళ్ళిపోయాను.

"వెంటనే బస్‌డిపో నుంచి జాన్‌కి ఫోన్ చేశాను. చలపతిలా నటించి, అడ్రసుచెప్పి, ఇంటికి రమ్మన్నాను. ఆ తర్వాత ఆ వీధిలో దీపాలు పగులగొట్టి చీకటిచేసి కాచుకున్నాం.

"జాన్ డిటెక్టివ్ అని మాకు తెలుసు. తప్పక కార్లో వస్తాడు. ఇంట్లోకి వెళ్ళి వచ్చేలోపున అతని డిక్కీలో శవం యెక్కించాలనుకున్నాం.

"అలాగే చేశాం. ఆ తర్వాత వెళ్లిపోయాం. అంతే. వెంటనే మీకు ఫోన్‌చేసి జాన్ శవంతో ఆఫీసుకి వస్తున్నట్టు చెప్పి ఇక ఆ హత్య విషయం మర్చిపోయాం. అంతేసార్, జరిగింది. అంతా మీకు చెప్పేశాను...."

కృష్ణన్, లాల్‌నీ జాన్‌నీ చూసి తలెగరేశాడు.

లాల్ నవ్వి, "చాలా మంచి ప్లాను వేశారు మీరు!" అన్నాడు.

సమీర్ బలహీనంగా నవ్వాడు. "అవును సార్, అలా

చేస్తే చలపతి హంతకుడవుతాడనుకున్నాం. పొరపాటు ఎక్కడ జరిగిందో నాకు తెలుసు. మేం లైట్లు పగులగొడుతున్నప్పుడు యెవరైనా చూసి మీకు చెప్పివుండాలి. అంతేనా సార్?"

లాల్ తలూపాడు. "మీరప్పుడు వేషం మార్చుకోవలసింది."

"మేం మామూలు జేబుదొంగలం. అంత దూరం ఆలోచించలేదు."

"ఆల్‌రైట్. ఆ అమ్మాయిని రక్షించడానికి హతుడయ్యాడన్న మాట హిప్పీ!" అని కృష్ణన్‌వేపు తిరిగాడు లాల్. "ఇన్‌స్పెక్టర్, హంతకుల్ని మీకు అప్పగించాను. ఇక మేం వెళ్ళవచ్చా?"

"లాల్! యూ హేవ్ డన్ ఎ మిరకిల్!" షేకాండిచ్చాడు కృష్ణన్.

"థాంక్స్! గుడ్‌నైట్."

జాన్‌తో బయటికి వచ్చాడు లాల్.

"లాల్, నాకంతా అయోమయంగా వుంది!"

జాన్ మాటలకి నవ్వాడు లాల్. "జాన్, పరిస్థితులు విచిత్రంగా కలిపివచ్చాయి. నాకు హిప్పీమీద చాలా జాలిగా వుంది. మాలతికోసం ప్రాణాలు త్యాగం చేశాడు....ఈ సంగతి ఆమెకి తెలియదు!

"ఇదంతా చలపతి పందెం కట్టడం వలన వచ్చిన చిక్కు. ఇప్పుడు గుణపాఠం నేర్చుకున్నాడు. జరిగినదానికి యెవరు యెవర్ని నిందించుకుంటారో మనకి అనవసరం. నిన్ను రక్షించాను. నాకు సంతోషంగా వుంది...."

"థాంక్స్ లాల్!"

జాన్, లాల్ భుజం తట్టాడు.

★

పిల్ల పిలిచింది!

వసుంధర

"ఏమండీ-మిమ్మల్ని మా అమ్మ పిలుస్తోంది" అన్నాడో కుర్రాడు సత్యాన్ని ఆపి.

సత్యం ఆ కుర్రాడి వంక చూసి "ఎవరు మీ అమ్మ?" అనడిగాడు.

"అదిగో ఆ డాబా ఇంట్లో వుంది" అని ఆ కుర్రాడు పరుగెత్తుకు వెళ్లిపోయాడు.

సత్యం ఒక్క క్షణం తటపటాయించి ఆ డాబా ఇంటి వైపు నడిచాడు. గుమ్మంలోనే ఒకామె నిలబడి వుంది. ఆమె తనకు పరిచయమైన వ్యక్తిగా సత్యానికి తోచలేదు.

అది రాత్రి తొమ్మిది గంటల సమయం. వీధిలో అట్టే జనసంచారం లేదు. ఆమె సత్యాన్ని జూస్తూనే "లోపలకు రా- నేనే నీకు కబురంపాను" అంది.

మసక వెలుతుర్లో ఆమె అందంగానే వున్నట్లు తోచింది సత్యానికి. తన నావిధంగా చనువుగా ఆమె పిలవడం కూడా అతనికి ఆశ్చర్యంగా వుంది. ముందడుగు వేశాడు.

ఆమె తలుపులు బార్లా తెరిచింది.

ఆ యింటితో కానీ, ఆ వీధితోకానీ అతనికి పరిచయం లేదు. కానీ అప్పుడప్పుడీ దారమ్మట రావడం అతని అలవాటు. ఆమె యెవరో, తనను లోపలకు రమ్మని యెందుకు పిలిచిందో అర్థంకాక అతను ఇంట్లో అడుగు పెట్టాడు.

"తలుపులు వేసేయ్" అందామె.

అప్రయత్నంగా తలుపులు వేశాడు సత్యం. అప్పుడామె వెనక్కు తిరిగింది. ఇప్పుడు మసక వెలుతురు కాదు. గది లోని శక్తివంతమైన ఎలక్ట్రిక్ దీపం కాంతిలో ఆమె ముఖం చూసి ఆశ్చర్యపడ్డాడు సత్యం.

తనకు తెలియని ఆ అపరిచిత ముఖం యెంతో అందంగా వుంది. ఆమె యెవ్వరో బాగా డబ్బున్నదయి వుండాలి. వంటినిండా నగలున్నాయి. తెల్లని రంగు, తీర్చి దిద్దినట్లున్న అవయవాల పొందిక—

ఈమె ఇప్పుడు ఈ సమయంలో తనను ఆహ్వానించి

గది తలుపులు వేయమంది. యెందుకో?....ఆలోచిస్తున్నాడు సత్యం.

"నువ్వు నన్ను రక్షించాలి...." అందామె.

సత్యం ఇంకా స్వప్నంలోనే వున్నాడు. అతను ఆశ్చర్యంగా ఆమెవంక చూస్తున్నాడు.

"నన్ను రక్షించవా?" అందామె మళ్ళీ.

"ఎవరు నువ్వు?" సత్యం నోరు మెదిపి ప్రశ్నవేశాడు.

"నా పేరు రమ...." అందామె.

"ఊఁ చెప్పు...." అన్నాడు సత్యం.

"నన్ను నువ్వు రక్షించాలి...." అందామె.

"నీకు వచ్చిన కష్టమేమిటో చెప్పు!"

"అన్నీ చెబుతాను...." అని ఆగిందామె...."చేజేతులా విక్షేపంలాంటి నా కాపురంలో నిప్పులు పోసుకున్నాను ఆ రావుగాడిని నమ్మి...."

"రావుగాడెవరు?"

"మాదీ ఊరుకాదు. రావు నన్ను లేవదీసుకువచ్చాడు" అందామె. ఆ విషయం చెబుతున్నప్పు డామె కొద్దిగా సిగ్గుపడింది. తప్పనిసరై ఆ విషయం చెబుతున్నట్లు ధ్వనించింది.

లేచివచ్చిన మనిషి యెదురుగా ఉన్నదని తెలియగానే సత్యం మనసులోని ఆశ పెరిగింది. అతని ఆశకు కారణం ఆమె అందం.

"రావుగాడెవరో చెప్పలేదు!" అన్నాడు సత్యం.

"మా ఇంటి పక్కనే ఉండేవాడు. షోకిల్లాగా తిరిగేవాడు. మా ఆయన నన్నుగురించి అట్టే పట్టించుకునేవాడు కాదు. అందుకు రావు రోజూ జాలిపడుతూండేవాడు. క్రమంగా వాడి వలలో పడిపోయాను. నాకు డబ్బుమీద

మోజెక్కువ. ఆ విషయం కనిపెట్టి రావు తనకీవూళ్ళో చాలా వ్యాపారాలున్నాయని చెప్పి నమ్మించి, ఇక్కడకు తీసుకొచ్చి ఈ యింట్లో పెట్టాడు. వాడి కన్ను నా నగలమీద పడింది. అప్పట్నించీ ఇక్కణ్నించి పోదామను కుంటున్నాను...."

"మరి వెళ్ళిపోలేదేం?"

"భర్తను వదిలిపెట్టిన ఆడదాన్ని.... నేనింక యెక్కడికి పోగలను? రావుగాడు వట్టి మోసగాడనీ, వాడిది జులాయి బ్రతుకనీ తెలిసేక నేను చేసిన తప్పుపని తెలిసివచ్చింది. కానీ బాగా ఆలశ్యం జరిగిపోయింది. వాడిప్పుడు నానగలన్నీ అమ్మి సొమ్ము చేసుకుందామనుకుంటున్నాడు. ఏదో వ్యాపారానికని అబద్ధమాడుతున్నాడు—"

"నగలివ్వనని చెప్పు ..."

"చెప్పాను-ఇవ్వకపోతే చంపేస్తానన్నాడు...." అంది రమ.

సత్యం వులిక్కిపడి "చంపేస్తానన్నాడా?" అన్నాడు.

"అవును. రాత్రి పన్నెండింటికి వస్తాట్ట. ఓ మనిషిని తీసుకు వస్తాట్ట. అప్పుడు నా నగలు వలిచి యివ్వాలి."

"అయితే యేం చేయాలి?"

"నువ్వు నన్ను రక్షించాలి."

"ఎలా?"

"నీకు ఇల్లులేదా?"

"ఉంది."

"నీ ఇంటికి తీసుకెళ్ళు"

"నిన్నూ నీ కొడుకునూ నా యింట్లో పెట్టుకోనా?"

"నాకు పిల్లలు లేరు...."

"మరి ఇందాకా ఓ కుర్రాడు మా అమ్మ అని చెప్పాడు



నీ గురించి...."

"వాణ్ణి అలా నేనే చెప్పమన్నాను—"

"నీకు సాయపడ్డంవల్ల నాకేం ప్రయోజనం?"

"ప్రయోజనముంటే కానీ సాయపడకూడదా?"

సత్యం నవ్వి—"నువ్వు రావుగాడితో యెందుకు లేచి వచ్చావ్? ఏదో ప్రపయోజనాన్నాశించేగదా!" అన్నాడు.

రమ కూడా నవ్వి—"నేను నీ కళ్ళకు అందంగా ఉన్నానా!" అంది.

"చాలా!"

"అయితే నా అందం నీది...."

"యెలా నమ్మడం?"

"నీ గదికి తీసుకువెళ్ళు. నీ గదికి వచ్చినదాన్ని నీకు లొంగనా?"

"సరే నా గదికి వచ్చేక తర్వాత ఏం చేస్తావ్?"

"నువ్వు కొద్దిగా సాయపడితే దుకాణం పెట్టుకుంటాను నా నగలమ్మిన డబ్బుతో—" అంది రమ.

"ఒకవేళ నీ భర్త వెతుక్కుంటూ వస్తే!"

"అంతకంటే అదృష్టమేముంది? కాళ్ళమీదపడి క్షమించమంటాను ..."

"అయితే ఇప్పుడే ఆ పని యెందుకు చేయకూడదు?"

"నా భర్త నన్ను చంపేస్తాడు...."

సత్యం టైము చూసుకుని—"పన్నెండు కావడానికింకా చాలా టైముంది. ఈ యింట్లో నాకో అవకాశమివ్వు. నచ్చితే మా ఇంటికి తీసుకువెడతాను...."

"నచ్చకపోతే...."

"వదిలేసి వెళ్ళిపోతాను...."

"నచ్చలేదని అబద్ధమాడితే?"

"నచ్చిన ఆడదాన్ని వదులుకోవడం చాలా కష్టం!"

రమ ఆలోచనలో పడింది. ఓ క్షణం పోయాక "సరే-అయితే దీపం ఆర్పు—" అంది.

"ఎందుకు?"

"నేను లేచివచ్చినదాన్నికావచ్చు. కానీ సిగ్గులేనిదాన్ని కాదు. నువ్వు కొత్త మగాడివి...." అంది రమ.

ఆమె మాటలు ముచ్చటగా ఉన్నాయి సత్యానికి. అతను వెళ్ళి లైటు ఆర్పాడు. ఆ తర్వాత గదిలో చీకటి. నిశ్శబ్దం.

"రమా!" అతను పిలిచాడు.

సమాధానం రాలేదు.

మరోసారి "రమా!" అని పిల్చేడతను.

సమాధానం రాలేదు.

సత్యం గది అంతా కలయదిరిగాడు. గదిలో ఇంకో

మనిషి తిరుగుతున్నట్లు తెలుస్తోంది. ఆమె తనతో దోబూచు లాడుతున్నదని సత్యానికి అర్థమయింది. చాలాసేపు ప్రయత్నించి మళ్ళీ గుర్తుగా దీపం స్విచ్‌వరకూ వెళ్ళి స్విచ్ నొక్కాడు.

దీపం వెలగలేదు.

సత్యానికేదో అనుమానం వచ్చింది. గదిలో దీపం ఎందుకు వెలగలేదు? కొంపదీపి యీ వ్యవహారంలో ఏదయినా మోసం లేదుగదా!

అంతలోనే సత్యానికి దగ్గర్లో మాట వినబడింది—

"దీపం వెలగలేదా?"

ఆ కంఠం రమది. చటుక్కున ఆమెచేయి పట్టుకున్నాడతను. ఆమె కదలలేదు. దగ్గరగా లాక్కున్నాడు. ఆమె అభ్యంతర పెట్టలేదు. సత్యంలో ఆవేశం కట్టలు తెంచుకుంది.

2

సత్యానికి చాలా సంతోషంగా వుంది. "రమా, నిన్ను వదులుకోలేను. నాతో తీసుకుపోతాను" అన్నాడు.

"అయితే పోదామా?" అన్నదామె.

"ఊఁ...."

"చీకట్లోంచి వెలుగులోకి...." అంది రమ.

సత్యం నవ్వి—"వీధి తలుపులు తీస్తాను....బయటి వెలుతురు కొంత చీకట్లోకి కూడా వస్తుంది" అన్నాడు.

"అలాగే...." అంది రమ.

సత్యం లేచి తడుముకుంటూ మరోసారి స్విచ్ దగ్గరకు వెళ్లాడు. మరోసారి స్విచ్ ఆఫ్‌చేసి మళ్లీ ఆన్ చేశాడు. ఏమీ ఫలితం కనబడలేదు. మళ్లీ అక్కడ్నుంచి తడుము

కుంటూ తలుపుల దగ్గరకు వెళ్లాడు. గడియ తీశాడు. తలుపులు తెరవడానికి ప్రయత్నించాడు.

తలుపులు తెరవబడలేదు. అలా రెండు మూడుసార్లు ప్రయత్నించాక తలుపులు బయట గొళ్లెం పెట్టబడ్డాయని సత్యం గ్రహించాడు. అప్పుడతనికి నిజంగా భయం వేసింది.

"రమా! బయట యెవరో గొళ్ళెం పెట్టారు" అన్నాడు సత్యం.

అతనికి సమాధానం రాలేదు. ఏదో సన్నని మూలుగు వినపడింది.

సత్యం వులిక్కిపడ్డాడు "ఏమిటీ మూలుగు?"

మళ్లీ అతనికా మూలుగు వినపడలేదు. గదిలో తడుముకుంటూ వెళ్లడంతో అతని కాళ్లకు అడ్డుగా ఏదో తగిలి బోర్లగిలా పడ్డాడు.

అప్పుడే గదిలో లైటు వెలిగింది.

సత్యం కళ్లు నులుముకుని గదిలో కనబడ్డ దృశ్యం చూసి ఉలిక్కిపడ్డాడు.

కాలికి తగిలింది ఓ మనిషి శవం. ఆ ఆడమనిషి గుండెల్లోకి కత్తి దిగి వుంది. ఆ ఆడమనిషి ఎవరో కాదు. రమ!

సత్యానికి కంగారు పుట్టి అవతలి వైపు తలుపుల దగ్గరకు వెళ్లాడు. అవి కూడా అవతల గడియపెట్టబడి వున్నాయి. ఎంత ప్రయత్నించినా ఆ తలుపులు రాలేదు.

తను ఆ గదిలో బందీ అయినట్లు గ్రహించాడు సత్యం. అయితే ఇదెలా జరిగింది? రమ హత్య చేయబడిందా? ఆత్మహత్య చేసుకుందా?

రమ తనతో ఉత్సాహంగానే వుంది. మాటల్లో, చేతల్లో

ఎక్కడా నిరుత్సాహం కనబడలేదు. ఆ మనిషి చావుకు సిద్ధపడి వుందంటే నమ్మడం కష్టం.

మరి....రమ ఎలా చనిపోయింది?

గదిలో ఆ సమయంలో ఇంకెవరో వుండి వుండాలి. తను మరోసారి స్విచ్ ఆన్‌చేసి చూడ్డానికి వెడుతున్నప్పుడతనామెను హత్యచేసి వుంటాడు. ఆమె చప్పుడు చేయకుండా ఉండడం కోసం నోరు గట్టిగా మూసి వుంటాడు. ఒకే ఒక్క పోటుతో ఆమె ప్రాణం పోయి వుంటుంది. ఆ సమయంలో కొసప్రాణంతో అమె మూలిగితే తనకు వినిపించి వుంటుంది.

సత్యం ఇప్పుడు జరిగినది ఊహించగల్గుతున్నాడు. ఎవడో తెలివిగా రమను హత్య చేశాడు. ఆ హత్య ఎందుకు చేశాడో తెలియదు కానీ అందులో తానిరుక్కున్నాడు.

ఇప్పుడేమవుతుంది? ఇక్కడ్నించి బయటపడడమెలా?

సత్యం ఆలోచిస్తూండగానే గది తలుపులు తెరుచుకున్నాయి. పోలీసులు బిలబిలా గదిలో ప్రవేశించారు. సత్యానికేం చేయాలో తోచక పారిపోయే ప్రయత్నంచేయక అలాగే నిలబడిపోయాడు.

పోలీస్ ఇన్‌స్పెక్టర్ బేడీలతో సత్యాన్ని సమీపించాడు.

"సార్! నాకేమీ తెలియదు. నేను నిరపరాధిని. మీరు ఒక్క క్షణం గడువిస్తే ఏం జరిగిందో చెప్పుకుంటాను" అన్నాడు సత్యం తడబడుతూ.

"ఆలోచించుకునేందుకు నీకు చాలా వ్యవధి దొరికింది. అంచేత యెంచక్కటి కథలల్లగలవు! కదలకుండా ఈ గదిలో నిలబడున్న నువ్వు గుండెలు తీసిన బంటువు. మిగతా విశేషాలు తర్వాత మాట్లాడుకుందాం" అన్నాడు

ఇన్‌స్పెక్టర్.

"అది కాదుసార్....నేను నిరపరాధిని...." అన్నాడు సత్యం.

"ప్రతి హంతకుడూ మొదట్లో ఇలాగే అంటాడు. నేరస్థులచేత నిజం చెప్పించే పద్ధతి మాకు తెలుసు...." అన్నాడు పోలీస్ ఇన్‌స్పెక్టర్.

హఠాత్తుగా సత్యం కళ్ళముందు భవిష్యత్తు కనబడింది. అతనికి అప్పుడే గుండె ఆగినట్టనిపించింది.

3

ఆమె పేరు రమకాదు. వసంత. ఆమె ఒక సాధారణ వేశ్య. ఆమె మెడలోని గిల్టు నగలు. ఆ ఇల్లు ఆమెదే. రెండు మూడుసార్లు ఆమె లాడ్జిలలో పట్టుబడింది. ఆమెకు భర్తలేడు. ఒంటరి ఆడది.

సత్యం ఆమెకు విటుడిగా లోపల ప్రవేశించాడు. నగలు చూసి నిజమయినవనుకుని మోసపోయి లాక్కోబోయాడు. ఇతడు దొంగ అని తెలిసి ఆమె శరీరాన్నివ్వడానిక్కూడా ఒప్పుకోలేదు. అప్పుడు సత్యం వసంతను బలవంతం చేశాడు. ఆమె చాలా తీవ్రంగా ప్రతిఘటించడంలో పరిస్థితులు హత్యకు దారి తీశాయి. దారిన పోతున్న ఓ దానయ్య అది చూసి తలుపులు అటూ ఇటూ గొళ్ళెంపెట్టి, పోలీసులకు ఫోన్ చేశాడు.

ఈ కథ పోలీసులు అల్లగా సత్యం విన్నాడు. మొదట్లో బాగా ప్రతిఘటించాడు. అప్పట్లో అతనికి పోలీసులు నేరాలొప్పుకునేలా చేయడానికుపయోగించే పద్ధతులు తెలియవు. అవి తెలిసేక ఆ కథను నిజమని ఒప్పుకోక తప్పలేదు. అయితే అన్యాయంగా తనచే పోలీసులు

నేరాల్ని ఒప్పించడం అతనికి నచ్చలేదు.

రెడ్‌హేండెడ్‌గా పట్టుబడ్డ నేరస్థుణ్ని ఏ పోలీసులూ వదులుకోరు. అతను నేరం చేశాడని వారు విశ్వసిస్తున్నారు. అందుకు సరిపడ్డ సాక్ష్యాలున్నాయి. నేరస్థుడు ఒప్పుకోకుండా మొండికెత్తాడని వారు భావించారు. అందుకే తమ పద్ధతు ఉపయోగించి సత్యంచేత నేరం ఒప్పించారు.

కోర్టులో కేసు నడిచింది. సత్యం నేరస్థుడిగా నిరూపించ బడ్డాడు. అతనికి యావజ్జీవ కారాగార శిక్ష లభించింది.

జైల్లో సత్యానికి చాలామంది ఖైదీల పరిచయం లభించింది. ఇతగాణ్ని కుతూహలంగా చేసిన నేరాల గురించి ప్రశ్నించారు కొందరు.

"నేను నిరపరాధిని.పరిస్థితుల ప్రాబల్యంవల్ల హత్య కేసులో ఇరుక్కున్నాను. పోలీసుల బాధ పడలేక నిజం అనిచెప్పి అబద్ధం చెప్పాను...." అన్నాడు సత్యం.

అక్కడున్న చాలామంది నవ్వారు. "మేమందరమూ

నీలాంటి వాళ్ళమే గురూ-మామూలు ప్రపంచానికి చెప్పే అబద్ధం మాకూ చెప్పక్కర్లేదులే-ఏంచేశావో చెబితే విని సంతోషిస్తాం....'' అన్నాడు వాళ్ళలో ఒకడు.

సత్యం వివరంగా తన అనుభవం చెప్పాడు.

"ఏమదృష్టంగురూ-జైలుకొస్తే వచ్చాడు గానీ, ఆడ పిల్లతో భలే అనుభవం-దేనికైనా పెట్టి పుట్టాలి....'' అన్నాడు ఇంకొకడు.

సత్యానికి వాళ్ళమధ్య చాలా ఇబ్బందిగా అనిపించింది. వాళ్ళందరూ అసలు సిసలు నేరస్థుల్లా వున్నారు. పోలీసుల్లాగే వీళ్ళూ తనుచెప్పే నిజాన్ని నమ్మడంలేదు. ఒకరోజు కాదు, ఒక సంవత్సరంకాదు....ఒక జీవితకాలం గడిపినా అ మనుషులమధ్య తను అడ్జస్టుకాలేనని సత్యానికి అనిపించింది. అయినా తప్పదు. తనకు వాళ్ళే ఇక లోకం....

సత్యం నెమ్మదిగా వాళ్ళలో కలవడానికి ప్రయత్నించసాగాడు. వాళ్ళలో అందరికీ తలోరకం కథా ఉంది. ఆకలికి కొందరూ, అవసరానికి కొందరూ, ఇతరుల ఒత్తిడి కారణంగా కొందరూ, సరదాకి కొందరూ వాళ్ళలో నేరస్థులయ్యారు. అందరు మనుషులలాగే వాళ్ళకూ యెన్నో ఆశలున్నాయి.

"నాకులా అన్యాయంగా జైలుకు వచ్చినవాళ్ళు మీలో ఒక్కరు కూడా లేరు. అందుకనే నాబాధ మీకు అర్థం కాదు....'' అన్నాడు సత్యం. అతని ముఖం నిజంగా దీనంగా వుంది.

నేరస్థుల్లోని ఒకడు సత్యాన్ని పరిశీలనగా చూపి—"నీ పేరు సత్యం కదూ?'' అన్నాడు.

సత్యం ఆశ్చర్యంగా—"నా పేరు నీకెలా తెలుసు?'' అన్నాడు.

"నేనూ కొంతకాలం వరదాచారి దగ్గర పనిచేశాను."

సత్యం గతుక్కుమన్నాడు. వరదాచారి నగరంలోని పెద్దమనిషి. ఆయన పెద్దమనిషిగా చలామణీ కావడానికి తనలాంటి చిన్న మనుషులు చాలామంది సహకరిస్తున్నారు. తను వరదాచారి అనుచరుడని ఆ మనిషి పసిగట్టాడంటే తనింక నేరాలగురించి అట్టే మాట్లాడకూడదు. వరదాచారి అనుచరుడికి నేరాలలో సంబంధం లేకుండా కుదరదు.

"నేనెల్లా తెలుసు నీకు?" సత్యం అడిగాడు.

"నా పేరు వీర్రాజు...." అన్నాడు ఆ నేరస్థుడు.

వీర్రాజు వరదాచారి ముఖ్యానుచరుడని చెప్పుకుంటారు. అతనికి వరదాచారి వ్యవహారాల గురించీ, అనుచరుల గురించీ చాలా వివరాలు తెలుసును.

"ఎలా పట్టుబడ్డావ్?"

"పాపం పండింది. దొరికిపోయాను. అన్యాయంగా జైలుకు వచ్చానని నువ్వు వాపోతూంటే నాకు నవ్వొచ్చింది. అందుకే నీపేరడిగాను. ఇన్నాళ్ళబట్టి ఇక్కడుంటున్నాను. కానీ అన్యాయంగా జైలుకొచ్చిన ఓ వ్యక్తి నాకు తెలుసు—" అన్నాడు వీర్రాజు.

"ఎవరతను?"

"అతనిక్కడకు వచ్చిన పది రోజులకు నేను జైలుకి వచ్చాను. హత్య కేసులో యావజ్జీవ కారాగార శిక్ష పడింది. అతని కొడుకు అప్పుడప్పుడు వచ్చి తండ్రిని కలుసుకుంటూండేవాడు. కేసు వివరాలు విన్నాక అతడు నిరపరాధి అని నాకు తెలిసింది...."

"ఎందువల్ల?"

"చంద్రమోహన్ హత్య కేసులో అతనిక్కడకు వచ్చాడంటే విషయం నువ్వే అర్థం చేసుకోగలవు?" అన్నాడు వీర్రాజు.

సత్యం గతుక్కుమని—"మీకు చాలా వివరాలు తెలుసు—" అన్నాడు.

"నిజం తెలిసినా ఋజువు చేయలేని పరిస్థితి నాది. అతడిమీద జాలితో అతని కొడుక్కు నేను కేసు పూర్వాప రాలు చెప్పి, అసలు హంతకుడెవరో చెప్పాను. అతని కొడుకు చాలా ఉత్సాహంగా వెళ్ళిపోయాడు-పగ తీర్చు కుంటానంటూ—" అని వీర్రాజు సత్యం ముఖంలోకి చూశాడు.

"అప్పుడేమయింది?"

"ఆ తర్వాత కొన్నాళ్ళకు నకిలీ హంతకుడు శిక్ష పూర్తిగా అనుభవించకుండానే తనువు చాలించాడు...." అన్నాడు వీర్రాజు.

"అప్పుడు...." అన్నాడు సత్యం.

"అసలు హంతకుడు జైల్లోకి వచ్చాడు...."

"అంటే?" అన్నాడు సత్యం. అలా అన్నప్పటికీ అతనికి నిజం అర్థం కాకపోలేదు.

వరదాచారి నియోగించగా చంద్రమోహన్‌ని తనే హత్య చేశాడు. ఆ విషయం వీర్రాజుకి తెలిసే ఉంటుంది. చంద్ర మోహన్ హత్యలో వరదాచారి తెలివిగా రమణమూర్తిని ఇరికించాడు. రమణమూర్తికి జైల్లో వీర్రాజు పరిచయ మయ్యాడు. రమణమూర్తి కొడుక్కు సమాచార మందింది. అతగాడు తనను తెలివిగా ఈ హత్య కేసులో ఇరికించాడు.

"అన్యాయంగా జైలు కొచ్చానని ఏడవకు. కొద్దిగా ఆలస్యమైనందుకు సంతోషించు" అన్నాడు వీర్రాజు. ★

కె.బి.యస్. కుమార్

డ్రీమ్ గరల్



"అదేమిటి? మ్యాట్నీ కెడదామని యిక్కడికి తీసుకొచ్చావ్?" ఆశ్చర్యంగా అడిగాడు శర్మ.

ఆ రోజు ఆదివారం. శేషగిరి, శర్మ పార్కులో ఓ బెంచిమీద చతికిలబడ్డారు.

"నీకు అపర్ణ తెల్సా?" సూటిగా అడిగాడు శేషగిరి.

"అందాలరాణి, డ్రీమ్‌గర్ల్, కాలేజిబ్యూటీ అపర్ణేనా?"

"అవును...."

"ఈ వూళ్ళో దాదాపు అందరికీ ఆమె తెలుసేమో! ఆమె అందం అలాంటిది."

"ఆమెని చూస్తే నీకేమన్పిస్తుంది?"

"అది చెప్పాలంటే ఈ రోజు చాలదు. మొత్తం మీద నీకేమన్పిస్తుందో అంతకంటే రెండాకు లెక్కువే అన్పిస్తుంది నాకు."

శేషగిరికి అతనంటే అసూయ పుట్టుకొచ్చింది. అయినా నవ్వుకున్నాడు.

"అయినా ఈ ప్రస్తావన ప్రస్తుతం ఎందుకు?" ఉళ్ళీ శర్మే అన్నాడు.

"ఆమె నాకు కావాలి."

విరగబడి నవ్వాడు శర్మ.

"ఏం నవ్వులాటగా వుందా?"

"కాకపోతే మరేమిటి? అపర్ణను తాకాలంటేనే పుణ్యం చేసుకొనుండాలి. ఆమెతో మాట్లాడాలంటే అదృష్టం కావాలి. ఆమెను పొందాలంటే వెయ్యి జన్మలెత్తాలి."

"ఏం దేవతా?"

"నీ ప్రక్కింటి అన్నపూర్ణనో, ఎదురింటి పంకజాన్నో ప్రేమించలేకపోయావా?"

"ఛీ....దిబ్బరొట్టి ముఖాలూ వాళ్ళూను."

గతుక్కుమన్నాడు శేషగిరి. అతని వదనం చిన్న బోయింది.

"పిచ్చివాడా! నేనూ ఒకప్పుడు యింతకంటే ఎక్కువగా ప్రేమించా నామెని. కాని దెబ్బతిన్నాను. అందుకే

నీకో సలహా యివ్వదల్చుకున్నాను. ఏమిటో తెల్సా? ఎప్పుడూ నువ్వు ప్రేమించినదాన్ని కోరకు. నిన్ను ప్రేమించిన దాన్ని ఆరాధించు. ఈ సలహా పాటిస్తే మంచిది నువ్వు...."

"ప్రేమించావా? దెబ్బతిన్నావా? ఎలా?" ఆసక్తిలో అసూయని కలిపి ప్రశ్నించాడు శేషగిరి.

"ఏముంది? ప్రేమించాను. నా ప్రేమనంతా పేపరు మీద గుమ్మరించాను. మూడో రోజు జవాబొచ్చింది. అన్నపూర్ణా హోటల్లో కలవమంది. కలిశాను. ఆమె చేతిలో చిన్న జిప్‌బ్యాగ్ వుంది. నా ముందు టేబులుపై గుమ్మరించింది. చూసి దిమ్మెరపోయాను.

"అవన్నీ ప్రేమ లేఖలు! ఆ నాడు ఉదయంటపాలులో వచ్చినవి. ముప్పైకి పైగా వున్నాయి. అన్నీ చూపించింది. నా లేఖ కూడ కలిపి వీళ్లలో ఎవర్ని ప్రేమించాలో నన్నే చెప్పమంది. తలొంచుకున్నాను. తనే బలవంతంగా కాఫీ త్రాపి పంపింది. ఇప్పుడేమంటావ్?"

2

దాన్ని 'బంగళా' అని మాత్రం అంటే సరిపోదు. అపర్ణ అందంలాగే ఆ భవనం కూడ ఓ రకమైన ప్రత్యేకతని సంతరించుకుంది.

విశాలమైన కాంపౌండు. రకరకాల పూల, పండ్ల మొక్కలు, చెట్లు వాటి మధ్యగా కారు వెళ్లగలిగేంత మేర సిమెంటు బాట. రంగు రంగుల పెయింట్లతో ఠీవిగా, హుందాగా వున్న భవనపు గోడలు. సింహద్వారాని కిరుప్రక్కలా అందమైన కాగితంపువ్వుల చెట్లు.

ఆ బంగళాని దూరంనుండి చూసేసరికే శేషగిరికి మతి

పోయింది. ఇంతపెద్ద భవనంలో అపర్ణ ఏ గదిలో వుంటుందో! ఏ వంకతో ఎలా కలుసుకోవాలి? ఏమని పలకరించాలి?

కుంభకర్ణుని సైజులో, దూర్వాసుని పోజులో వున్న గూర్ఖా తనని అనుమానంగా చూస్తోన్నట్టు గమనించాడు శేషగిరి. నెమ్మదిగా అతని వద్దకి వెళ్ళాడు.

"కోన్ హో తుమ్? కోన్ చాహియే?" అన్నాడు గూర్ఖా ముఖం చిట్లిస్తూ.

"అపర్ణగారితో కాని....వాళ్ళ....వాళ్ళ చిన్నాన్నగారితో కాని మాట్లాడాలి" తడబడుతూ అన్నాడు శేషగిరి.

"సాబ్ అందర్ కామ్‌మే హైఁ....మాఁ సాబ్ బాహర్ గయే! అబ్ నై హోతా. కోశిశ్ కరో శామ్‌కో...." వురుముతోన్నట్టన్నాడు గూర్ఖా....

"పోరా మూర్ఖా....!" అందా మనుకున్నాడు శేషగిరి. కాని వసుదేవుడు - గాడిద సంగతి గుర్తొచ్చి వెనక్కి మళ్ళాడు.

ఇలా అయితే సరిపోదని సాయంకాలం ఓ అందమైన వేనిటీ బ్యాగ్ కొన్నాడు శేషగిరి. దానిమీద అందంగా 'అపర్ణ' అనే అక్షరాలు చెక్కాడు. అతని ఈ ఆలోచన పారింది.

పూజారి వరమిచ్చాడు. ఇక దేవతే తరవాయి.

కాలింగ్ బెల్ నొక్కాడు. కాసేపయ్యాక తెర్చుకుంది. పనిమనిషి.

"అమ్మాయిగారున్నారా?" అడిగాడు.

"మీరెవరు?...." పనిమనిషైనా అలా కన్పించటం లేదామె. అవును మరి. గొప్పింటి పనిమనుషులు మధ్య తరగతి కుటుంబాల్లోని వ్యక్తుల్లా వుంటారు. అయ్‌మీన్

కొందరు మాత్రమే సుమండీ!

"నేను....నా పేరు శేషగిరి....అపర్ణ గారి కోసం వచ్చాను. వారితో కాస్త మాట్లాడాలి."

"కాసేపుండండి...." అని లోనికి వెళ్ళిపోయిందామె.

తన పేరు శేషగిరైనందుకు మొదటిసారిగా నొచ్చుకున్నాడు శేషగిరి. అపర్ణ పేరులాగే ఎంచక్కా సుధామోహన్ అనో చైతన్యకుమార్ అనో పెట్టి వుండాల్సింది తన తల్లిదండ్రులు... మనసులోనే నిట్టూర్చాడు శేషగిరి.

ఎదురుగా వస్తోన్న వ్యక్తిని చూసి శేషగిరి అదిరిపడ్డాడనే అనుకోవాలి.

'అపర్ణ కావాలంటే ఎవరో మగవాడొస్తున్నాడేమిటి? కొంపదీసి యితడు ఆమె చిన్నాన్న మన్మథరావు కాదు గదా! అదేవిటి మొహం....కాలేసిన వంకాయలా?'

శేషగిరి ఆలోచన్లు సగంలో వుండగానే ఆ వ్యక్తి దగ్గరికి రానే వచ్చాడు.

"ప్రేమలేఖలు పోస్టులోనే కాదు, పర్సనల్‌గా కూడ వస్తోన్నాయన్న మాట....!" వురుములా వుందా గొంతు.

ఆ క్షణంలో శేషగిరికి అతను మన్మథరావా కాదా అన్న అనుమానం రాలేదు కాని శర్మ చెప్పిన మాట మాత్రం నిజమన్పించింది.

"మాట్లాడవేం??" మరోసారి గర్జించిందా గొంతు.

"అబ్బే! నేను....అందుకోసం రాలేదండీ! ఈ వ్యానిటీ బ్యాగు అపర్ణగారిదేమో యిచ్చిపోదామని వచ్చాను...." ఎంత వద్దనుకున్నా వెధవగొంతు వణికింది.

"కాదు. నువ్వెళ్ళొచ్చు...."

లాగి లెంపకాయ కొట్టినట్టన్పించింది శేషగిరికి. ఏడుపొస్తున్నట్టుంది. తమాయించుకుంటూ "దీనిపై 'అపర్ణ'

అనే పేరుందండీ!" అన్నాడు.

"రత్నా...." గంభీరంగా పిలిచాడతను. ఇందాకటి పనిమనిషొచ్చింది.

'ఆడదాంతో మెడబట్టి బయటిగ్గెంటిస్తా నంటాడా కొంపదీసి....?' అనుమాన మొచ్చింది శేషగిరికి. అవమాన మన్పించింది.

"అపర్ణ అనే పేరుగలవాళ్ళు ఎందరో వుండొచ్చు లెండి. మీ అమ్మాయిది కాకపోతే ఫర్వాలేదు. వెళ్ళి పోతాను...." అనేసి మెల్లగా బయట పడ్డాడు.

కాని యింటికెళ్ళాక శేషగిరి కనుమానం రాకపోలేదు, ఆ వ్యక్తి రత్నా అని పిలవటంలో 'అపర్ణని పిల్చుకురా' అన్న వుద్దేశ్యం వుండిందేమోనని....!

అందని ద్రాక్షపళ్ళకోసం ఆనాడే ఎగబడిందో ప్రాణి. అదేమో అందకపోతే పుల్లగున్నాయనుకుంది కాని ఈనాటి ఈ శేషగిరి అనే ప్రాణి అందని ద్రాక్షపండ్లు మరీ మరీ తియ్యన అనుకుంటోంది.

3

రాత్రి సమయం....

టైమ్ చూసుకున్నాడు శేషగిరి. పన్నెండూ నలభై కావస్తోంది. ఒక్కసారి ఆ వేపుకి చూశాడు. గూర్ఖా కునుకు తీస్తున్నాడు కూర్చునే. అటూ యిటూ చూశాడు. రోడ్డు నిద్రపోతోంది.

చప్పుడు కాకుండా కాంపౌండ్ వాల్ దూకాడు. గబ గబా నడిచి బంగళా వెనక వేపుకి చేరుకున్నాడు.

బంగళా నలువేపులా పార్కులాగుంది. ఒకటో రెండో కీచురాళ్లు సన్నగా రొద చేస్తున్నాయి. పువ్వుల వాసన



మత్తుగా వస్తోంది. నైట్‌క్వీన్ అన్ని వాసనల్నీ అధిగమిస్తోంది.

అంత పెద్ద బిల్డింగుకి వాటర్ టాంకంటూ ఒకటుంటుందని, దాని సంబంధమైన పైపు వుండితీరుతుందని తెల్సు శేషగిరికి. దాన్ని కనుక్కోవటం కాస్త ఆలశ్యమయినా యన్. సి. సి.లో నేర్చిన విద్య పైప్ ఎక్కటానికి సహకరించింది.

శేషగిరి గుండెలు బిక్కు బిక్కుమంటోన్నాయి. తను సాహసం చేస్తోన్నాడు. ఏ మగాడూ చెయ్యలేని సాహసం చేస్తోన్నాడు. దీన్ని సాహసం అనేకంటే తెగింపు అంటే బావుంటుంది. ఆ సమయంలో పాతాళ భైరవిలో తోట రాముడు గుర్తొచ్చాడు శేషగిరికి.

ఫ్రెంచి విండోగుండా నెమ్మదిగా లోపలికి దూకాడు. చప్పుడు కాకుండా వెదికాడు.

పైన మూడు గదులున్నాయి. ఒకటి మన్మధ రావుది. మరోటి అపర్ణది.

అపర్ణ గది కనుక్కోటానికి పావుగంట పట్టింది. నెమ్మదిగా తలుపు తోశాడు. నీలంరంగు జీరోబల్బు మసగ్గా వెలుగుతోంది. గదిలో చల్లగా వుంది.

అమాయకంగా నిద్రపోతున్న అపర్ణని, నిద్రలో ఆమె అందాన్ని చూసేసరికి శేషగిరి మనసు గులాబితోటైంది. అతనిలో సంతోషం పరవళ్ళు తొక్కింది. ఏదో వుత్సాహం పెల్లుబికింది. శరీరం పులకరింతతో కంపించసాగింది.

అవును. తను అనుకున్నది సాధించాడు. మనసులోని కోరిక తీర్చుకోబోతున్నాడు. అపర్ణతో మాట్లాడబోతు న్నాడు.

ఒకవేళ అపర్ణ లేచి అల్లరి చేస్తే? చెప్పెట్టి కొడితే? మన్మధరావుని కేకేస్తే? తనని దొంగగా చట్టానికి పట్టిస్తే? మరేదేనా చేస్తే....? వగైరాలని గురించి ఆలోచించలేదు. ఆలోచించాలనుకోలేదు శేషగిరి. అన్నిటికీ తెగించాడు.

ఆమె అల్లరిచేసే పక్షంలో ఆమెని రేప్‌చేసయినా సరే తన కోరిక తీర్చుకోవాలి. అలా చెయ్యనిపక్షంలో నెమ్మ దిగా తనవేపుకి తిప్పుకోటానికి ప్రయత్నించాలి. యిదీ శేషగిరి వుద్దేశ్యం.

కంఠం వరకూ కప్పుకున్న అపర్ణ మంచం వద్దకి వెళ్ళాడు. అంతకు ముందే తలుపు లోపల గొళ్ళెం పెట్టాడు. ఒకవేళ అపర్ణ అల్లరి చెయ్యటమంటూ సంభ విస్తే మన్మధరావు, నౌకర్లు వచ్చేలోగా తను వచ్చిందారి పట్టొచ్చు. యిదీ శేషగిరి అభిప్రాయం.

మృదువుగా మంచంపై కూర్చున్నాడు. వణికే చేతుల్తో మెల్లగా ఆమెపైని దుప్పటి తొలగించాడు. అంతే....

ఒక్కసారిగా వులిక్కిపడి వెనక్కి ఎగిరి గంతేశాడు శేషగిరి....

అపర్ణ గుండెల్లో లోతుగా దిగిన కత్తి. బెడ్‌షీట్‌పై రక్తం!! రక్తంతో తడిసిన ఫోమ్‌బెడ్!!! వీటన్నిటినీ తడిపి జిగటగా వున్న చిక్కటి ఎర్రని రక్తం నీలంరంగు జీరో లైటు వెలుతురులో గులాబిరంగులో కన్పిస్తోంది!!!

శేషగిరి తల తిరిగిపోయింది. అతని కళ్ళ ముందు ఆ గదంతా గిర్రున తిరగసాగింది. కళ్ళు గట్టిగా మూసుకున్నా అపర్ణ రూపమే! అందమైన అపర్ణ-శవంగా మారిన ప్రస్తుతపు చలనంలేని అపర్ణ!....అతని మస్తిష్కంలో వికటాట్టహాసం చేస్తూ ఈ రెండు రూపాలూ వికృతంగా నాట్యం చేయసాగాయి.

అక్కడ నిలవలేకపోయాడు శేషగిరి. ఎయిర్ కండిషన్డు చెయ్యబడ్డ గదిలోకూడ అతని శరీరమంతా చెమటతో తడిసిపోయింది. గొంతు తడారిపోయింది. శరీరం విపరీతంగా వణకనారంభించింది. కొన్ని క్షణాలపాటు కర్తవ్యమూఢుడై పోయాడు.

....ఎలా జరిగింది? ఎవరు చేశారీ పని!? అపర్ణపై అంత కక్ష ఎవరికుంటుంది? ఎవరికేనా వుండొచ్చు. ఆమెకు ప్రేమలేఖలు రాసినవారు వందలకొద్ది వున్నారు. వాళ్ళు కూడ తనలాగే ఆమెని పొందాలని ఎందుకు ప్రయత్నించి వుండకూడదు? ఆమెని రేప్ చెయ్యాలని తనలాగే వచ్చి ఆమె ప్రతిఘటించేసరికి ఈ పని చేశాడా!

అప్రయత్నంగా అపర్ణ శవం వేపు చూశాడు శేషగిరి. 'ఉఁహూఁ....చూస్తే ఆమె మొహంలో పెనుగులాడిన ఛాయలేవీ లేవు. ప్రశాంతంగా నిద్ర పోతున్నప్పుడే ఈ ఘోరం చేశారు. ఎవరు? ఎవరు చేసుంటారు?? ఒకవేళ

బహిరంగంగా ఆమెచేత అవమానించబడ్డవాడెవడేనా....?

ఎవరేనా సరే....ఆ సంగతి ప్రస్తుతం అనవసరం. తను ముందిక్కడినుండి బయటపడాలి. తనిక్కడుండగా ఎవరి కంటనేనా పడితే, ఎంత ప్రమాదం?'

గబగబా తలుపు వద్దకి వెళ్లాడు శేషగిరి. జేబులోంచి కర్చీఫ్ తీశాడు. తను ఎక్కడెక్కడ తాకాడో అక్కడంతా శుభ్రంగా తుడిచాడు.

అన్ని ప్రదేశాలూ తుడిచానని ధృవపరుచుకున్నాక నెమ్మదిగా ఫ్రెంచ్‌విండో చేరుకున్నాడు. అతికష్టంపై విండోలో ప్రవేశించాడు. ఏదో చేతికి తగలటంతో చూశాడు.

ఓ పొడుగాటి చేదుడు బావుల కుపయోగించే త్రాడు ఫ్రెంచ్ విండోనుండి క్రిందికి వ్రేలాడుతోంది!!!

4

"డిటెక్టివ్ జలంధర్ స్పీకింగ్...." గంభీరంగా అన్నాడు జలంధర్.

"మా బంగళాలో హత్య జరిగింది. మీరు వెంటనే రావాలి" ఆ కంఠస్వరంలో ఎంతో బాధ వుంది. కాని దాన్ని కప్పిపుచ్చుతున్నట్టుగా, బాధలో కూడ హోదాని, హుందాతనాన్ని చాటిచెబుతోన్నట్టుగా వుంది.

"అడ్రస్ చెప్పండి. పదినిముషాల్లో అక్కడుంటాను" అన్నాడు జలంధర్.

డైరీలో రాసుకొని ఫోనుపెట్టేశాడు. వెంటనే మళ్ళీ మ్రోగింది.

"జలంధర్‌గారా?"

"యస్! స్పీకింగ్!"

"బిజినెస్ మ్యాగ్నెట్ మన్మధరావుగారి పేరు మీరు విన్నారా?"

"విన్నాను...." ఆశ్చర్యపోతూ అన్నాడు జలంధర్.

"అతని అన్న కూతురు బ్యూటీక్వీన్ మిస్ అపర్ణ హత్య చెయ్యబడింది."

"................"

"హంతకుడెవరో నాకు తెల్సు. మరేం ప్రశ్నించక రాసుకోండి." అడ్రస్‌చెప్పి డిస్‌కనెక్టు చెయ్యబడింది ఫోను.

"హలో....హలో...." నిరాశగా ఫోన్ పెట్టేశాడు జలంధర్.

"వాసూ!" పిలిచాడు.

"వస్తున్నాను బాస్!" అంటూ వచ్చాడు అసిస్టెంట్ శ్రీనివాస్.

శ్రీనివాస్‌ని వెంటబెట్టుకొని డాడ్జి కారులో బయలు దేరాడు డిటెక్టివ్ జలంధర్.

డాడ్జి వేగంగా 'కోఠీ' వేపు ప్రయాణించి, ఓ సుమారయిన యింటిముందాగిపోయింది.

దిగారు డిటెక్టివ్ ద్వయం. లోనికి నడిచారు. హాల్లో ఓ పాతికేళ్ళ యువకుడు కూర్చొని తల దువ్వుకుంటున్నాడు.

అయిదడుగుల ఎనిమిదంగుళాలుంటాడు. ఎత్తుకుతగ్గ లావు. చామన చాయగా వున్నా ఆకర్షణీయంగా కన్పిస్తాడు.

"ఎవరు కావాలండీ...."

"శేషగిరి."

"నేనే శేషగిరిని. మీరు...."

"డిటెక్టివ్ జలంధర్ అండ్ మై అసిస్టెంట్ మిస్టర్ శ్రీనివాస్."

ఉలిక్కిపడ్డాడు శేషగిరి. 'ఎలా, యిది ఎలా సంభవం!

వీరికి తను వెళ్ళినట్టు తెలిసిందా? ఎలా.... తెల్సింది?'

"మీరు నిన్న మన్మధరావుగారి బంగళాకు వెళ్లారా"

"....................."

"మీరు వెళ్ళినట్టు ఎవరో వ్యక్తి ఫోన్ చేశాడు. నిజం చెబితే మీకే ఆరోగ్యం."

".... అ.... అవును...." చెప్పక తప్పలేదు.

"అయితే కారెక్కండి."

గుండెల్లో బాంబులు ప్రేలాయి శేషగిరికి. దుఃఖం తెరలు తెరలుగా ఉబుకుతోంది. యాంత్రికంగా షర్టు వేసు కొని వాళ్ళవెంట నడిచాడు.

5

మన్మధరావు డాడ్జి కారుని రిసీవ్ చేసుకున్నాడు. శేష గిరిని చూడగానే అతని కనుబొమలు ముడిపడ్డాయి.

"వీడే.... వీడే నా అపర్ణని పొట్టన బెట్టుకున్నాడు జలంధర్‌గారూ...." ఉద్వేగంగా అన్నాడు.

"ఏలా చెప్పగలరు?" ఎందుకో ఆ ప్రశ్న వేశాడు జలంధర్.

"నిన్న సాయంత్రం ఓ వ్యానిటీబాగ్ పట్టుకొచ్చాడు. అపర్ణదనుకున్నాడట. చీవాట్లు పెట్టి పంపించాను. ఆ కోపంతో వీడే రాత్రి అమ్మాయి గదిలో ప్రవేశించి అపర్ణని పొట్టన బెట్టుకొనుంటాడు."

శేషగిరివేపు తిరిగాడు జలంధర్.

"లేస్సార్! రాత్రి రహస్యంగా గోడదూకి అపర్ణగది చేరిన మాట వాస్తవమే! కాని ఆమెని హత్య చెయ్యటానికి మాత్రం కాదు. ఆమెని పరిచయం చేసుకోటానికి...."

"అర్థరాత్రి రహస్యంగా పరిచయం చేసుకోవాలా?"

"పగటిపూట ఆమెని కదిపి నాపై ఇష్టంలేనిపక్షంలో చెప్పుదెబ్బలు తినలేక...."

"ఇదివర్లో అలాంటి సంఘటన ఏదేనా జరిగిందా?" మన్మధరావువేపు తిరిగాడు జలంధర్.

"ఒక్క క్షణం ఆగండి...." లోపలికెళ్ళాడు మన్మధ రావు. ఓ పెద్ద దస్త్రంలాంటి కట్ట మోసుకొచ్చాడు.

"చూడండి. ఇవన్నీ అమ్మాయికి ఎందరెందరో వ్రాసిన ప్రేమలేఖలు. రకరకాల కవిత్వాలతో నిండివున్నాయి. ఎవడేనా అతిగా ప్రవర్తించివుంటే అమ్మాయి అంతపనీ చేస్తుంటుంది."

"అమ్మాయికన్ని ప్రేమలేఖలు వస్తోన్నాయని తెలిసీ ఆమెకు పెళ్ళెందుకు చేయలేదు?"

"ఇలాంటి సంఘటనల్ని ఎన్నో ఎదుర్కొని అమ్మాయికి విసుగుపుట్టింది. దాంతో మగాళ్ళంటేనే ద్వేషం పుట్టుకొచ్చింది. పెళ్ళంటేనే రోత కల్గింది."

"అమ్మాయి మీకేమవుతుంది?"

"మా అన్నకూతురు."

"మీ అన్నగారు చనిపోయి ఎంత కాలమైంది?"

"అయిదేండ్లు."

"ఈ యింట్లో ఎవరెవరుంటారు?"

"అమ్మాయి, నేను, బిజినెస్ మేనేజర్ వాసవదత్త, అమ్మాయ సెక్రెటరీ వేణుగోపాల్, వంటమనిషి తంగవేలు, పనిమనుషులు రత్న, రాజి...."

"అమ్మాయికి సెక్రెటరీయా?"

"అవును. ఆమెకొచ్చే ప్రేమలేఖన్ని చదివి వినిపించి ఆమె రాయమన్నవిధంగా జవాబులు రాయడానికి...."

"అందరూ యిక్కడే పడుకుంటారా?"

"వాసవదత్త, వేణుగోపాల్ తప్ప అందరూ యిక్కడే."

"ముందు శవాన్ని చూడాలి. పదండి" అన్నాడు జలంధర్.

ఇంతలో ఇన్‌స్పెక్టర్ అతని బృందం దిగింది.

....శవాన్ని చూసి చలించిపోయాడు జలంధర్. శవంగా మారినా అపర్ణ అందం అతన్ని విచలితుణ్ణి చేసింది. ఈ సంఘటనచూస్తే "తన అందమే తన శత్రువు" అన్న మరో క్రొత్తపద్యం అతని మస్తిష్కంలో సృష్టించ బడింది. జాలిగా నిట్టూర్చాడు.

శేషగిరి బుర్రలో ఆలోచనలు అతివేగంగా ముసురు కుంటోన్నాయి....తను తన అడ్రస్ మన్మధరావుకి చెప్ప లేదు. డిటెక్టివ్‌కి తెలీదు. తెల్లారేసరికల్లా ఎలా తెలిసింది? ఎవరు చెప్పివుంటారు?....శర్మ కాదుకదా?!

....అవును. వాడే చెప్పివుంటాడు. వాడితో తను తొందరపడి అపర్ణ విషయం అడిగుండాల్సింది కాదు.... యింతకీ యిప్పుడు తన గతేమిటి? తను నిజంగా నిర్దోషి. ఆ విషయం ఋజువవుతుందా? చట్టం తనకి న్యాయాన్ని ప్రసాదిస్తుందా?....

తను వెళ్ళకముందే అపర్ణని ఎవరో హత్యచేశారు? ఎవరైవుంటారు? శర్మ చెయ్యటాని కాస్కారం వుందా. ఎందుకులేదు? శర్మేకాదు. అపర్ణను ప్రేమించి ఆమెచే ప్రేమించబడని ఏ వ్యక్తైనా ఆ హత్య చెయ్యటాని కాస్కారం వుంది. ఆమెచే అవమానించబడ్డ వాడైతే యింకా ఎక్కువ!

"మిష్టర్ శేషగిరీ...." జలంధర్ గంభీరమైన కంఠ స్వరం విన్పించి తృళ్ళిపడ్డాడు శేషగిరి. అప్రయత్నంగా



అతనివేపు చూశాడు.

"ఫ్రెంచ్ విండోకి ఓ తాడు బిగించబడివుంది. దాని చివరభాగం భవనం వెలుపలి భాగానికుంది. ఎంత నేర్పుగా కట్టాడో చూడండి అంటోన్నాడు మన్మధరావు...." అన్నాడు జలంధర్.

"మీతో అబద్ధం చెప్పి నేరానికి దగ్గర కావటం నాకిష్టం లేదుసార్! అసలు నాకు అపర్ణగది ఏదో కూడ తెలీదు. వాటర్ పైప్ పట్టుకొని ప్రాకాను. మరోగదికి చేరుకున్నాను. ఆ గదిలోంచి ఈ గదికొచ్చాను. ఈ గదిలో కూడ అలాంటి విండోయే వుంది. శవాన్ని చూసి గాభరాగా దాన్ని చేరుకున్నాను. అప్పటికే ఆ తాడు అక్కడ కట్టబడి వుంది."

జలంధర్ ఏదో తీవ్రంగా ఆలోచిస్తూ వుండిపోయాడు.

ఇన్స్పెక్టర్ బలగం తన పనులు ప్రారంభించింది.

6

మారుతాళం చెవితో తలుపుతీసి ఆ గదిలోకి దూరాడు శ్రీనివాస్.

గది దాదాపు నీటుగా వుంది. గాడ్రెజ్ మంచం, గాడ్రెజ్ కుర్చీలు రెండు, అదే జాతికి చెందిన ఓ టీపాయ్ వున్నా

యందులో. ఓ ప్రక్క ర్యాక్‌లో పుస్తకాలున్నాయి.

మరోచిన్న చెక్క షెల్ఫులో కొన్ని తెల్లకాయితాలు, కొన్ని వ్రాతప్రతులు వున్నాయి. వాటన్నిటిపైనా మొదటి పేజీలో 'పాగో' అన్న అక్షరాలున్నాయి.

వ్రాతప్రతుల్లోని రెండుమూడు పేజీలని జేబులో పెట్టుకున్నాడు. తాళం మామూలుగా వేసి బయటపడ్డాడు శ్రీనివాస్.

చీకట్లో తన కారుంది. హెడ్‌లైట్లు వెయ్యకుండా కొంత దూరం ప్రయాణించి ఓ చోటికి చేరుకున్నాడు. అక్కడ జలంధర్ డాడ్జి ఎదురు చూస్తోంది.

"మీరు వూహించింది నిజం సార్," మెల్లగా అన్నాడు శ్రీనివాస్.

"మరోటికూడ వుం దనుమానం. అది విడిపోతే ఈ కేసు అయిపోయినట్టే. పద...."

రెండుకార్లూ చీకట్లో మరికొంత దూరం ప్రయాణించాయి.

ఒకగంట తర్వాత—

పోలీస్ జీప్, డాడ్జికారు మన్మధరావు బంగళా ముందాగాయి. మన్మధరావు ఆత్రంగా పరిగెత్తుకొచ్చాడు.

"జలంధర్‌గారూ! రాత్రి మా గూర్ఖాను స్పృహ తప్పించి, ఎవరో మా బంగళాలో ప్రవేశించారు...." గాభరాగా అన్నాడు.

"మిమ్మల్ని అరెస్ట్ చేస్తోన్నాను...." కంచుగంటలా మోగింది ఇన్‌స్పెక్టర్ కంఠం.

"నన్నా? ఏమిటి మీరంటోన్నది?....మీపై పరువునష్టం దావా వెయ్యగలను జాగ్రత్త...." ఆవేశంతో వూగిపోతూ అన్నాడు మన్మధరావు.

డిటెక్టివ్ జలంధర్ నవ్వి, అన్నాడు—

"అందువల్ల పరువూ, డబ్బూ నష్టమేకాని ప్రయోజనం లేదు. మిస్టర్ మన్మథరావ్! వివరాలు చెప్పమంటావా?

"అపర్ణతండ్రీ నీ పెదనాన్న కుమారుడూ అయిన మోహనరావు చనిపోతూ ఆస్థిని అపర్ణ పేరిట వ్రాశాడు. అపర్ణకి తర్వాత ఆమె పిల్లలకి చెందుతుందని కూడ అందులో తెలియజేశాడు. ఆమె పెళ్ళయ్యేవరకూ నిన్ను ట్రస్టీగా నియమించాడు. ఈ విషయం నీ వకీలు ద్వారా తెలిసింది.

"నీలో స్వార్థం పెరిగింది. అపర్ణ అలవిమీరిన అందం నీ ప్లాన్‌కి బాగా సహకరించింది. ఆమెకి పెళ్ళిపట్ల విముఖత కల్గించాలనే వుద్దేశ్యంతో ఎవరెవరి పేరుతోనో ప్రేమ లేఖలు సృష్టించావు.

ఇంకా రికార్డుబ్రేక్ చెయ్యాలని 'పాగో' అనే కలం పేరుతో సెక్సుకథలు రాస్తోన్న వేణుగోపాల్‌ని స్నేహం చేసికొని, అతనితో మంతనాలు జరిపి, నీ తెలివిని జోడించి అతనికి ఆశపెట్టి, ఆమెకి సెక్రెటరీగా నియమింపజేశావు. అతనితో కవిత్వాన్ని నీ యిష్టమొచ్చిన మెలికలు తిప్పించి రకరకాల దస్తూరీతో అపర్ణకి పోస్టు చేయించావు.

"ఆమెకి ప్రేమపట్ల, మగజాతిపట్ల అసహ్యం కలిగింది. నిజంగా ఆమెని ప్రేమించిన కొందర్ని విదిలించేసింది. నీ పాచిక పారింది.

"ఆమెని చంపేసి సర్వాస్తికీ సర్వాధికారివి కావాలనుకున్నావు. దురదృష్టవశాత్తూ శేషగిరి నీ కంటబడ్డాడు.

"సాయంత్రం వ్యానిటీబ్యాగ్ తీసుకొని వచ్చాడు శేషగిరి. విదిలించావు. తర్వాత అతనిని వెంటాడి అతని అడ్రస్సు తెలుసుకున్నావు. ఆ ప్రాంతాల్లో నువ్వు శేషగిరిని గమనించినట్లు బలమైన సాక్ష్యం వుంది.

"అపర్ణని హత్యచేసి ఆ నేరం శేషగిరిపై రుద్దాలనుకున్నావు. శేషగిరి కాకపోతే మరెవ్వరో చేశారని తప్పించుకో వచ్చు. ఈ వ్యూహాని అమలు జరిపావు.

"అపర్ణ హత్యచేయబడిందని నువ్వు ఫోన్ చేసిన వెంటనే ముందుగానే మాట్లాడుకున్న ప్రకారం వేణుగోపాల్ కూడ నాకు ఫోన్ చేశాడు.

"వీలునామా విషయాలు, వేణుగోపాల్ దస్తూరీని, నీ దస్తూరీని పోలివున్న అపర్ణకి రాయబడ్డ ఫ్రమ్ అడ్రస్ లేని ప్రేమలేఖలు, ఫ్రెంచ్ విండోకి నువ్వు తాడు కట్టిన విధానం నిన్ను పట్టించాయ్. క్రింద నుండి ఏ వ్యక్తి తాడు విసిరినా అంత పకడ్బందీగా ముడిపడదు...." అన్నాడు డిటెక్టివ్ జలంధర్.

నిప్పుతొక్కిన కోతిలా ఎగిరిన మన్మధరావు, తేలు కుట్టిన దొంగలా అయిపోయాడు. ★

"ఒక్క అంగుళం క్రింద"

ఒక జపాన్ అతను, ఇండియా అతను ఇలా మాట్లాడు కుంటున్నారు.

జపాన్ అతను:-మా జపాన్‌లో విమానాలు చాలా ఎత్తు నుంచి ప్రయాణం చేస్తాయి. ఒక్క అంగుళమైతే ఆకాశాన్నే తాకుతాయి!

ఇండియా అతను:-మా దేశంలోనైతే అందరూ ముక్కుతోనే తింటారు!!

జపాన్ అతను:-చాలా ఆశ్చర్యంగా ఉందే! ముక్కుతో ఎలా తింటారు?

ఇండియా అతను:-ముక్కుతో అంటే ఒక్క అంగుళం క్రింద.... అంతే!!!

—యస్. జ్యోతిర్మయి, హైద్రాబాదు.

పద్మ-వ్యూహం

మల్లాది సురేష్

రాత్రి పది గంటలయింది....

సైకియాట్రిస్ట్ అశ్వత్థామ వాలు కుర్చీలో వెనక్కువాలి కాథెరిన్ మేయో రాసిన 'మదర్ ఇండియా' గ్రంథం చదవడంలో నిమగ్నమై ఉన్నాడు.

ఆయన నోట్లో పైప్ నిర్విరామంగా పొగలు కక్కు-

తోంది.

అశ్వత్థామ కుడిచేతి చూపుడువేలు యాంత్రికంగా పేజీ తిప్పుతుండగా, గదిలో గూడుకట్టుకున్న ప్రశాంతతను భంగపరుస్తూ, "ట్రింగ్....ట్రింగ్...." మన్న ధ్వని వినబడ్డంతో, ఆయనకు తపోభంగమయింది.

పైప్ ఎడంచేత్తో పట్టుకొని, కుడిచేత్తో రిసీవర్ అందుకున్నాడు అశ్వత్థామ.

"హెల్లో! ప్రొఫెసర్ అశ్వత్థామ స్పీకింగ్."

అట్నుంచి జవాబులేదు.

అశ్వత్థామ కనుబొమలు ముడివడ్డాయ్!

కొద్ది క్షణాలాగి మళ్ళీ అన్నాడు. "హెలో ప్లీజ్! హూ ఈస్ దేర్?"

ఈసారి అట్నుంచి ఓ స్త్రీ కంఠం తటపటాస్తూ పలికింది. "హల్లో! సైక్రియాటిస్ట్ అశ్వ...."

"అవునమ్మా! నేనే! మీపేరు....? హౌ కెన్ ఐ హెల్ప్ యూ?"

"సర్!....ఎలా చెప్పాలో తెలియడంలేదు."

"ఏదో సమస్యగురించి చెప్పాలనుకుంటున్నారు. మీరు నిలబడి మాట్లాడుతున్నారు కదూ?"

"ఎస్....ప్రొఫెసర్!"

"ముందు కూర్చోండి. తర్వాత తాపీగా చెప్పవచ్చు.... ప్లీజ్." కొంచెంసేపు నిశ్శబ్దం. అశ్వత్థామ పైపు పొగలు కక్కుతోంది.

తను మానసిక వైద్యుడు. తమ బలహీనతలు వెల్లడించడాన్కి నూటికి తొంభైతొమ్మిది మంది పేషంట్లు సిగ్గుపడతారు. సందేహిస్తారు. నేర్పుగా వారికి ధైర్యం యివ్వాలి.

అశ్వత్థామ ఆలోచనలు అరికడుతూ తిరిగి స్త్రీ కంఠం పల్కింది. "అశ్వత్థామగారూ! మీగురించిన పరిచయ వ్యాసం యిండియన్ ఎక్స్‌ప్రెస్‌లో చూసాను. డబ్బున్న వారిని, లేని పేషంట్లను, సమానంగా చూస్తూ క్లెప్టో మేనియా, హైపోనోయా, కిరణోఫోబియా, మిసోజిని, శాడిజం మొదలైన మానసిక వ్యాధిగ్రస్థులకు అద్భుతమైన వైద్యం చేసారని తెలుసుకొన్నాను. మీది ఈ ఊరే అని తెల్సి సంతోషించాను. ఫోన్ బుక్‌లో మీ నంబర్ దొరికింది...."

"వెరీగుడ్! కాబట్టి నామీద నమ్మకముంచి నీ పేరేమిటో, నీ సమస్యేమిటో ధైర్యంగా చెప్పమ్మా!"

"ప్రొఫెసర్! అయామ్ గోయింగ్ టు కమిట్ సుయిసైడ్."

అశ్వత్థామ కరెంటు షాక్ కొట్టినట్లు అదిరిపడ్డాడు.

ఆయన నోట్లోంచి పైపు జారి క్రిందపడ్డది.

"ఎస్. ప్రొఫెసర్! నేను ఆత్మహత్య చేసుకోబోతున్నాను. ఈ బలహీనత నన్ను దాదాపు మూడు నెలల నుంచీ వేధిస్తోంది. చీకటిపడితే ఈ కోరిక పెరుగుతోంది. ఈ జబ్బుని ఏవంటారో నాకు తెలీదు. ఇన్నాళ్ళూ నేర్పుగా అణుచుకుంటూ వస్తున్నాను. కాని, కాని....యిక ఈ కోరిక సప్రెస్ చేయలేను. బహుశా రెండు మూడు రోజులు లేక ఏదో గంటలో, ఏదో క్షణంలో నేను ఆత్మహత్య...."

"లుక్ చైల్డ్!" గాభరాగా పల్కింది అశ్వత్థామ కంఠం.

"ఇన్నాళ్ళూ ఏ వైద్యుడ్ని ఎందుకు చూడలేదు? నువ్వు చెప్పిన వివరాలు అసలు చాలవ్! దయచేసి నన్ను

కల్పుకో. పేషంట్ రహస్యాలు నేను బైటపెట్టను. నన్ను నమ్మాలి. నేను ఒంటరివాడ్ని. వృద్ధుడ్ని. నాకు దబ్బెం దుకు? డోంట్‌వర్రీ ఇఫ్ యూ ఆర్ పూర్. దయచేసి ముందు నీ వివరాలు చెప్పు. నీ పేరు?"

"సారీసర్! ఎలా బైటబెట్టగలను? మళ్ళీ రేపు మాట్లాడ తాను ప్రొఫెసర్! అసలు ఎవరికీ చెప్పకూడదను కున్నాను...."

"హెల్లో! హెల్లో! చూడమ్మా...."

ఫోన్ క్లిక్‌మన్న శబ్దం....

అశ్వత్థామ పైపు అందుకుని పొగ పీలుస్తూ, స్థాణు వులా నిలబడిపోయాడు.

2

మర్నాటి రాత్రి....

సమయం ఎనిమిది గంటలవుతోంది.

వాలుకుర్చీలో ఆశీనుడై యధాతధంగా పైపు పీలుస్తూ సైకియాట్రిస్ట్ అశ్వత్థామ ఆలోచిస్తున్నాడు.

రాత్రి సరిగా నిద్రలేదు. ఆయన మస్తిష్కం గతరాత్రి ఫోన్‌చేసిన ఆగంతకురాలు చుట్టూ తిరుగుతోంది.

అశ్వత్థామకు ఒక విషయంలో బెంగగా ఉంది.

మూడ్రోజుల్లో లయన్స్ క్లబ్ తరపున తను అమెరికా వెళ్ళవలసివుంది.

ఈలోపున ఆగంతకురాలి వ్యవహారం సెటిల్ చేయ గలడా?

అశ్వత్థామ స్థానంలో మరో మానసిక వైద్యుడు ఉంటే ఒక అనామకురాలి గురించి అంత బాధపడడు. కాని అశ్వత్థామ సంగతివేరు.

ఆయన గుండెలో రక్తం, జాలి కలిసి ప్రవహిస్తాయి.



అశ్వత్థామ ఆ ఉదయమే ఒక నిర్ణయానిక్కి వచ్చాడు.

ఈసారి 'ఆమె'నుండి ఫోన్ వచ్చినపుడు తను కొన్ని 'క్లూ'లు సేకరించాలి.

వాటి ఆధారంగా ఆమె అడ్రస్ తెల్సుకోవాలి.

ఆమె తనవద్దకు రాకపోతే తనే ఆమెవద్దకు వెళ్తాడు. వెళ్ళి....ఫోన్ పొలికేక పెట్టడంతో తృళ్ళిపడ్డాడు అశ్వత్థామ.

రెండు క్షణాలు తటపటాయిస్తూ నిలబడిపోయాడు.

'నో! ఇట్స్ ది టైమ్ ఫర్ మై టాలెంట్! అనుకుంటూ రిసీవర్ ఎత్తాడు.

"హెలో! అశ్వత్థామ స్పీకింగ్!...."

"గుడ్ ఈవెనింగ్ ప్రొఫెసర్; నేను దేవ్‌గన్‌ని మాట్లాడుతున్నాను."

అశ్వత్థామ ఒక్కసారిగా నిరుత్సాహంతో జావగారి పోయాడు. తనకు ఫోన్ చేసింది ఆగంతకురాలు కాదు.

లయన్స్ క్లబ్ సెక్రటరీ దేవ్ గన్. తనతో 'ఆమె' యిక కాంటాక్ట్ చేయకూడదని నిశ్చయించుకున్నదా?

"హెల్లో ప్రొఫెసర్! ఆర్యూదేర్?"....ఉలిక్కిపడి తేరుకున్నాడు అశ్వత్థామ "ఎస్. మిస్టర్ దేవ్ గన్! అ.... అయామ్‌సారీ. ఏదో ఆలోచనల్లో ఉన్నాను."

"ఇట్సాల్ రైట్ ప్రొఫెసర్! ఆదివారం మీ అమెరికా ప్రయాణం గురించి జ్ఞాపకం చేద్దామని ఫోన్ చేసాను. ఫార్మాలిటీస్ అన్నీ పూర్తి చేసాం. మీరు నోట్స్ సిద్ధపర్చుకున్నారా?"

"నిన్నటితోటే నా నోట్సు పూర్తయింది మిస్టర్ దేవ్ గన్! కాని, ఈ ప్రయాణం వాయిదా వెయ్యడానికి కుదరదంటారా?"....

"వాట్?" దేవగన్ కంఠం ఆశ్చర్యంగా పలికింది. "బట్ ప్రొఫెసర్! ఎయిర్ టిక్కెట్స్ రిజర్వే...."

"ఇట్సాల్ రైట్ మిస్టర్ దేవగన్! ఒక పేషంట్ కి కొద్దిరోజులు నా అటెంషన్ అవసరమేమోననిపించింది. అంతకంటే ఏంలేదు. ఎనీ వే....అయ్ విల్ బి ప్రిపేర్డ్ ఫర్ సన్ డే. శాటిస్ ఫైడ్?...."

"థ్యాంక్యూ ప్రొఫెసర్!"

రిసీవర్ క్రెడిల్ చేసి వెనక్కి తిరిగేంతలో ఫోన్ తిరిగి ట్రింగ్....మంటూ మోగింది.

మళ్ళీ రిసీవర్ అందుకున్నాడు.

"ప్రొ....ఫె....స....ర్!" ఆగంతకురాలి కంఠం అది!!

అశ్వత్థామ గుండె ఒకక్షణం కొట్టుకోడం మానేసింది. ఆమె కంఠం తన మెదడులో ప్రింటయిపోయింది

"నీ కండిషన్ ఎలా ఉందమ్మా?...." అడిగాడు నెమ్మదిగా.

"మామూలే ప్రొఫెసర్! రాత్రుళ్లు ఈ ఆత్మహత్య యింపల్స్ అనివార్యమైపోయింది. అసలు...."

అశ్వత్థామ చెవులు అకస్మాత్తుగా నిక్కబొడుచుకున్నాయి. ఆమె కంఠం కాకుండా ఫోన్‌లో గడియారం చేసే విచిత్రమైన శబ్దం వినబడ్తోంది!?!

పింగ్!....పాంగ్!....పింగ్!....పాంగ్!....

అతి శ్రావ్యమైన సంగీతం. అన్ని గడియారాలు ఆ శబ్దంచేయవు.

చటుక్కున వాచీ చూసుకున్నాడు అశ్వత్థామ.

ఎనిమిదింపావు!

అంటే ప్రతి పావుగంటకీ ఆ సంగీతం గడియారం లోంచి వినబడ్తుందన్నమాట.

"ప్రొఫెసర్! లైన్‌లో ఉన్నారా?"

కంగారు అణుచుకున్నాడు అశ్వత్థామ. "నీగురించే ఆలోచిస్తున్నానమ్మా? ట్రీట్‌మెంట్...."

"వద్దు ప్రొఫెసర్! ఇంకా ఆ విషయంలో నిర్ణయం తీసుకోలేదు. నా బలహీనత గురించి ప్రచారంకావడం నా కిష్టంలేదు. నా మెంటల్ ఫ్రస్ట్రేషన్ మీ రూహించలేరు. ఇంక వుంటాను అశ్వత్థామగారూ!" ఫోన్ పెట్టేసిన చప్పుడు....

అశ్వత్థామకు ఆగంతకురాలిని మాటల్లో ట్రాప్‌చేసే అవకాశం మిస్సయింది.

3

మర్నాడు చీకటి పడేవరకూ ముళ్ళకంపమీద కూర్చున్నట్లు గడిపాడు అశ్వత్థామ. ఈసారి ఎలాగయినా ఆమెను

మాటల్లోకి దించి ఎడ్రస్ తెలుసుకోవాలని నిశ్చయించు కొన్నాడు.

ట్రింగ్.... ట్రింగ్....

పైపు ముట్టించుకోబోయి, ఆగిపోయి సన్నగా వణుకు తున్న చేతులతో రిసీవర్ ఎత్తి చెవి దగ్గర వుంచుకున్నాడు అశ్వత్థామ.

"ప్రొ.... ఫె.... స.... ర్...."

ఆమె కంఠంలో వణుకు గ్రహించి, అదిరిపోయాడు అశ్వత్థామ. "హలో నేనమ్మా! ఏమిటి? ఏమయింది?"

"సార్! నా కోరికను ఆపుకోలేకపోయాను. ఆత్మ హత్య చేసు.... ఆ(...." మూల్గుతున్న ధ్వని.

చటుక్కున నిలబడి గాభరాగా అరిచాడు "ఏమిటమ్మా, అసలేం జరిగింది?"

"నే.... నేను విషం తాగాను. చివరిక్షణాల్లో వున్నాను. ఆ(.... మ్మా(...."

"ఏమ్మా! నీ భర్త ప్రక్కన లేడా?"

"ఆ.... ఆయనకు ఆ రేవతీ డెంటల్ క్లినిక్ తప్ప మరో ప్రపంచం పట్టించుకోరు ప్రొఫెసర్.... ఆ.... అమ్మో.... సా...." ఫోన్ జారిపడి నేలకు కొట్టుకున్న శబ్దం.

"హల్లో.... హల్లో...." అరిచాడు అయోమయంగా అశ్వత్థామ.

జవాబు లేదు.

వృద్ధుడైన అశ్వత్థామ కాళ్లు వణకసాగాయి. ఒక యువతి అనవసరంగా ఆత్మహత్యకు బలైంది. అశ్వత్థామ గభాలున టెలిఫోన్ డైరెక్టరీ మీద పడ్డాడు. చకచకా పేజీలు తిరగేసాడు. రేవతీ డెంటల్ క్లినిక్‌కి ఎదురుగా 11447 అన్న అంకె వుంది.

పుస్తకం విసిరికొట్టి, గబగబా ఆ నంబర్ డయల్ చేశాడు అశ్వత్థామ.

అవతలివైపు బర్....బర్....మన్న చప్పుడు. జవాబు వచ్చింది, "హలోవ్! డెంటిస్ట్ కాంతినాథ్ స్పీకింగ్."

"మిస్టర్ కాంతినాథ్! మీ భార్య ఆత్మహత్య చేసుకుంది" ఒగురుస్తూ చెప్పాడు అశ్వత్థామ.

"లిసెన్ మిస్టర్! యిది పిచ్చాసుపత్రి కాదు. దంత వైద్యశాల. హూది హెల్ ఆర్యూ?"....కోపంగా వినబడింది కాంతినాథ్ కంఠం.

అశ్వత్థామకు ఓర్పు నశించింది. "లుక్ మిస్టర్ కాంతినాథ్! దిసీజ్ నో టైం టు బి డ్రమటిక్! నేను సైకియాట్రిస్ట్ అశ్వత్థామను మాట్లాడుతున్నాను. మానసిక వైద్యుడికి పిచ్చి పట్టడం ఎప్పుడైనా విన్నారా? పిచ్చి ప్రశ్నలు మాని వెంటనే యింటికి వెళ్ళండి. ఆమె విషం తీసుకున్నట్టు యిప్పుడే నాకు ఫోన్ చేసింది. మీ యింటి అడ్రసు చెప్పండి."

అడ్రసు చెప్పి, తడారిపోయిన గొంతుకతో అన్నాడు కాంతినాథ్ "ఐ కాంట్ బిలీవ్ యిట్!...."

అశ్వత్థామ గబగబా ఆ అడ్రసు స్క్రాచ్‌ప్యాడ్ మీద రాసుకున్నాడు. "మీరు బైల్దేరుతున్నారా కాంతినాధ్! నేను పోలీస్ ఇన్‌స్పెక్టర్‌ని తీసుకుని ఆ అడ్రసుకు అరగంటలో వస్తాను."

"అయామ్ గోయింగ్" అన్నాడు ఏడుస్తూ.

పావుగంటలో అశ్వత్థామకూడా అక్కడికిచేరుకున్నాడు.

పోలీసు తతంగం పూర్తయింది.

కాంతినాధ్ బాగా షాక్‌లో వున్నాడు.

ఇన్‌స్పెక్టర్ జావర్ట్‌కి అశ్వత్థామ, రేవతి తనకు చేసిన ఫోన్‌కాల్స్ వివరాలు చెప్పాడు.

అశ్వత్థామ కధనం ఆసక్తిగా విని, "ప్రొఫెసర్! రేవతికి ఆత్మహత్య చేసుకోడానిక్కగల కారణాలు చెప్ప గలరా?" అడిగాడు ఇన్‌స్పెక్టర్ జావర్ట్.

"కాంట్ సే" తల అడ్డంగా ఊపాడు అశ్వత్థామ. "ఇన్‌స్పెక్టర్! ఆత్మహత్య చేసుకోవాలనే కోరిక పుట్ట డానికి నూటొక్క కారణాలు వుండవచ్చు. రేవతిలో బల హీనతను తెల్సుకొనే అవకాశం నాకామె యివ్వలేదు. కారణం న్యూరోసిస్ అనవచ్చు, డిప్రెషన్ అనవచ్చు. ఒక్కోసారి కారణం రేవతికే తెలియకపోవచ్చు. అటు వంటప్పుడు పేషంటుని హిప్నోసిస్‌లోనికి తీసుకు పోయి ప్రశ్నించాల్సి వుంటుంది. ఈ అవకాశాలామె నాకివ్వలేదు. ఐ పిటీ హర్!"

మౌనంగా తల వూపాడు జావర్ట్. "ఆల్‌రైట్ ప్రొఫె సర్! రేవతి ఆత్మహత్యపై మీస్టేట్‌మెంటు వ్రాసియివ్వండి."

పది నిముషాల తర్వాత స్టేట్‌మెంట్ యిచ్చి బైటికి నడిచాడు అశ్వత్థామ.

ఆ రెండవ రోజే అశ్వత్థామ అమెరికా బయలుదేరాడు.

4

అశ్వత్థామ రెండు నెలల తర్వాత మద్రాసు తిరిగి వచ్చాడు.

ఒకరోజు ఆయనకు విపరీతంగా పంటినొప్పి రావడంతో యిక బాధ తట్టుకోలేక కారేసుకుని బైలుదేరాడు అశ్వత్థామ.

మరో యిరవై నిముషాల్లో కారు 'రేవతి డెంటల్ క్లినిక్' ముందు ఆగింది. లోపల పేషంట్లు ఎక్కువగా వున్నారు.

"కాంతినాథ్ ఉన్నారా?" అడిగాడు ఎటండర్ని.

"సార్? డాక్టర్‌గారు ఆయన భార్యతో మాట్లాడుతున్నారు. పది నిముషాలు....అలా కూర్చోండి" అన్నాడు ఎటండర్ స్ప్రింగ్‌డోర్స్ ప్రక్కగావున్న కుర్చీ చూపిస్తూ.

అశ్వత్థామ నిశ్చేష్టుడయ్యాడు.

కాంతినాథ్—భార్యతో మాట్లాడటమేమిటి?

రేవతి మరణించింది కదూ?

స్ప్రింగ్‌డోర్స్ ప్రక్కగా కూర్చొని, అశ్వత్థామ తన చాదస్తపు ఆలోచనలకు తానే తిట్టుకున్నాడు. కాంతినాథ్ యువకుడు. భార్య మరణిస్తే రెండో పెళ్ళి చేసుకోకూడదా?

సరిగ్గా అప్పుడే....

పింగ్!....పాంగ్!....పింగ్!....పాంగ్!....

విచిత్రమైన శబ్దం చేస్తూ గోడగడియారం గంటలు కొట్టసాగింది.

అశ్వత్థామ చెక్క బొమ్మలా బిగుసుకుపోయాడు. ఆయన కనుబొమలు ముడివడ్డాయ్.

తలెత్తి గోడ గడియారంకేసి చూసాడు.

అయిదూ పదిహేను నిముషాలు!

ఈ గడియారం శబ్దమే తనకు రేవతి ఫోన్ కాల్ లో వినబడింది.

అలాంటి గడియారం రేవతి మరణించిన యింట్లో వున్నదో, లేదో చూడ్డం తను మర్చిపోయాడు. వాటె బ్లడీ ఓల్డ్ ఫూల్!....

"ఓహ్! కమాన్ డార్లింగ్!" అదే క్షణంలో కాంతినాథ్ గదిలోంచి స్త్రీకంఠం తీవ్రంగా వినిపించింది. "డామ్ యువర్ ప్రాక్టీస్! టిక్కట్లు రిజర్వు చేసేసాను. మనం ఎలాగైనా ఫస్ట్షోకి వెళ్ళాలి. ఫిడ్లర్ ఆన్ ది రూఫ్— యివాళే ఆఖరిరోజు"....

అశ్వత్థామ కాళ్ళ కింద భూమి కదులుతున్నట్టూ, తను కూర్చున్న కుర్చీ మెల్లగా లోనికి దిగబడిపోతున్నట్టూ, అనిపించింది. అతని గుండెలు వేగంగా కొట్టుకోసాగాయి.

కారణం....

ఈ కొత్తపెళ్లాం కంఠం ఎవరిదోకాదు.

రేవతిది!!!

నాకు ఆత్మహత్య చేసుకోవాలనివుంది ప్రొఫెసర్! అంటూ తన బలహీనత గురించి దీనంగా చెప్పుకున్న రేవతిది!!

తను ముసలివెధవే కావచ్చు! కాని....

డామిట్! రేవతి కంఠం తనను మోసం చేయలేదు. నిద్రలో కూడా ఆమె వాయిస్ని గుర్తుపట్టగలడు!

"ప్లీజ్ పద్మా! బయట పేషంట్లు చూసావుగా. ఇవ్వాల్టికి సినిమాకి రాలేను. నన్నర్థం...."

అశ్వత్థామ చటుక్కున నిలబడి తారాజువ్వలా బైటికి పరిగెత్తాడు....

ఆయన మెదడు వేడెక్కిపోయింది! కాంతినాథ్ పద్మని

ప్రేమించాడు. రేవతిని వదిలించుకోవాలని యిద్దరూ బ్రహ్మాండమైన పద్మవ్యూహం పన్నారు!

తాను ఎంతో అమాయకంగా వారి వలలో చిక్కుకున్నాడు!....అయామ్ ఏ యల్ డామ్‌ఫూల్! .... రేవతి 'హత్య'కు తాను 'ఆత్మహత్య'గా చక్కని సాక్ష్యం యిచ్చాడు. యిట్ ఈజ్ నాట్ సుయిసైడ్!

ఎ కోల్డ్ బ్లడెడ్ మర్డర్!!

అశ్వత్థామకి పిచ్చెక్కిపోతోంది. అవమానంతో ఆయన సన్నని శరీరం ఎండుటాకులా వణుకుతోంది.

రివ్వున బయటకు వచ్చి టెలిఫోన్ బూత్‌లోకి దూరాడు. వణుకుతున్న చేతుల్తో గబగబా నంబర్ తిప్పాడు.

"ఇన్‌స్పెక్టర్ జావర్ట్!" అర్చాడు ఆయాసంగా.

"ఎస్. జావర్ట్ స్పీకింగ్."

"ఇన్‌స్పెక్టర్! నేను అశ్వత్థామను మాట్లాడుతున్నాను. రెండునెలల క్రితం.... రేవతి ఆత్మహత్యకేసు జ్ఞాపకం ఉంది కదూ! అది సూసైడ్ కేస్ కాదు!....మాన్!.... ఇటీజ్ ఎ బ్లడీ మర్‌డర్! పిట్టలు దొరికాయి. ప్రశ్నలు వేయవద్దు....వెంటనే మీరు కాంతినాథ్ క్లినిక్‌కి రండి.... తెల్సుకదా ఎడ్రెస్?...."

"ఎస్ మిస్టర్ అశ్వత్థామ! నేను వెంటనే బైల్దేరుతున్నాను. అయిదు నిముషాల్లో నా జీపు అక్కడ వుంటుంది."

5

"వెల్ మిస్టర్ కాంతినాథ్ అండ్ పద్మా! మీ ఆట కట్టింది."

స్ప్రింగ్‌డోర్స్ తెరిచి అశ్వత్థామ నవ్వుతూ లోనికి అడుగుపెట్టాడు.

పద్మా కాంతినాధ్‌లు చటుక్కున తలెత్తిచూసాడు.

"మైడియర్ డేర్ డెవిల్స్! ముసలాడిని మీరిద్దరూ తెలివిగా బుట్టలో వేశారు. రేవతిని సునాయాసంగా హత్య చేశారు. కాని ఇప్పుడు మీ పాపం బ్రద్దలయింది. పద్మ కంఠం, పింగ్‌పాంగ్ గడియారం మిమ్మల్ని పట్టి యిచ్చాయ్."

కాంతినాధ్ ముఖంలో చకచకా రంగులు మారాయి. పద్మ తొందరగా ప్రమాదాన్ని గుర్తించింది. అంతే! ఆమె మృత్యుదేవతలా ముందుకు కదలడం, ఆమె చేతిలోని కుర్చీ గాలిలోకి ఎగిరి అశ్వత్థామ నెత్తిమీద బలంగా....

చటుక్కున తప్పుకోడంతో అశ్వత్థామ భుజంమీద బలంగాపడి కరకరా విరిగింది కుర్చీకాలు.

బాధగా అరుస్తూ అశ్వత్థామ బైటికి పరిగెత్తసాగాడు....

"పద్మా! మన రహస్యం తెల్సిపోయింది. అతన్ని వదలకు. కాచ్‌హిమ్!" గాభగారా అరిచాడు కాంతినాధ్, ముందుకు కదుల్తూ.

బయట కూర్చున్న పళ్లనొప్పి పేషంట్లు, తమ తమ బాధలు మర్చిపోయి, విచిత్రంగా నోరావలించి చూస్తుండగా అశ్వత్థామ వెంటపడ్డారు, పద్మా, కాంతినాధ్‌లు....

అశ్వత్థామ ఆయాసంతో, రోడ్డుమీదకు తూలగానే, పోలీస్‌జీప్ కీచుమంటూ సడన్‌బ్రేక్‌తో ఆయన ముందాగింది.

పోలీస్‌జీపును చూసిన కాంతినాధ్, పద్మల కాళ్లకు బ్రేకులుపడ్డాయి....

మరుక్షణంలో వారిద్దర్నీ ఈగల్లా చుట్టుముట్టారు పోలీసులు.

★

ఆమె హత్య

చైతన్య

"నమస్కారం! మీతో కాస్త పనుండి వచ్చాను!" చెప్పాడతను ద్వారం దగ్గర నిలబడి.

"కూర్చోండి!" కుర్చీ చూపించి అతనివైపు పరీక్షగా చూసాను. ముప్పై ఏళ్లుంటాయి. సన్నగా, ఎర్రగా వున్నాడు.

తెల్లటి లాల్చి, పైజామా, కళ్ళజోడు, బట్టతల, హుందాగా ఉన్నాడు.

"నా పేరు నరహరి. 'ఉదయకిరణం' పత్రికకు సబ్ ఎడిటర్‌గా పనిచేస్తున్నాను" చెప్పాడతను కుర్చీలో కూర్చొని.

తల వూపి అడిగాను. "విషయమేమిటో చెప్పండి!"

నరహరి ఒక్క నిముషం తటపటాయించి, "శిరీష గారూ మీ గురించి విన్నాను. నేను చెప్పే విషయం పది మందికి తెలియదనే ధైర్యంతోనే మీ దగ్గరకు వచ్చాను...."

"మీకా భయం అక్కర్లేదు. ఎంతో అత్యవసరమైతే తప్ప మీ గురించి, మీరు చెప్పే విషయం గురించి, ఎవ్వరికీ చెప్పను. అది నా వృత్తిధర్మం!" మధ్యలోనే అన్నాను.

"థాంక్స్! మీకు 'గ్రాఫోలజీ' గురించి తెలుసా?" హఠాత్తుగా అడిగాడు అతను.

నవ్వాను. "తెలియదు. కాని విన్నాను."

నరహరి తల ఊపి, "అవును! మన దేశంలో చాలా మందికి తెలియదు. ఇంగ్లండ్, అమెరికా, రష్యాలాంటి దేశాల్లో 'గ్రాఫోలజీ'కి అత్యధిక ప్రాధాన్యం ఉంది. గ్రాఫోలజీ ఒక అద్భుతమైన కళ. ఇటీజ్ జస్ట్‌లైక్ పామిస్ట్రీ, అండ్ ఆస్ట్రాలజీ.

చేతిరేఖలనుబట్టి, జన్మనక్షత్రాన్నిబట్టి, మనిషి భవిష్యత్తును యెలా అంచనా వేయగలమో ఈ గ్రాఫోలజీ ద్వారా, ఒక మనిషి చేతివ్రాత ద్వారా అతని భవిష్యత్తును ఊహించవచ్చు. అంతేకాదు. ఇందులో ఇంకో విశేషం ఉంది. ఈ గ్రాఫోలజీ ద్వారా మనిషి మనఃప్రవృత్తిని కూడ ఊహించవచ్చు."

ఒక్కక్షణం ఆగి మళ్ళీ చెప్పాడు.

"స్కాట్‌లాండ్‌యార్డ్, ఇంటర్‌పోల్‌లో గ్రాఫోలజీకి ప్రత్యేక విభాగం ఉంది. నేరస్థుడని ఊహించిన వ్యక్తి చేతివ్రాతద్వారా, అతను ఆ నేరం చేసాడా లేదా! అని తెల్సుకోవచ్చు. ఇటువంటి అద్భుతమైన కళ గురించి మన దేశంలో చాలామందికి తెలియకపోయినా, తెల్సిన కొద్దిమందిలో నేను ఒకణ్ణి."

ఆశ్చర్యపోయాను.

"అవును! నేను గ్రాఫోలజీ నేర్చుకోవడం చాలా విచిత్రంగా జరిగింది. మా అన్న 'హార్ట్‌ట్రాన్స్‌ప్లాంటేషన్' గురించి అమెరికాలో రీసెర్చి చేసే సమయంలో నేను అక్కడికి వెళ్లాను. నాకు అక్కడ ఏమీ తోచక ఏం చెయ్యాలా, అని ఆలోచిస్తుంటే, మా అన్నయ్య యీ గ్రాఫోలజీ గురించి చెప్పి, దాన్ని నేర్చుకోమన్నాడు.

'గ్రాఫోలజీ' అయిదు సంవత్సరాల కోర్సు. నేను మూడో సంవత్సరం చదువుతుండగా, మా అన్న కారు ఆక్సిడెంట్‌లో చనిపోయాడు. అందుకే తప్పనిసరిగా కోర్సు మానుకొని యిక్కడికి వచ్చేసాను.

కోర్సు కంప్లీట్ చెయ్యకపోయినా, గ్రాఫోలజీ గురించి నాకు బాగా తెల్సు. అయినా, ఆ విద్య నాకు ఇక్కడ పనికి రాలేదు. అందుకే భుక్తికోసం 'ఉదయ కిరణం' పత్రికలో సబ్‌ఎడిటర్‌గా చేరాను!"

"అసలు విషయం చెప్పలేదు!" గుర్తుచేశాను.

అతను సిగరెట్ వెలిగించి, "అదే చెప్పబోతున్నాను. వారంరోజుల క్రిందట తులసి అనే ఆవిడ మా ఆఫీసుకు వచ్చి, "వర్గీకృత ప్రకటనల కాలం"లో స్థలం అమ్మకానికి గాను ఒక ప్రకటన వ్రాయిచ్చింది. దాన్ని ప్రకటించాం....

నాకు ఒక అలవాటు ఉంది. నాకు గ్రాఫోలజీ తెల్సు కాబట్టి ఏ మాటర్ యెవ్వరు ఇచ్చినా, ఆ చేతివ్రాత పరీక్ష వేస్తుంటాను. అఫ్‌కోర్స్....అవన్నీ చెప్పకూడదు. వాళ్ళ వాళ్ళ వ్రాతల్నిబట్టి, ఎన్నో లోపాలు తెలుస్తాయి. అలవాటు ప్రకారం గ్రాఫోలజీ సాయంతో తులసి చేతివ్రాత పరీక్షించాను. చాల ఆశ్చర్యపోయాను...."

"ఏం జరిగింది?" ఆతృతగా అడిగాను.

"ఆమె ఒక హత్య చేసి ఉండాలి. వారం రోజుల క్రిందట!"

"మీరు చెప్పేది నిజమేనా?...." ఆశ్చర్యంగా అడిగాను.

"అనే అనుకుంటున్నాను. గ్రాఫోలజీలో నాకున్న పరిజ్ఞానంమీద నాకు నమ్మకం ఉంది. అయితే ఎంతటివాడికైనా పొరపాట్లు తప్పవు. అందుకే మీ దగ్గరకు వచ్చాను. నాకు తెల్సినంతవరకు ఆమె హంతకురాలని తోస్తోంది. మీరు పరిశోధించి సాక్ష్యాలు సేకరించండి."

"ఒకవేళ మీ అనుమానం నిజం కాకపోతే....?" అడిగాను.

"బహిరంగంగా ఆవిడకు క్షమార్పణ చెప్పుకుంటాను" అన్నాడు దృఢంగా నరహరి.

తల ఊపి, "ఆవిడ అడ్రసు, మీ ఇంటి అడ్రసు ఇచ్చి వెళ్ళండి!" అన్నాను.

నరహరి కాగితంమీద రెండు అడ్రసులు వ్రాసిచ్చి, "ఒక్కమాట! మీ పరిశోధనలో సాధ్యమైనంతవరకు నా పేరు బైటపెట్టకండి. అంతే నేను కోరేది!" అన్నాడు లేచి నిలబడుతూ.

"అలాగే!"

నరహరి నమస్కరించి వెళ్ళిపోయాడు.

తులసి అడ్రసు ఒకసారి చదువుకొని ఆలోచిస్తూ కూర్చున్నాను.

చాల విచిత్రంగా వుంది కేసు. ఇందులో 'మెటీరియల్ విట్నెస్' ఏమీలేదు. జస్ట్ అస్సంప్షన్, ఎనీహౌ! ఐ హేవ్ టు ప్రొసీడ్! లేచినిలబడ్డాను.

2

కారాపి క్రిందకు దిగాను.

ఒకమోస్తరు డాబా అది. ఇంటి ముందు పూల మొక్కలు వున్నాయి. వీధి గేటు మూసి వుంది.

చుట్టూ చూచాను.

ప్రక్క ఇంటి వీధి వాకిట్లో ఎవరో వ్యక్తి నిలబడి నా వైపే చూస్తున్నాడు.

"రాజారావుగారి ఇల్లు ఇదేకదూ?" ఏమీ అడక్కపోతే బావుండదని అడిగాను.

అతను తల ఊపి, "ఆయన భార్య బజారుకు వెళ్ళినట్లుంది" అన్నాడు.

"రాజారావుగారు ఇంట్లో లేరా?" అడిగాను.

అంతలో "ఎవరు కావాలి?" అడిగిందొకామె వస్తూనే.

"రాజారావుగారు."

"నేను వారి భార్యను. లోపలికి రండి" వీధి గేటు తెరిచి లోపలికి ఆహ్వానించింది.

"ఏం పనిమీద వచ్చారు?" తలుపు తాళం తీస్తూ అడిగింది.

"మీరు ఇల్లు అమ్ముతామని ప్రకటించారుకదా! ఇల్లొకసారి చూచి పోదామని వచ్చాను. నచ్చితే కొంటాను" చెప్పాను.

తులసి తల వూపి, "కూర్చోండి" అని కుర్చీ చూపించి "ఇప్పుడే వస్తాను" అంటూ లోపలికి వెళ్ళింది.

ఇల్లంతా పరీక్షగా చూచాను. హాల్లోంచి మేడమీదకు మెట్లున్నాయి. పైన రెండు గదులున్నాయి. ఇల్లు వెల్ల వేయకపోవడంవల్ల గోడలు నల్లగా వున్నాయి. హాల్లోనే మెట్లక్రిందుగా రెండు గదులున్నాయి.

ఆమె చీర మార్చుకొని వచ్చింది. "రండి! ఇల్లు చూద్దురుగాని!"

క్రింద గదులు రెండూ పరీక్షగా చూశాను. అనుమానించ దగింది ఏమీ కన్పించలేదు. అందులో ఒకటి పూజ గది, ఇంకొకటి వంట గది. వెనుక వైపు బాత్‌రూమ్, లెట్రిన్ వున్నాయి.

ఆమె మేడపైకి దారి తీసింది. అనుసరించాను. "ఇది పాత ఫర్నిచర్ వేసిన గది."

తలుపు తెరిచింది.

లోపల విరిగిపోయిన కుర్చీలు, మంచాలు వున్నాయి.

"ఈ గదిలో మావారుంటున్నారు" మరో గదిలోకి దారి తీసింది.

లోపలికి నడిచాను. గదిలో కిటికీ దగ్గర వీల్‌చైర్‌లో కూర్చొని పుస్తకం చదువుకుంటున్నాడు రాజారావు. ఆశ్చర్యపోయాను. అతనికి రెండు కాళ్ళూ లేవు.

"ఆరేళ్ళక్రిందట కారు ఆక్సిడెంటులో రెండు కాళ్లూ పోయాయి" తులసి కంఠం రుద్ధమయింది.

"ఎవరూ?" అడిగాడు రాజారావు వెనక్కు తిరిగి.

"వీరు మన ఇల్లు చూడటానికి వచ్చారు" అని, "మీ పేరు?" అడిగింది.

"శిరీష" చెప్పాను.



ఇద్దరం క్రిందకు వచ్చాం. "ఇల్లు మీకు నచ్చిందా?" ఆతృతగా అడిగింది.

నవ్వాను. "నాకు నచ్చింది. కాని మా ఇంట్లోవాళ్ళకూ నచ్చాలిగా! వాళ్ళతో మాట్లాడి ఏ విషయం రేపు చెబుతాను."

తులసి తల వూపింది.

నేను ధర కూడ అడగలేదు. తులసికి చెప్పి వచ్చేసాను. నాకు ఆ ఇంట్లో అనుమానించదగ్గ విషయం ఏమీ కన్పించలేదు. 'ఏం చెయ్యాలి? తులసి హంతకురాలో, కాదో ఎలా తెల్సుకోవడం? అసలు హంతుడెవరు! శవం ఏమయి వుంటుంది?' ఆలోచిస్తూ ఇంటికి వచ్చాను.

కారాపి క్రిందకు దిగి, తలుపు తెరిచాను. వెనక చప్పుడయింది. తిరిగి చూచాను.

అతను నవ్వుతూ నా వెనక నిలబడి ఉన్నాడు.

"మీరా?" ఆశ్చర్యంగా అడిగాను.

"అవును. మీతో మాట్లాడాలని, మీ వెనుకే టాక్సీలో వచ్చాను" చెప్పాడతను.

"నా పేరు కిరాతరావు. మీ గురించి నాకు తెలుసు. మీరు రాజారావు ఇంటికి ఎందుకు వెళ్ళారు?" అడిగాడు అతను లోపలికి వచ్చి కుర్చీలో కూర్చున్నాక.

"మీకేమిటి ఇందులో ఇంట్రస్టు?" అడిగాను సూటిగా చూస్తూ.

కిరాతరావు నవ్వి, "నాకు కొన్ని విషయాలు తెల్సు. మీ రక్కడికి ఎందుకు వెళ్ళారో చెబితే, నేను ఆ విషయాలు చెబుతాను" అన్నాడు.

"ఇతర కారణం ఏమీ లేదు. నేను ఆ ఇల్లు కొనదల్చుకున్నాను. అందుకే చూడాలని వెళ్ళాను" చెప్పాను.

"ఇన్ని రోజులు నా అనుమానం కేవలం భ్రమ అనుకున్నాను. ఈరోజు అది నిజం అని తేలిపోయింది. మీకు ఇక్కడ ఇల్లు వుంది. అయినా, ఎక్కడో మారుమూల అదీ, ఇరుకైన ఇల్లు కొనడానికి వెళ్ళారంటే నేను ఎలా నమ్మేది? నాకు తెల్సు. మీరు ఆ నెపంతో ఆ ఇల్లు సోదా చెయ్యడానికి వెళ్ళారు. అవునా?"

ఆశ్చర్యంగా చూచాను కిరాతరావు వైపు.

"సో! నా అనుమానం గురించి మీకు చెప్పడంలో తప్పు లేదు" అని క్షణం ఆగి, "బహుశా మీరొక హత్య కేసు గురించి అక్కడికి వెళ్ళి వుంటారు. అవునా?" అడిగాడు.

"మీకెలా తెల్సు?"

"చెబుతాను. నా కెవరూ లేదు. ఉన్న ఉద్యోగం ఎమర్జెన్సీలో ఊడిపోయింది. ట్యూషన్స్ చెప్పుకుంటూ అక్కడే కాలం గడుపుతున్నాను.

నాల్గురోజుల క్రిందట, ఒకరోజు ఉదయం నేను వీధి లోకి వచ్చేసరికి, మా వాకిలి ముందు గోడవారగా చీమలు పుట్టలుపుట్టలుగా వున్నాయి. ఉన్నట్లుండి ఇన్ని చీమలు యెందుకొచ్చాయా అని పరీక్షగా చూచాను. గోడవారగా మట్టి అక్కడక్కగా ఎర్రగా కన్పించింది. మీరు చూచే వుంటారు. రాజారావుగారి ఇంట్లోని బాత్‌రూం నీళ్ళు, మా వాకిలి ముందుగా వెళ్ళి డ్రెయినేజ్‌లో కలుస్తాయి.

నాకు అనుమానం కలిగి మరింత పరీక్షగా చూచాను. వాకిలి ముందు తడిగా వుంది. అక్కడక్కడ మట్టి ఎర్రగా వుంది. అందులో ఏదో కల్సివుండాలి. అందుకే చీమలు చేరాయి. ఏమయివుంటుంది?

కొద్దిగా మట్టి తీసుకొని పరీక్షగా వాసన చూశాను. రక్తం అయివుంటుందని అనుమానం వచ్చింది. రక్తం యెండిపోతే చీమలు పడతాయని నాకో తెల్సు. అయితే యింత రక్తం యెక్కడిది?

రాజారావుగారు బ్రాహ్మలు. కనీసం కోడిని కూడ కొయ్యరు. అలాంటప్పుడు వాళ్ళయింట్లోంచి ఇంత రక్తం యెలా వచ్చింది? చెయ్యి, కాలు తెగినా, యింత రక్తం రాదే!

హఠాత్తుగా నాకో విషయం జ్ఞప్తికి వచ్చింది. అంతకు రెండురోజుల క్రితం, ఒక సన్యాసి వచ్చాడు రాజారావు యింటికి. రెండురోజులపాటు అక్కడే తిని పడుకున్నాడు. అంతే, ఆ తర్వాత కన్పించలేదు. ఎప్పుడు వెళ్లాడో తెలియదు. వీటన్నిటిని బట్టి నాకో అనుమానం కల్గుతోంది" చెప్పాడు కిరాతరావు.

"ఏమిటది?" అడిగాను ఆతృతగా.

"రాజారావుకు తులిసి రెండో భార్య. మొదటి భార్య

క్షయతో చనిపోయింది. తులసి కాపరానికి వచ్చిన నాలుగైదు ఏళ్ళకే రాజారావుకు కాళ్లుపోయాయి. అయితే, తులసికి, రాజారావువల్ల పిల్లలు కలగలేదు. తులసికే కాదు మొదటి భార్యకు కూడ లేరనుకోండి!

ఇద్దరూ వెళ్ళి డాక్టరుకు చూపించుకున్నారట! ఇద్దర్లో ఏ లోపములేదని చెప్పాడు డాక్టరు. అప్పటినుంచి, తులసి వ్రతాలు, నోములు మొదలుపెట్టింది.

ఇక, నా అనుమానం ఏమిటంటే, ఒకవేళ ఆ సన్యాసి, పిల్లలు కలగడానికి, ఏదైనా బలి యివ్వమని పూజావిధానం చెప్పి వుంటే, అలా చేసిందేమోనని నా అనుమానం."

"అంటే?" అర్థం కాలేదు.

"నరబలి! పిల్లలకోసం యెంత మంది నరబలలు ఇవ్వడంలేదు. అలాగేచేసి వుండడానికి ఆస్కారం వుంది కదా" అడిగాడు.

తలూపాను! "మీకు, రాజారావుగారితో బాగా పరిచయం ఉందా?" అడిగాను.

"లేదు. ఎందుకో నేనంటే తులసికి పడదు. నేను ఎదురుపడితే చాలా దూరంగా తప్పుకుపోయేది."

"ఆల్‌రైట్! మీరు చెప్పిన విషయం నాకు చాల ఉపకరిస్తుంది. పోతే మీరొక సాయం చెయ్యాలి."

"చెప్పండి!" అన్నాడు కిరాతరావు.

"మీరక్కడే వుంటారు కాబట్టి, తులసిని ఒకకంట కనిపెట్టి ఉండండి. ఏదైనా విశేషం తెలిస్తే ఈ నెంబరుకు ఫోన్ చెయ్యండి" అన్నాను విజిటింగ్‌కార్డు అందిస్తూ.

"ష్యూర్! నాకిలాంటి పనులంటే చాల ఇంట్రస్టు!" అన్నాడు ఉత్సాహంగా లేచి నిలబడుతూ.

"ఒక్క విషయం! ఎట్టి పరిస్థితులలోను ఆమెకు



అనుమానం కలగకుండా ప్రవర్తించాలి!" హెచ్చరించాను.

నవ్వాడు కిరాతరావు. "చూస్తారుగా నా నేర్పు!" తల ఎగురవేసి వెళ్ళాడు.

3

టెలిఫోన్ మ్రోగింది. విసుగ్గా రిసీవర్ అందుకొని, 'హల్లో!' అన్నాను.

మరుక్షణంలో నా మత్తు వదిలిపోయింది.

"ఇప్పుడే వస్తున్నా!" అని అరిచి, రిసీవర్ క్రెడిల్ చేసి చకచక చీర మార్చుకొని, కిరాతరావు యింటికి బయలుదేరాను.

అప్పటికింకా తెల్లవారలేదు. నేను వెళ్ళేసరికే, కిరాతరావు ఇంటిముందు జనం గుమిగూడి వున్నారు.

చకచకా లోపలకి నడిచాను. ఇన్స్పెక్టర్ ఎదురొచ్చాడు. "రండి! శిరీషగారూ! కిరాతరావు హత్య చెయ్యబడ్డాడు!" అన్నాడు గదిలోకి దారితీస్తూ.

లోపలికి వెళ్లాను. మంచంలో కిరాతరావు వెల్లకిలా పడివున్నాడు. గుండెల్లో కత్తి పిడివరకు దిగివుంది. దాన్ని చూడగానే యెక్కడో చూచినట్లు గుర్తుకొచ్చింది....

చటుక్కున గుర్తొచ్చింది. అదే కత్తిని తులసి వంటగదిలో చూచాను.

"మైగాడ్! హత్య తులసే చేసివుండాలి!"

"తులసి ఎవరు?" అడిగాడు ఇన్స్పెక్టర్.

"తర్వాత చెబుతాను. అసలు జరిగిందేమిటి?" అడిగాను.

"ఏముంది. ఉదయాన్నే పనిమనిషి వచ్చి చూసేసరికి తలుపులు తెరిచివున్నాయట. లోపలికి వెళ్ళేసరికి కిరాతరావు హత్య చెయ్యబడి ఉండడం చూచి, భయపడి బైటకు పరుగెత్తుకొచ్చింది. ఆ తర్వాత ఎవరో మాకు ఫోన్ చేస్తే వచ్చాం. నిన్న కిరాతరావు మిమ్మల్ని కల్సుకున్నట్లుగా పనిమనిషితో చెప్పాడట. అందుకే మీకు ఫోన్ చేసాను" చెప్పాడు ఇన్స్పెక్టర్.

తల ఊపి, "మీ కార్యక్రమం మీరు కానివ్వండి! ఇప్పుడే వస్తాను" అంటూ చకచక బైటకువచ్చి, తులసి ఇంటివైపున నడిచాను.

తలుపులు తీసివున్నాయి. ఇల్లంతా నిశ్శబ్దంగా వుంది. 'పిట్ట ఎగిరిపోయిందేమో' ఆలోచిస్తూ మేడ మెట్లవైపు నడిచాను.

మేడమెట్ల దగ్గర టేబులుమీద కాగితం రెపరెపలాడుతూ కన్పించింది. ఆత్రుతగా అందుకున్నాను.

శిరీషగారూ!

మీరు ఇక్కడికి వస్తారని నాకు తెల్సు. అసలు మీరు మా ఇల్లు చూడడానికి వచ్చినప్పుడే అనుకున్నా నా నేరం బయటపడుతుందని. అయినా మొండిధైర్యం నాది. అందుకే కిరాతరావును కూడ హత్య చెయ్యవలసి వచ్చింది.

నేను చేసిన తప్పేమిటో నాకు తెల్సు. మా ఇంట్లో కత్తితో కిరాతరావును చంపి దాన్ని అక్కడే వదలి

వచ్చాను. దాన్నిబట్టి మీరు ఇక్కడకు వస్తారని తెలుసు. అయితే, అన్నిటికంటె ముందు మీకు ఇంకో విషయం చెప్పాలి.

నాది చాల పేద కుటుంబం. అయినా అష్టకష్టాలుపడి, నా తల్లితండ్రులు ఒకతనికిచ్చి వివాహంచేసారు. అయితే ఆ ప్రబుద్ధుడు దైవచింతతో, పెళ్ళయి నెల తిరగకుండానే సన్యాసుల్లో కలసిపోయాడు. ఆ తర్వాత రెండేళ్ళకు అతను చనిపోయినట్లు తెల్సింది.

సంసార జీవితం చవిచూడకుండానే, రెండు పదులు నిండకముందే, నాకు వైధవ్యం ప్రాప్తించింది. ఈ వ్యథ భరించలేక నా తల్లితండ్రు లిద్దరూ కన్ను మూసారు. ఆ తర్వాత ఎక్కడెక్కడో బ్రతికాను. కాని, ఏనాటికైనా పునిస్త్రీగా, భర్త పాదాలముందు కళ్లు మూయాలని నా కోరిక. అది తీరేదెలా?

అయితే అనుకోకుండా, ఒకసారి రాజారావుగారు నన్ను కల్సుకోవడం తటస్థించింది. ఆయనకు భార్య పోయింది. వివాహం ప్రసక్తి తెచ్చారు. నేను ఆనందంగా అంగీకరించాను. మా వివాహం జరిగిపోయింది.

అయితే, రాజారావుగారికి అనుమానం ఎక్కువని గ్రహించి చాల బాధపడ్డాను. ఎవ్వరితో మాట్లాడ్డానికి వీల్లేదు. మగవాళ్లు ఎవ్వరూ ఇంటికి రాకూడదు! అయినా భరించాను. నాకు నా భర్తే సర్వస్వం! నాకు పిల్లలు కల్గక పోయినా చింతించలేదు అంతగా.

అయితే అనుకోకుండా నా జీవితం మలుపు తిరిగింది. వారం రోజుల క్రిందట, చనిపోయాడనుకున్న నా మొదటి భర్త నన్ను వెదుక్కుంటూ వచ్చాడు. నాకోసం రాలేదు. నా దగ్గరున్న డబ్బుకోసం!

అడిగినంత ఇవ్వకపోతే, తను బ్రతికివున్నా, మోసం చేసి, నేను ఆయన్ని వివాహం చేసుకున్నానని రాజారావు గారితో చెబుతానని బెదిరించాడు. ఏంచెయ్యాలో తోచ లేదు. ఈ విషయం రాజారావుకు తెలిస్తే నా జీవితం ఏమౌతుందో?

రెండు రోజులపాటు నా మొదటి భర్త ఇక్కడే రహస్యంగా ఉన్నాడు. ఒకరోజు, నన్ను పిలిచి, రాజా రావును హత్య చెయ్యమని, ఆస్తంతా నాకే దక్కు తుందని చెప్పాడు. అప్పుడే తెగించాను. లోకందృష్టిలో నా మొదటి భర్త మరణించాడు. అది నిజంచేస్తే నా జీవితం హాయిగా సాగిపోతుంది.

అందుకే తప్పనిసరిగా నా మొదటి భర్తను హత్య చేసాను. ఆ విషయం మీకు, కిరాతరావుకు ఎలా తెల్సిందో నాకు తెలియదు.

రాత్రి కిరాతరావు వచ్చాడు. నేనొక హత్య చేసినట్లుగా తనకు తెల్సునని, ఆ రహస్యం కాపాడాలంటే, ఒక రాత్రి అతనికి దక్కాలని చెప్పాడు.

అసలే తెగించాను. అప్పటికే ఒక హత్య చేశాను. నా కాపరం కాపాడుకోవడం అత్యవసరం. అందుకే ఇంకో హత్య అయినా ఫర్వాలేదు.

కిరాతరావును నమ్మించి ఇంటికి వెళ్ళి హత్య చేశాను. అయితే కంగారులో కత్తి తీసుకురావడం మర్చిపోయాను. ఆ తర్వాత వీల్లేకపోయింది.

నాకు తెలుసు, మీరు వస్తే దాన్ని చూస్తారని. ఇక నా నేరం దాగదు నా జీవితం ఏమయినా, నా కోరిక తీర్చుకో వాలనే నిర్ణయానికి వచ్చాను. అందుకే సుమంగళిగా వెళ్ళి పోతున్నాను...."

ఉత్తరం పూర్తిచెయ్యకుండానే, మేడమీద గదిలోకి పరుగెత్తాను. తలుపులు తెరిచి అక్కడే నిలబడిపోయాను.

గది మధ్యగా వీల్‌చైర్‌లో తల వాల్చి వున్నాడు రాజారావు.

రాజారావు కాళ్ళ దగ్గర....పట్టుచీర....తలంటుకున్న కురులు, నుదుట రూపాయి కాసంత బొట్టు, చేతులనిండా గాజులు, కాళ్ళకు పారాణి....తులసి మొహం వెలిగిపోతుంది.

అయితే ఆ కళ్ళు మూతలుపడి వున్నాయి. చూస్తేనే తెలుస్తుంది ప్రాణం ఎప్పుడో పోయిందని.

చటుక్కున క్రిందకు పరుగెత్తాను. ★

దొడ్డ మనసు!

ఇద్దరు దొంగలు ఇలా మాటలాడుకుంటున్నారు—

"ఒరేయ్....కేశవ్! నువ్వూ, నేను ఇద్దరం కలిసి వో అడవిగుండా వెళుతున్నామనుకో! అప్పుడు హఠాత్తుగా మనకు లక్షరూపాయల మూట ఒకటి, పిస్టల్ ఒకటి దొరికిందనుకో! అప్పుడు నీ వాటా ఏం తీసుకుంటావురా?" అడిగేడు జగ్గడు.

"న్యాయంగా చూస్తే మీరు నా గురువుగారు కాబట్టి, ఆ లక్షరూపాయలను మీకే ఇచ్చేస్తాను బాస్!" వినయంగా చెప్పాడు కేశవ్.

"నీది మా దొడ్డమనసురా! డబ్బు నాకిచ్చి, పిస్టల్ నీవు తీసుకుంటున్నావ్!"

"ఆ తర్వాత నా వాటాకి వచ్చిన పిస్టల్‌తో మిమ్మల్ని కాల్చి చంపి, ఆ లక్షరూపాయలుకూడా తీసుకుంటాను కదా!!"

యం. వీరాస్వామి, మల్కాజిగిరి.

ఫలించని ప్లాన్

-అజేయ్

పాఠకుల పరిశోధన పోటీ-79

(బహుమతి రు. 50/-లు నగదు)

తలుపు తట్టిన చప్పుడవడంతో బద్ధకంగా కళ్ళు తెరిచి___

"ఎవ్వరు?" అడిగాను.

"బోయ్‌నండి!"

ఒళ్లు విరుచుకుని, టైం చూశాను. సాయంత్రం ఐదున్నర. నిద్ర బాగానే పట్టింది. దుప్పటి వెనక్కి తన్ని, లేచి వెళ్ళి తలుపు తీశాను,

లాడ్జింగ్ బోయ్!

"మధ్యాహ్నం పోస్టులో మీకీ ఉత్తరం వచ్చింది. అప్పుడే ఇద్దామని వచ్చాను. మీరు నిదరబోతున్నారు" అంటూ ఓ ఇన్‌లాన్డ్ లెటర్ చేతికిచ్చాడు.

నా పెదలు విచ్చుకున్నాయి.

అది రంగాఖుష్ రాసింది!

వాడికి తప్ప, నేను ఆగ్రాలోని ఈ చవకబారు నవరంగ్ లాడ్జిలో ఉన్నట్టు ఎవ్వడికి తెలుసు?

బోయ్ వెళ్ళిపోయాడు. తలుపు మూసి వెనుదిరిగాను. మంచంమీద కూర్చుని, బీడీ అంటించి ఉత్తరం చదవ సాగాను.

'డియర్ బిల్లా!

భివానీ సెంట్రల్ జైలునించి విడుదలవగానే సరాసరి ఢిల్లీ వచ్చి నన్ను కలుసుకుంటావను కున్నాను. కాని, జైలునించి విడుదలై ఆగ్రా వెళు తున్నాననీ, అక్కడ నవరంగ్ లాడ్జిలో బస జేస్తాననీ, ఏమైనా రాయదలచుకుంటే అక్కడికే రాయమనీ ఉత్తరం రాశావ్.

ఆగ్రాలో నీకేం పని? కొంపదీసి మళ్ళీ ఏదైనా వ్యవహారంలో తల దూరుస్తున్నావా? ఏది జేసినా కాస్త జాగ్రత్తగా చెయ్యి. వెనుకటిలా మళ్ళీ పట్టు బడ్డావంటే, తిరిగి యెన్నాళ్ళకో నిన్ను కలుసు కోవడం?

ఇక్కడ నేనొక పథకంవేసి రెడీగా ఉంచాను. నీ సహకారం లేనిదే దాన్ని అమలు జరపడం సాధ్యంకాదు. అందుకే ఇన్నాళ్ళూ నీవు ఎప్పుడు

విడుదలవుతావోనని రోజులు లెక్కపెడుతూ ఎదురు చూస్తున్నాను.

మొత్తానికి ఆ ఆగ్రా పనేదో త్వరగా కానిచ్చి, తక్షణం ఢిల్లీ వచ్చెయ్. ఉంటాను.

పార్ట్నర్—

రంగాఖుష్!

ఉత్తరం మడిచి, షర్టు జేబులో కుక్కుతూ నవ్వుకున్నాను.

నేను బాల్యంనించే నేరాలకి అలవాటు పడ్డ ప్రాణిని. ఐతే, నా కాలు ఒకచోట నిలకడగా నిలిచి చావదు.

కొన్నాళ్ళు బొంబాయిలో గడిపితే, ఇంకొన్నాళ్లు పూనాలో పాగావేస్తాను. అక్కడా మొహం మొత్తితే ఇహ బెంగళూరులో బిఛాణా. ఇట్లా గడిచిపోతోంది జీవితం!

ఎందుకోగానీ, నేనంటే రంగాఖుష్‌కు మంచి గురి ఏర్పడింది. ఇద్దరం కలిసే 'బిజినెస్' ప్రారంభించాం. పథకం మాత్రం వాడే వేసేవాడు. పథకం వెయ్యడంలో వాడు దిట్ట. హస్తవాపిలో నేను దిట్ట. వచ్చేదాంట్లో ఇద్దరం ఫిఫ్టీ-ఫిఫ్టీ!

ఏడాదిక్రితం భివానీ నగరంలోని ఒక బ్యాంకులో, ఓ ఆఫీసర్ చేతిలోంచి పదివేల క్యాష్‌బ్యాగ్ కాజేయబోతూ పట్టుబడ్డాను. పదమూడు నెలల కఠినశిక్ష పడింది.

నేను అరెస్ట్ అవగానే రంగాఖుష్ ఢిల్లీ పారిపోయాడు. భివానీ సెంట్రల్ జైలునించి వారం రోజులక్రితమే బైటపడ్డాను.

ఢిల్లీ వెళ్ళి రంగాఖుష్‌ను కలుసుకోవాలని నాకూ ఉంది.



కానీ, చేతిలో చిల్లికానీ లేకుండా, ఢిల్లీవంటి మహా నగరంలో ఊపిరి తీసుకోడం దుర్భరం!

అందుకే, జైల్లోంచి బైటపడ్డాక, ఏదో ఒక 'ప్లాన్' ఒక్కణ్నే విజయవంతంగా ముగించుకుని, పుష్కలంగా డబ్బు చేజిక్కించుకుని, అప్పుడుగానీ ఢిల్లీ వెళ్ళకూడదని నిశ్చయించుకున్నాను.

ఇక్కడున్న ఈ నాలుగు రోజులూ, నగరమంతా సర్వేజేసి నాక్కావలసిన ఒక వ్యక్తిని ఎన్నుకున్నాను.

వాడిపేరు గులాబ్‌చంద్! వడ్డీ వ్యాపారి. ఇక్కడి చాందినీచౌక్‌లో ఉంది వాడి తాకట్టు దుకాణం!

పగలంతా దుకాణంలోనే ఉండి, రాత్రి తొమ్మిది గంటలకు ఆ రోజు తాకట్టు పెట్టుకున్న నగా నట్రా, వసూలయిన డబ్బూ దస్కంతో ఇల్లు జేరుకుంటాడు.

మీర్‌గంజ్‌లో ఉంది వాడి లంకంత మేడ.

మేడమీద ఫ్రంట్ పోర్షన్‌లోనే ఉంది వాడి పడగ్గది. ఈ సంగతి ఎలా గ్రహించానంటే, రాత్రి వాడు దుకాణం నించి వచ్చాక, సరిగ్గా ఆ గదిలోనే లైటు వెలుగుతుంది.

బహుశా, ఇనప్పెట్టె కూడా అక్కడే ఉండి ఉంటుంది.

ప్లాన్ సక్సెస్ అయితే, ఈ రాత్రే ఢిల్లీ మెయిల్ ఎక్కి ఇక్కణ్నించి బిఛాణా ఎత్తెయ్యాలి.

రాత్రి సరిగ్గా పదకొండు గంటలకు రూం లాక్ జేసి, కావలసిన సామానుతో బైలుదేరాను మీర్‌గంజ్! అర గంటలో జేరుకున్నానక్కడికి.

అది సెకెండ్ షో టైం గనక, వీధి అంతా నిర్మానుష్యంగా వుంది. మునిసిపాలిటీ దీపాలు కునికిపాట్లు పడుతున్నట్టు వెలుగుతున్నాయి.

గులాబ్‌చంద్ మేడముందు చిన్న కంపౌండ్ వాల్ వుంది. ఆ పిట్టగోడ దూకి లోపలి కెళ్ళడం పెద్ద కష్టం కాదు.

ఓమారు చుట్టూచూసి, కన్నుమూసి తెరిచేలోగా ఎగిరి అవతలకి దూకేను.

కంపౌండ్‌లో మసక చీకటి.

మేడమీద ఒకే ఒక గదిలో బెడ్‌లైట్ వెలుగుతోంది. అదే సేఠ్ పడగ్గది. గాలికి కిటికీ రెక్కలు తెరిచిపెట్టి ఉన్నాయి.

అడుగులో అడుగు వేసుకుంటూ అటు నడిచేను.

కిటికీ పక్కనే నీటిగొట్టం!

చెమట పట్టకుండా అరచేతులకి మట్టిరాసి దులిపి, నీటి గొట్టం అందుకున్నాను. గబగబ ఎగబాకుతూ రెండు నిమిషాల్లో కిటికీ అంచు అందుకున్నాను.

గుండె వేగంగా కొట్టుకుంటోంది. మెల్లిగా తలెత్తి లోనికి చూశాను. ఫోం బెడ్‌మీద వినాయకుడిలా పడుకుని బొజ్జ కుదుపుతూ గుర్రు కొడుతున్నాడు గులాబ్‌చంద్.



జాగ్రత్తగా కిటికీ మధ్య ఎక్కి ఏమాత్రం సవ్వడి కానివ్వకుండా లోనికి దూకేను.

గదిలో ఓ మూల మెరుస్తోంది ఇనప్పెట్టె. అడుగులో అడుగు వేసుకుంటూ దాన్ని సమీపించేను.

జేబులోంచి ఇనప్పెట్టెలు అవలీలగా తెరిచే పనిముట్లు బైటికితీశాను. ఆరేళ్ళ అనుభవం! ఆ ఇనప్పెట్టె తెరవడం ఏమంత కష్టం కాలేదు.

లోన వరసగా పేర్చిన నోట్ల కట్టలు! నగలు!! చేతిలో ప్లాస్టిక్ బాగ్ సిద్ధంగా వుంది. అవన్నీ త్వరగా తనలో పడెయ్యమన్నట్టు దాని నోరు తెరిచి రెడీగా వుంది.

ఇనప్పెట్టె వూడ్చినట్టు అన్నీ బేగ్‌లో కుక్కాను. అంతే! హఠాత్తుగా సేఠ్ గురక ఆగిపోయినట్టు తోచి, అదిరిపడి నెనుదిరిగేను.

"చోర్! చోర్!" అంటూ దిండు కిందినుంచి లావుపాటి ఇనపకడ్డీ అందుకుని నా వైపు గెంతాడు.

అతను వేసిన దెబ్బని వెంట్రుకవాసిలో తప్పుకుని,

పిడికిలి బిగించి డొక్కలో కుమ్మేను.

"మర్గయా!" అంటూ కడుపు పట్టుకున్నాడు.

మరుక్షణం కడ్డీజారి కిందపడింది. చటుక్కున దాన్నందుకున్నాను. వట్టి చేతులతో సింహంలా నా మీదికి లంఘించాడు సేఠ్. నన్ను గట్టిగా పట్టుకున్నాడు. అతడి దూకుడుకు నా షర్టు పక్రున చినిగింది. షర్టు సేఠ్ చేతిలో చిక్కుబడింది. కడ్డీతో బలంకొద్దీ ఒక్కటి ఇచ్చేను.

కెవ్వుమని కాంఢం నరికిన చెట్టులా కింద కూలేడు సేఠ్. గిల గిల తన్నుకుంటున్నాడు.

నా ఒళ్ళంతా చెమటతో తడిసిపోయింది. కర్చీఫ్‌లాగి, మొహానికి పట్టిన చమట తుడుచుకున్నాను. పారిపోవాలి. జాగుచేస్తే కొంప మునగవచ్చు.

సేఠ్ చేతిలో చిక్కుకున్న నా షర్టు లాక్కొని, నీటి గొట్టం ద్వారా క్షణంలో కిందికి జారి, కాంపౌండు గోడ దూకి, గబగబా నడక సాగించేను.

లాడ్జి జేరగానే నా గదిలోకెళ్ళి తలుపు మూసి, బేగ్ టేబుల్ మీద పెట్టి చేతిగడియారం చూసుకున్నాను.

ఒంటి గంట! సరిగ్గా మూడున్నరకి ఉంది ఢిల్లీ ఎక్స్‌ప్రెస్. ఆలోగా కాసేపు రెస్టు తీసుకుని రిలాక్స్ అవ్వాలి.

బీడీ అంటించి మంచం మీద పడుకున్నాను. మనసంతా హాయిగా వుంది.

ఢిల్లీ జేరగానే రంగాఖుష్‌కు నా ఘనకార్యం చెప్పుకుని మీసం మెలెయ్యాలి. ఈ సొత్తుతో మేమిద్దరం ఆర్నెల్ల వరకూ రాజభోగాలనుభవించవచ్చు.

గంట తర్వాత గది తలుపు తట్టిన చప్పుడు వినిపించింది.

ముఖం చిట్లిస్తూ వెళ్ళి తలుపు తెరిచాను.

ఇద్దరు కానిస్టేబుల్స్! వాళ్ళ వెంట బోయ్ వెధవ!!

"బిల్లా నీ పేరే కదూ?" అడిగేడు ఇన్‌స్పెక్టర్ నన్ను.

గుండెలో గుర్రాలు దౌడు తీస్తున్నా తమాయించుకుని, "ఔను, ఏం?" అడిగేను నింపాదిగా.

"సేఠ్ గులాబ్‌చంద్ ఇంట్లో జొరబడి, ఆయన్ని హత్యచేసి, ఇనప్పెట్టె దోచుకున్న నేరం కింద నిన్ను అరెస్టు జేస్తున్నాం."

ఎక్కణ్ణించి వచ్చిందో నాలో ధైర్యం? "ఏమిటి? ఏమంటున్నారు మీరు?" అన్నాను దబాయిస్తూ.

ఇన్‌స్పెక్టర్ నవ్వేడు "బుకాయించి లాభంలేదు మిస్టర్ బిల్లా! కొన్ని గంటల క్రితం నీవు గులాబ్‌చంద్ ఇంట్లో ప్రవేశించినట్టు నా దగ్గర అభేద్యమైన ఋజువుంది. చూపించమంటావా?"

నా ఆశ్చర్యానికి అంతులేదు. ఎంతో జాగ్రత్తగా, మూడో కంటికి కనిపించకుండా ఆ ఇంట్లో దూరాను. దొంగతనం జరిగిన ఇంత స్వల్ప వ్యవధిలో పోలీసులకి నా ఆచూకీ ఎలా తెలిపింది?

"ఏమిటా ఋజువు?" అడిగేను వణికే కంఠాన్ని తొక్కిపెడుతూ.

[ఇదీ కథ. దీనిలో ఇన్‌స్పెక్టర్ చూపే ఆ ఋజువు ఏమిటో మీరు చెప్పగలరా? మీ సమాధానాలు ఒక పోస్టుకార్డుపైగా తెల్ల కాగితంపై వ్రాసి, నవంబరు 20 వ తేదీ లోపల మాకు చేరేటట్లు పంపండి. అత్యుత్తమ పరిశోధన చేసిన ఇద్దరు పాఠకులకు చెరొక రు. 25/-లు బహుమతి పంపబడుతుంది. హో.డె. సభ్యులుకాని వారు తమ జవాబుతో 50 పైసలు పోస్టు స్టాంపులు జతపరచాలి. ఫలితాలు ఫిబ్రవరి '79 నెల సంచికలో చూడండి. —ఎడిటర్]

ఒక గూటి పక్షులు

ఎ.వీ. మోహన్రావ్

పది గంటలయింది.

డిటెక్టివ్ సుధాకర్ ఆఫీసు రూంలో కూర్చుని పేపరు తిరగేస్తున్నాడు. ప్రక్కనున్న ఫోన్ మ్రోగింది. రిసీవరు పైకెత్తిపట్టుకొని

"హలో!" అన్నాడు సుధాకర్.

"మీకోసం ఎవరో వచ్చారు. అర్జంటుగా చూడాలట. పంపనా?" అడిగింది సెక్రటరీ వసంత.

"ఆడా! మగా?"

"మగే!"

"పంపు!" అంటూ ఫోన్ పెట్టేశాడు సుధాకర్.

రెండు నిముషాల తర్వాత తలుపు తీసుకుని లోని కొచ్చిన వ్యక్తికేసి చూశాడు. అతని వయస్సు నలభై దాకావుంటుంది. ఖరీదైన చొక్కా పాంటు తొడుకున్నాడు. తలంతా రేగిపోయివుంది. మొహం పీక్కుపోయింది. కళ్ళు యెక్కడో గుంటల్లో నిర్జీవంగా నీళ్ళులేని బావుల్లా వున్నాయి.

"కూర్చోండి!" అన్నాడు సుధాకర్ తన టేబుల్ కవతల వేపు వున్న కుర్చీలు చూపిస్తూ.

అతను మాట్లాడకుండా కూర్చున్నాడు.

"చెప్పండి!" కాళ్లు బారజాపుకొని కుర్చీలో వెనక్కి వాలి కూర్చుంటూ అన్నాడు సుధాకర్. అప్పటికే వసంత షార్ట్‌హాండ్ నోట్‌బుక్‌తో వచ్చి కూర్చుంది.

"ఎలా చెప్పాలో, ఏం చెప్పాలో అర్థం కావటం లేదు!" తల వంచుకుని జుట్టు పీక్కుంటూ అన్నాడు ఆ వచ్చిన మనిషి.

"మీ బాధ నాకు తెలియంది నేనేం చెయ్యగలను? ఏం జరిగిందో చెప్పండి!"

"మా పాప, మాకున్న ఒక్కగానొక్క బంగారు పాప, నిన్నటి నుండి కనుపించడం లేదండీ!"

సుధాకర్‌కు అవతలివ్యక్తి ఆవేదన అర్థమయింది.

"పోలీస్‌రిపోర్ట్ ఇచ్చారా?"

"ఆఁ!"

"కంగారుపడకండి! పోలీసులు సులభంగా మీ పాపను పట్టుకొని తెచ్చి మీ కప్పగించగలుగుతారు. ఇలాంటి కేసుల్లో మాబోటి ప్రైవేట్ డిటెక్టివ్‌లు చెయ్యగలిగిందేమీ వుండదు" అన్నాడు సుధాకర్.

"ఇంతదాకా వాళ్ళకు మా పాపజాడ తెలియలేదంటే, ఇక వాళ్లు కనుక్కొంటారన్న నమ్మకం నాకు లేదండీ! అందుకే మీ దగ్గరను పరుగెత్తుకొచ్చాను" అన్నాడు.

"పాపఫోటో పేపర్లో వేయించలేదా?"

"లేదండీ! పోలీసులకు మాత్రం ఇచ్చాను."

"ఆమెకెన్ని సంవత్సరాలుంటాయి? ఎప్పట్నించి కనుపించటం లేదు?"

"పదేళ్ళుంటాయి. నిన్న స్కూలుకు వెళ్లింది. తిరిగి రాలేదు. ఇంట్లో నేనూ, పాప, వంటవాడు భీమయ్య వుంటాము. నేను ఆఫీసు నుండి ఐదింటికల్లా వచ్చాను. పాపరాలేదు. ఏమయిందని యెదురుచూస్తూ కూర్చున్నాను. ఆరుదాకా ఆగాను.

ఆ తర్వాత లాభం లేదని, కార్లో స్కూలుకు వెళ్లాను. అక్కడ తలుపులు వేసివున్నాయి. వాచ్‌మన్‌ని అడిగాను. పిల్లలంతా ఐదింటికల్లా వెళ్ళిపోయారని చెప్పాడు. పాప స్నేహితులు కొందరున్నారు. వాళ్ల యిళ్లకు వెళ్లిందేమో ననుకుని ఇంటికెళ్లాను. గడియారం తిరుగుతున్నకొద్దీ ఆతృత ఎక్కువయి, పోలీసులకు ఫోన్ చేశాను" అన్నాడు అతను.

"మీ పేరు చెప్పలేదూ...."

"నా పేరు కిరణ్. పాపపేరు శశి. తల్లిలేదు. నా చేతుల్తో నేనే పెంచాను. నాకు పాప, పాపకు నేనూ తప్ప ఈ లోకంలో మాకింకెవ్వరు లేరండీ. నా పాప ఎక్కడుందో? ఏంచేస్తుందో? ఎలా వుందో?" అంటూ కన్నీళ్లు పెట్టుకున్నాడు.

"పాప ఫోటో వుందా?" అడిగాడు సుధాకర్.

కిరణ్ పర్సులోంచి ఫోటోతీసి ఇచ్చాడు.

అందుకుని చూశాడు సుధాకర్. పదేళ్ళ శశి అందంగా, ముద్దుగా వుంది.

"మీరేం కంగారు పడకండి. నాకు చేతయినదంతా చేస్తాను. వెళ్ళండి. అవసరమైతే ఫోన్‌చేస్తాను" అన్నాడు సుధాకర్.

"ఎంత డబ్బు ఖర్చయినా ఫరవాలేదు. మీరెలాగైనా పాపను వెతికి పట్టుకోవాలి?" అంటా లేచి నమస్కరించి వెళ్లాడు కిరణ్.

"వసంతా! అంతా విన్నావుగా?" అడిగాడు సుధాకర్.

"ఆఁ! రాసుకున్నాను కూడా...." అంది వసంత.

"నీ అభిప్రాయం ఏమిటి?"

"అంత చిన్నపిల్ల, తనకు తనే, అంత ప్రేమించే తండ్రి నుంచి దూరంగా పోదు. ఎవరైనా స్నేహితుల యింటికి వెళ్ళివుంటుందనుకున్నా, ఈ పాటికి తిరిగి యింటికి రావడమో లేక ఫోన్ చెయ్యడమో చేసివుండేది. ఈ రెండు జరగలేదు కాబట్టి ఇందులో ఏదో తిరకాసు వుండి తీరుతుంది. అదేమయివుంటుందా అన్నది మనం ఊహించాలి" అంది వసంత.

"కిరణ్‌కు బాగా డబ్బువుంది. అతనికొక్కతే కూతురు శశి. ఆ కారణంగా ఆమెను ఎత్తుకుపోయి, దాచిపెట్టి, కిరణ్ వద్దనుంచి డబ్బు గుంజాలని ప్రయత్నం చెయ్యవచ్చు. అలా జరిగివుంటుందనుకొంటే, కిరణ్‌కు టెలిఫోన్ ద్వారానో, లేక ఉత్తరం మూలంగానో, శశి తమ బందీగా వున్నట్లు, ఆమె క్షేమంగా తిరిగి రావాలంటే, ఇంత మొత్తం డబ్బు తేవాలన్నట్లు తెలిపివుండేవాళ్ళు. రెండూ జరగలేదు కాబట్టి అలాంటిదేదీ జరిగివుండలేదనుకోవాలి.

మరి ఏమయివుంటుంది?'' ప్రశ్నార్థకంగా చూశాడు వసంత వేపు డిటెక్టివ్ సుధాకర్.

''ఈమధ్య చిన్నపిల్లల్ని ముఖ్యంగా ఆడపిల్లల్ని ఎత్తుకుపోతున్న దొంగల ముఠాలు కొన్ని తయారయ్యాయి. ఈ పిల్లల్ని ఏదో ఇతరదేశాలకు అమ్మేసి, డబ్బు సంపాదిస్తున్నారట. అలాంటి గాంగు ఏదయినా ఈ అమ్మాయి అంతర్ధానం వెనుక వుండి వుండొచ్చని పిస్తూంది నాకు'' అంది వసంత.

''అలాగని కూడా నాకు తోచడంలేదు. అటువంటి గాంగు దిగివుంటే, ఒక్క శశిని మాత్రమే తీసుకెళ్ళరు. కనీసం పది పన్నెండు కేసులయినా జరగాలి. అలాంటివేవీ మన దృష్టికిరాలేదు. ఎందుకైనా, మనం పోలీసుల్ని సంప్రదించటం మంచిదేమోననిపిస్తుంది!'' అన్నాడు సుధాకర్.

2

బెంజ్ కారు కమీషనరుగారి ఆఫీసు ముందాపి, దిగాడు సుధాకర్.

గదిలోంచి వెలుపలకొచ్చి కారెక్కబోయిన కమీషనర్ సుధాకర్ని చూసి ఆగాడు. సుధాకర్ వడి వడిగా అడుగులు వేసుకుంటూ ఆయన దగ్గరకు వెళ్ళాడు.

''నా కోసం వచ్చారా?'' అడిగాడు కమీషనర్.

''ఆఁ! మీరు వెళుతున్నట్టున్నారు?''

''అవును! ఒక శవాన్ని చూచేందుకు బయలుదేరాను. మీకేం పని లేకుంటే పోయివద్దాం! రండి. కార్లోనే మాట్లాడుకోవచ్చు'' అన్నాడు కమీషనర్.

సుధాకర్ కారెక్కాడు.

''ఎక్కడా శవం?''

"గాంధీనగరంలో."

"హత్యా?" అడిగాడు సుధాకర్.

"అనే అనుమానం. పదేళ్ళ పసిపాపను దారుణంగా హత్య చేశారు. ఇంతకూ మీరు ఎందుకొచ్చినట్లు?" కమీషనర్ అడిగాడు.

"బహుశా అదే కేసు. ఆ అమ్మాయి కిరణ్ అనే ఇండస్ట్రియలిస్టు కుమార్తె అనుకుంటాను. పేరు శశి. అతను పోలీసు రిపోర్టు ఇచ్చానని కూడా చెప్పాడు."

"ఇంకా ఐడెంటిఫికేషన్ చెయ్యలేదు. శవం దొరికినట్లు ఇంతకు ముందే తెలిసింది" అన్నాడు కమీషనర్.

కారు గాంధీనగరంలోకి రాగానే రోడ్ ప్రక్కనున్న పోలీసు కానిస్టేబుల్ చెయ్యెత్తాడు ఆపమన్నట్లు. కారాగింది.

డ్రైవరుకు అతనేవో గుర్తులు చెప్పాడు.

కారు మళ్ళీ కదిలింది. రెండు రోడ్లుదాటి, మూడవ రోడ్ మొదట్లో వున్న కల్వర్టు ముందు ఆగింది. ఆ చుట్టూ జనం గుమిగూడి వున్నారు. వాననీరు పోయేందుకు మున్సి

పాల్టీవాళ్లు కట్టిన పెద్ద కాలవ వుంది క్రింద. ఆ కాలవలో వుంది శవం.

అప్పటికే కిరణ్ అక్కడికొచ్చి వున్నాడు. అతను గుండెలు బాదుకుంటూ ఏడవడం బట్టి, ఆ శవం అతని కూతురుదే అయివుంటుందనుకున్నాడు సుధాకార్.

కారు దిగి శవం వద్దకు వెళ్ళారు. శవం ఒంటిపైన ఏ విధమైన గాయాలు లేవు. తల దగ్గర వెనుకవైపు బొప్పి కట్టినట్లు వాచి వుంది. అక్కడే రక్తం గడ్డకట్టి వుంది. శశి స్కూలు పుస్తకాల సంచి ప్రక్కనే పడివుంది.

"సార్! నా శశిని చంపేశారు. అమానుషంగా హత్య చేశారు" అన్నాడు కిరణ్, సుధాకర్ దగ్గరకు వచ్చి ఏడుస్తూ.

సుధాకర్‌కు ఏమి చెప్పడం వీలుకాలేదు. అంత చిన్న పాపను చంపడం తలచుకుంటే అతనిలో కోపం, జాలీ రెండూ వచ్చాయి. మాటా పలుకూ లేకుండా నిల్చున్నాడు.

"ఇది హత్యో కాదో ఇంకా తేలలేదు. డాక్టరు రిపోర్టు వస్తే తప్ప మనకు అసలు విషయం అర్థంకాదు. ఆ పాప చీకట్లో తట్టుకొని కాలువలో పడినా, ఆ రాయి తలకు కొట్టుకొని, ప్రమాదం జరిగే అవకాశం ఉంది" అన్నాడు కమిషనరు.

కిరణ్ ఏదో చెప్పబోయాడు.

సుధాకర్ మాట్లాడవద్దన్నట్లు సంజ్ఞ చేశాడు. ఫోటోలు తీయడం, వేలిముద్రలు తీసుకోవడం మొదలయిన కర్మకాండంతా చకచక జరిగిపోయింది.

"మనం వెళ్దామా?" అడిగాడు కమీషనర్ సుధాకర్‌ని.

"మీరు వెళ్ళండి. నేను కాఫీ తాగి వస్తాను" అన్నాడు సుధాకర్.

"ఓ. కే...." అంటూ కమీషనర్ ఇన్‌స్పెక్టర్‌కు ఏవో ఆదేశాల్చి కారెక్కి వెళ్ళిపోయాడు.

సుధకర్ కాలువలోకి దిగి, శవాన్ని బాగా దగ్గరగా నిలుచుని చూశాడు. అది అకస్మాత్తుగా జరిగినట్లుగా కనుపించిలేదు.

అంతలో శవాన్ని కొంతమంది కానిస్టేబుల్స్ ఆంబులెన్సులోకి ఎక్కించారు.

"ఏమైన ముద్రలు దొరికాయి?" అడిగాడు ఫింగర్ ప్రింట్ ఎక్స్‌పర్ట్‌ని సుధాకర్.

"ఏం దొరకలేదండీ" అన్నాడు అతను.

"థాంక్స్!" అంటూ కిరణ్‌వేపు తిరిగి "మీ యిల్లు ఎక్కడుంది?" అడిగాడు.

"ఆ ఎదురుగా వున్న తిలక్ నగర్‌లో వుంది" అన్నాడు కిరణ్.

"మీకు కారుందా?"

"ఉంది. కానీ అమ్మాయిని కారులో స్కూలుకు పంపే అలవాటులేదు. నేను వెళ్ళమన్నా పాప వప్పుకునేది కాదు. వాళ్ళ ఫ్రెండ్స్‌తో కలిసి వెళ్ళేది" అన్నాడు కిరణ్.

తిలక్ నగర్‌లోకి వెళ్ళవలసిన శశి గాంధీనగరంలోకి ఎందుకు వెళ్ళి వుంటుందో అర్థం కాలేదు. ఆ చుట్టుప్రక్కల ఇళ్ళన్నీ ఎవరెవరివో అడిగి తెలుసుకున్నాడు సుధాకర్. అతని కెవ్వర్నీ అనుమానించడం కుదరలేదు. కిరణ్‌కు ధైర్యం చెప్పి, తిరిగి బంగళాకు వచ్చేశాడు.

పోలీసులకు ఫోన్‌చేసి డాక్టర్ రిపోర్టుగురించి అడిగాడు సుధాకర్. అది హత్యేనని, శశి తలమీద బలమైన సుత్తిలాంటి దాంతో కొట్టడంవల్ల మెదడుకు దెబ్బతగిలి, రక్తం

లోపలే కారి, చనిపోయిందని అభిప్రాయపడుతున్నట్లు డాక్టర్ వెల్లడించాడని చెప్పారు.

ఆ రాత్రంతా ఆలోచించాడు సుధాకర్. తెల్లవారాక పేపర్లలో మొదటి పేజీలో శశి హత్యగురించి పడిన వార్తల్లో, ఆమె హత్య కుపయోగించిన ఆయుధం చిక్కిందని దానిపైన వ్రేలి ముద్రలున్నాయని, వాట్ని ప్రింటుచేసి ఎవరిదయిందీ తెలుసుకొనే ప్రయత్నం చేస్తున్నారన్న సంగతి రాశారు.

ఆ మధ్యాహ్నం ఒక పోలీస్ ఇన్‌స్పెక్టర్, ఒక వేలి ముద్రల నిపుణుడిని వెంటబెట్టుకొని గాంధీనగరంలోవున్న పాతిక ఇళ్ళలో అడిగి, అందరి వేలిముద్రలూ సంపాదించారు. అక్కడ ఆరో నెంబరు ఇంట్లో వున్న జీవన్ అనే వ్యక్తి మాత్రం కనుపించలేదు. అతనా యింట్లో అద్దెకుంటున్నట్లు తెలిసింది. అక్కడ చేరి కూడా నెల రోజులు కాలేదనీ, ఎప్పుడూ ఎక్కువగా ఆ ప్రాంతాల్లో అతను కనుపించేవాడుకాదనీ, ఆ చుట్టుప్రక్కల నున్న వాళ్ళు చెప్పారు. పోలీసులు ఈ వ్యవహారం మొత్తం సుధాకర్‌కు తెలిపారు. అతనంతా విని, అవసరమైన పాయింట్లు నోట్ చేసుకున్నాడు.

ఆ రాత్రి మారువేషంలో గాంధీనగరం వెళ్ళాడు సుధాకర్. ఆరో నెంబరు యింటి తాళంతీసి, ఇల్లంతా గాలించాడు. హాల్లో కుర్చీల ప్రక్క రెండు పక్కపిన్నులు పడివున్నాయి. వాట్ని జాగ్రత్తగాతీసి జేబులో దాచుకున్నాడు. ఆ జీవన్‌ని గురించి వివరాలు తెలిపే కాగితాలు ఏవైనా దొరుకుతాయేమోనని, గాలించాడు. అలాంటివేమీ దొరకలేదు. యథాతథంగా ఇల్లు మూసి, తాళంపెట్టి వచ్చేశాడు.



మరుసటిదినం పోలీస్ కమీషనరుతో జీవన్ గురించి చెప్పాడు. అతనిగురించి వెంటనే వెతికించే ఏర్పాట్లు చేస్తానన్నాడు. అతని ఫొటో ఒకటి సాధించి తెచ్చారు పోలీసులు.

3

బేగంపేట విమానాశ్రయంలో దిగి టాక్సీ మాట్లాడు కున్నాడు సుధాకర్. అక్కడ్నుంచి తిన్నగా హోటల్ అనూరాధకు చేరాడు. అందులో రూం తీసుకున్నాడు.

జీవన్ అదే హోటల్‌లో వుంటున్నట్లు పోలీసుల పరిశో ధనలో తెలిసింది. అతను రామనాథం అనే పేరుపైన రూం తీసుకున్నట్లు వ్యక్తమైంది. తనుకూడా మారు పేరు తోనే రూం తీసుకున్నాడు.

ఆ రోజు రాత్రి హోటల్ బార్‌లో కూర్చుని విస్కీ ఆర్డరుచేశాడు. జీవన్ కూడా వచ్చాడు. అతను దూరంగా వున్న టేబిల్ దగ్గర కూర్చున్నాడు. బేరరు బీర్‌బాటిల్ తెచ్చి అతనిముందు పెట్టాడు.

ఇంతలో నలుగురు జట్టుగా లోనికొచ్చి, ఎక్కడా సీటు

లేక అటూ ఇటూ చూస్తూ నిల్చున్నారు. అదే అదనుగా సుధాకర్ లేచి వాళ్ళను అక్కడ కూచోమని, తను లేచి వెళ్ళి, జీవన్ కెదురుగా ఖాళీగా వున్న కుర్చీలో కూర్చున్నాడు గ్లాసుతో సహా.

"బీర్ త్రాగుతున్నారా?" అడిగాడు జీవన్‌ను.

అవునన్నట్లు తలూపాడు.

"అందులో కాస్త విస్కీ కలపండి. కిక్ కొడుతుంది" అంటూ తన గ్లాసులోవున్న విస్కీ అతని బీరు గ్లాసులో పోశాడు, జీవన్ వద్దంటున్నా. బేరర్‌ను పిలిచి మళ్ళీ విస్కీ తెమ్మన్నాడు.

"మీరేం చేస్తారు?" అడిగాడు జీవన్, సుధాకర్‌ను.

"పెద్దవాళ్ళు సంపాదించిన ఆస్తిని అరగదీస్తున్నాను. కానీ ఎంత ఖర్చుపెట్టినా తరగటంలేదు. మీరు?"

"ఏదైనా బిజినెస్ చేద్దామని చూస్తున్నాను" అన్నాడు జీవన్.

"మీదీవూరేనా?"

"కాదు! కేరళలోని కాలికట్! మీది."

"మధుర దగ్గర పల్లెటూరు."

"ఇంతదూరం వచ్చారేం?"

"ఇక్కడైతే కడుపునిండా త్రాగవచ్చు. తిరగవచ్చు" అన్నాడు సుధాకర్.

ఇద్దరూ చాలాసేపు రాజకీయాల గురించి, డ్రింగుల గురించి పిచ్చాపాటి మాట్లాడుకున్నారు. అలా రెండు రోజులు వరుసగా బార్‌లో కలిశాక మూడోరోజు జీవన్‌ను తన గదికి ఆహ్వానించాడు సుధాకర్.

"మీ బిజినెస్ ఏదో చెప్పండి. నేను కూడా పెట్టుబడి పెడతాను" అన్నాడు సుధాకర్.

"ఇంకా ఏదీ నిర్ణయించుకోలేదండీ! తర్వాత చెబుతాను" అన్నాడు జీవన్ సంతోషంగా.

"డబ్బుకోసం వెనుకాడకండి. ధైర్యంగా దిగండి."

"అలాగే!"

"ఇవాళ నా ఫ్రండొకతను పార్టీ ఇస్తానన్నాడు. మిమ్మల్ని కూడా తీసుకొస్తానన్నాను. తప్పకుండా రావాలి!" అన్నాడు సుధాకర్.

"ఫ్రెండా? ఎక్కడ పార్టీ!"

"అతనింట్లోనే. పెద్ద పోలీసు ఆఫీసరుగా పనిచేస్తున్నాడు. మేమిద్దరం కలిసి చదువుకున్నాం" అన్నాడు సుధాకర్ జీవన్ ముఖ కవళికలు గమనిస్తూ.

"మీరు వెళ్ళిరండి! నేను రాను" అన్నాడు జీవన్ కాస్త కంగారుపడుతూ.

"అదేం!"

"పోలీసులకు కాస్త దూరంగా వుండటం నా పద్ధతి. వాళ్ళతో స్నేహానికి పోను" అన్నాడు జీవన్.

"అదేంటండీ! మనం దొంగలమా? హంతకులమా? వాళ్ళను చూచి భయపడేందుకు? మామూలు మనుషులం. పైగా అతను నా చిన్ననాటి స్నేహితుడు. రమ్మని మరీ బలవంతం చేశాడు. మీరు నాకు స్నేహితులు. కాబట్టి మిమ్మల్ని కూడా తీసుకొస్తానన్నాను. మనం వస్తామని ఆతృతగా ఎదురుచూస్తుంటాడు. తీరా వెళ్ళకపోయామంటే చాలా నిరాశ చెందుతాడు. అందువల్ల నా మాట కాదనకుండా, దయచేసి రావాలి" అన్నాడు సుధాకర్.

జీవన్ మాట్లాడలేదు.

"మనిద్దరం కాబోయే భాగస్వాములం. ఒకరిపైన ఒకరికి

ఈ మాత్రం గౌరవం లేకుంటే, కలసి వ్యాపారం యెలా చేస్తామండీ?" అడిగాడు సుధాకర్.

"మీరంత పట్టుదలగా రమ్మంటే కాదనలేకున్నాను. అలాగే వస్తాను" అన్నాడు జీవన్.

ఆ సాయంత్రం ఇద్దరూ వాన్ ఎక్కి కమీషనర్ ఆఫ్ పోలీసు బంగళాకు వెళ్ళారు. కమీషనర్ రాఘవరావు కాచుకొని వున్నాడు వీళ్ళకోసం. ఇద్దరినీ ఆప్యాయంగా ఆహ్వానించి లోనికి తీసుకెళ్ళాడు. పరస్పర పరిచయాలయ్యాక తలో గ్లాసు బీరు తీసుకున్నారు.

"ఏమిటి విశేషాలు?" అడిగాడు రాఘవరావు.

"ఏమున్నాయి?మామూలే?విశేషాలు మీ దగ్గరుంటాయి" అన్నాడు సుధాకర్ జీవన్‌కేసి చూసి నవ్వుతూ.

"మద్రాసులో పదేండ్ల పసిపాపనెవరో హత్య చేశారట. ఆ వివరాలన్నీ మాకు పంపారు. హంతకుణ్ణి పట్టుకొమ్మని ప్రాణం తీస్తున్నారు. ఇరవై లక్షలమంది జనంలో వాడెవడో వాడెక్కడున్నాడో, ఎలా పట్టుకోవాలో మాకు అర్థంకాలేదు." అన్నాడు రాఘవరావు.

"ఆ హంతకుడు హైద్రాబాద్‌లోనేవున్నాడనేది ఋజువు అయిందా?"

"ఆఁ!"

"అతని గుర్తులు, ఫోటోలాంటిదేమన్నా వుందా?"

"ఫోటో వుంటే ఈపాటికి కటకటాల వెనుక త్రోసి వుండేవాణ్ని. అతన్ని చూసినవాళ్లు చెప్పినదాన్నిబట్టి కొన్ని పోలికలు చెప్పారు. తంటాలు పడుతున్నాం. వీడు చిక్కితేగాని మాకు నిద్ర పట్టేట్లు లేదు" అన్నాడు రాఘవరావు!

జీవన్‌కు గుండెలు దిగజారిపోయాయి. పులి నోట్లో



చిక్కినట్లయింది. తన కంగారు కప్పిపుచ్చుకునేటందుకు తక్కిన బీరుగ్లాసు పైకెత్తి గబగబ త్రాగేశాడు. ఏవేవో కబుర్లు చెప్పుకుంటూ రాత్రి పదకొండింటిదాకా అక్కడే వుండిపోయారు.

రాఘవవరావుదగ్గర శెలవు పుచ్చుకుని, ఇద్దరూ వెలుపలకి వచ్చి ఆటో ఎక్కారు. ఆటోను అనూరాధ హోటల్‌కు పొమ్మన్నారు.

కొంతదూరం పోయాక ఆటో ఆగింది. మరో మనిషి వచ్చి డ్రైవరుప్రక్కన కూర్చున్నాడు.

సుధాకర్ జీవన్‌ను మాటల్లోకి దించాడు. మాటలమధ్య ఆటో ఎటు పోయిందీ చూడలేదు. కొంతసేపయ్యాక చూస్తే నిర్మానుష్యమైన రోడ్‌వెంట పోసాగింది.

"అనూరాధ హోటల్ అబిడ్స్‌లో వుంటే సనత్ నగర్ పోతున్నావెందుకు?" అడిగాడు సుధాకర్ కోపంగా.

ఆటోడ్రైవరు మాట్లాడలేదు.

"నిన్నే! జవాబు చెప్పవేం? ఆటో ఆపు!" అరిచాడు జీవన్.

ఆటో ఆగలేదు. సుధాకర్ జేబులోంచి రివాల్వరు తీసి, ఆటోడ్రైవరు మెడపైనపెట్టి "ఆపుతావా? కాల్చమంటావా?" అడిగాడు.

ఆటో ఆగిపోయింది. ఇద్దరూ క్రిందకు దూకారు. సుధాకర్ పైకి రాబోయారు ఆటోడ్రైవరూ, అతని ఫ్రెండూను. వాళ్ళచేతుల్లో కత్తులు మెరుస్తున్నాయి. సుధాకర్ రివాల్వర్‌తో కాల్చాడు. ఆటోడ్రైవరు కూలి పోయాడు. అతని ఫ్రెండు పరుగు లంకించుకున్నాడు.

"రామనాథం! మనం ఇంక ఇక్కడ వుండకూడదు. వెళ్దాం పద!" అన్నాడు సుధాకర్ పరుగెత్తుతూ.

ఇద్దరూ వెనక్కి పరుగెత్తుకొచ్చారు. అలా అరగంట పరుగుతో 'పాట్ని'కి చేరుకొన్నారు. అక్కడ ఆటో మాట్లాడుకుని హోటల్‌కు వచ్చారు.

ఇద్దరూ సుధాకర్ రూంలోకి వచ్చారు.

"అతను చనిపోయివుంటాడా?" అడిగాడు రామనాథం పేరుతో చలామణీ అవుతున్న జీవన్.

"ఆఁ!"

"పోలీసులు నిన్ను పట్టుకోరూ?"

"వాళ్ళమొహం!" అన్నాడు సుధాకర్.

"నాకు భయంగా వుంది" అన్నాడు జీవన్.

"నువ్వు అంతా మరిచిపోయి హాయిగా నిద్రపో! వెళ్ళు" అన్నాడు సుధాకర్.

జీవన్ గదికి వెళ్ళిపోయాడు.

4

తెల్లవారింది.

సుధాకర్, రామనాథాన్ని ఫోన్‌లో పిలిచాడు. అతను

పలకగానే తన గదికి రమ్మన్నాడు. రామధానం వచ్చేసరికి సుధాకర్ తన సూట్ కేస్ సర్ది సిద్ధంగా వున్నాడు.

"ఏమటి?" అన్నాడు వస్తూనే రామనాధం.

"ఏంలేదు! గది ఖాళీచేసి వెళ్తున్నాను."

"ఎందుకు?"

"రాత్రంతా అలోచించాను. నేను ఇక్కడ వుండడం క్షేమంగాదు. ఎక్కడైనా వెళ్ళాలనుకున్నాను. రాత్రి జరిగిన హత్యగురించి పోలీసుల పరిశోధన ప్రారంభమవుతుంది. నన్ను అనుమానించకముందే వెళ్ళాలనుకున్నాను."

"మనం కలిసి వ్యాపారం చేద్దామన్నావ్?"

"అది ముందనుకున్నాను. కానీ ఇప్పుడు లాభంలేదు. నేను హంతకుణ్ణని నీకు తెలుసు. ఎప్పటికయినా నా రహస్యం నీకు తెలుసు కాబట్టి నువ్వు నన్ను బ్లాక్ మెయిల్ చేస్తావ్. నీతో భాగం పెట్టుకుని లాభంలేదు" అన్నాడు సుధాకర్.

"అదా నీ భయం! నా పరిస్థితి నీ కన్నా మెరుగ్గాలేదు. నేను నీలాంటి వాణ్ణే!" అన్నాడు రామనాధం.

"అంటే!"

"నేను కూడా మద్రాసులో ఒక హత్యచేశాను. పోలీసుల నుండి తప్పించుకోవడానికి ఇక్కడికి చేరాను."

"నీ కథలు నేను నమ్మను" అన్నాడు సుధాకర్.

"కథలు కాదు! నిజం! రాత్రి కమీషనరుగారు చెప్పిన పదేళ్ళ అమ్మాయి హత్య నేను చేసిందే!"

"ఎవరు శశి అనే అమ్మాయినా?"

"అవును."

"ఎందుకు హత్యచేశావ్?"

"ఆ పిల్ల తండ్రికి బాగా డబ్బుందని తెలుసుకున్నాను. స్కూలునుండి తిరిగి వస్తుంటే మెల్లిగా మాటల్లోకి దింపి, యింటికి తీసుకొచ్చాను. కొంతసేపయ్యాక ఆ పిల్లకు నేను ఎందుకు తీసుకొచ్చిందీ అర్థమయింది. అక్కడ్నుంచి తప్పించుకునే ప్రయత్నంచేసింది. స్పృహ పోగొట్టుదామని సుత్తితో తలపైన కొట్టాను. ఆ దెబ్బ బాగా తగలడంతో చచ్చిపోయింది. ఎవ్వరూ చూడకుండా రాత్రి పూట ఆమె శవాన్ని డ్రైనేజ్ కాలవలో పడేశాను" అన్నాడు రామనాథం.

"నీవన్నీ కట్టు కథలు."

"కాదు! నా పేరు జీవన్. ఇంతకుముందు రెండు మూడు దొంగతనాలు కూడా చేశాను. కాబట్టి మనిద్దరం ఒకరకం వాళ్ళమే. నీ రహస్యం నాకెలా తెలుసో నా రహస్యం నీకూ తెలుసు. కాబట్టి మనం ఇంకేదన్నా వూరు వెళ్ళి వ్యాపారం చేద్దాం! ఈ హత్యలు, దొంగ తనాలు లాభంలేదు!" అన్నాడు జీవన్.

ఇంతలో తలుపు మ్రోగింది.

"ఎవరో వచ్చినట్టున్నారు?" అన్నాడు సుధాకర్.

"పోలీసులేమో?" అన్నాడు జీవన్.

"కాదు! బేరర్ బిల్లు తెచ్చివుంటాడు" అంటూ తలుపు తీశాడు. ఎదురుగా పెద్ద పోలీసు పటాలం వుంది. ఇద్దర్నీ అరెస్టుచేసి వాన్ ఎక్కించారు.

కమీషనరుగారి ఆఫీసులో దిగాక "ఆ టేప్ రికార్డర్ జాగ్రత్త! అతని స్టేట్‌మెంట్ వివరంగా అందులో వుంది" అంటూ కమీషనరుతో చెప్పి, వెళ్ళి కూర్చున్నాడు కమీషనరు కెదురుగా సుధాకర్.

జీవన్‌కు బేడీలు వేశారు. అతను అవాక్కయి చూస్తూ వుండిపోయాడు.

★

పగ పడగెత్తింది

గీతాంజలి

"నమస్తే!"

డిటెక్టివ్ రాజా చూస్తున్న పేపర్‌లోంచి తలయెత్తి, ఆ యువతివైపు చూసాడు.

అందమైన ఫిగర్. పల్చటి చీరలోంచి పచ్చటి మంగళ సూత్రాలు ధగ ధగ మెరుస్తూ కన్పిస్తున్నాయ్. చెవులకు

తళ, తళ లాడుతున్న దుద్దులు పెట్టుకొంది. ఓ చేతికి ఎర్రటి గాజులు, మరో చేతికి వాచీ, వాచీవున్న చేతిలో ఎర్రటి హేండ్ బాగ్ వ్రేలాడుతున్నది.

"నమస్తే!" రాజా పేపర్ టేబిల్‌మీద పడేసి, "కూర్చోండి" అంటూ కుర్చీ చూపించాడు.

ఆమె కూర్చోగానే తన అసిస్టెంట్ కోసం డ్రస్సింగ్ రూమ్‌వైపు చూసాడు రాజా. అప్పుడే నీటుగా తయారై బయటకి వచ్చాడు గోపి.

బాస్ ఒక్కడే కాకుండా మరో అపరచిత యువతిని చూడగానే వుసూ్రుమన్నాడతను.

ఈ రోజు సరదాగా పిక్చర్ ప్రోగ్రామ్ వేసుకొన్నారిద్దరు. తీరా బయలుదేరే వేళకి క్లయింట్ రావటం గోపికి తగని చిరాకనిపించింది.

"కమాన్ గోపీ!" బాస్ పిలవటంతో తప్పనిసరిగా అటు నడిచాడు.

బాస్ ప్రక్కనున చైర్‌లో కూర్చొని, ఇబ్బందిగా చూసాడతనివంక.

రాజా అతని అవస్థని గమనించకుండా ఆ యువతిని "మీ పేరూ!" అని ప్రశ్నించాడు.

"రోషనార!" చెప్పిందా యువతి.

రోషనార పేరు వింటూనే చిన్ననాడు చదువుకొన్న హిస్టరీలో ఔరంగజీబ్ చెల్లెలు రోషనార గుర్తుకొచ్చింది రాజాకు.

అంతలోనే నవ్వుకొన్నాడతను. ఒక సామాన్య యువతిని చూస్తుంటే మహా క్రూరత్వంగల రోషనార క్యారక్టర్ గుర్తుకు రావటం ఏమిటి? ఈ రోషనార ముఖం ఎంత

నిర్మలంగావుంది. ఆ కన్నులలో అమాయకత ఎంతో దాగివుంది.

రాజా, రోషనార ముఖంలోకే చూస్తూ "మీకేం కావాలో చెప్పండి" అని అడిగాడు.

రోషనార తన హేండ్ బాగ్ తెరచింది. అందులోంచి, కొన్ని కవర్లు బయటకితీసి, రాజా ముందుకు వాటిని నెట్టి, "వాటిని చదవండి!" అంది.

కవర్లన్నీ తెరిచినట్లే వున్నాయి. రాజా ఓ కవరు లోంచి గులాబిరంగు కాయితాన్ని బయటకితీశాడు. దాని మీద అక్షరాల పంక్తులు, ముత్యాల సరాలు వరుసగా పేర్చినట్లున్నాయ్.

"రోషనారా!

నీ మృత్యువుకు ముహూర్తం పెట్టాలనివుంది. తొందరలో నీ మృత్యువుకు ముహూర్తం నిర్ణయించి, నీకు పంపించుతాను.

ఇట్లు,
యమదూత."

రాజా ఆ కాయితం తన అసిస్టెంట్ చేతకి యిచ్చి, మిగతావి చూసాడు. ఒక్క కవరు తప్పించి మిగతా అన్ని కవర్లలో రోషనారని చంపుతానని, మృత్యుముహూర్తం నిర్ణయిస్తానంటూ వున్నాయి. ఒక్క కవరులో మాత్రం ఇలా వుంది.

"రోషనారా!

ఈ పదిహేనవ తారీకున నీ మృత్యువుకు ముహూర్తం పెట్టాను. చావటానికి సిద్ధంగా వుండు" అని వుంది.

"ఈ యమదూత మిమ్మల్ని చంపుతానని బెదిరించ

టానికి ప్రబలమైన కారణమేదైనా వుందా?" రాజా సూటిగా ప్రశ్నించాడు.

రోషనార మౌనంగా వుండిపోయింది.

"చెప్పండి! మీకెవరిమీదనైనా అనుమానంగా వుందా" రాజా ఆమె చెప్పటానికి సంశయిస్తున్నదో లేక భయపడు తున్నదో అని మళ్ళీ అడిగాడు.

"రాజాగారూ! నేను కొందర్ని అనుమానిస్తున్నాను. అయితే వాళ్ళను యెందుకనుమానించానో చెప్పేముందు నన్నుగురించి చెప్పుకోవాలి."

"చెప్పండి!"

రోషనార చెప్పటం ప్రారంభించింది.

"రాజాగారూ! నా చిన్నతనంలోనే అమ్మ కన్ను మూసింది. నాన్న మళ్ళీ పెళ్ళిచేసుకున్నాడు. పిన్నికి నలుగురు ఆడపిల్లలు పుట్టారు. వాళ్ళు పుట్టినదగ్గర నుంచి నా బ్రతుకు నరకమైపోయింది.

స్కూల్లో చదువుకొంటూ, చిన్నవయసులోనే యింటి పనంతా చేసేదాన్ని. చెల్లాయిలు కూడా చదివేవారు. కాని ప్రతీక్లాసులో నాకే ఫస్ట్ వచ్చేది. అంతేకాదు. పిన్నిపిల్ల లంతా అనాకారులు.

ఆ విషయంలో పిన్నికి నా మీద ఒక విధమైన ఈర్ష్య వుంది.

నేను కాలేజీ జీవితంలోకి అడుగుపెట్టాను. కాలేజీ బ్యూటీననిపించుకొన్న నన్ను యెందరో యువకులు ఆరా ధించేవారు. నన్ను ప్రేమించానంటూ ఎందరో లక్షాధికారుల కుర్రాళ్ళు పిన్ని, నాన్నలతో పెళ్లిమాటలకు వస్తే, పిన్ని ఏదో విధంగా వాళ్ళను త్రిప్పిపంపించివేసేది.

తన కూతుళ్ళకోసం యెవరూ రాకపోవటం నా కోసం

అంతా ఎగబడటంతో పిన్నికి నా మీద ద్వేషం మరింత పెరిగిపోయింది. కాలేజీ మాన్పించింది. పిన్నిచేతిలో కీలుబొమ్మలా అయిన నాన్న లోలోన బాధపడటం మినహా యింకేం చెయ్యలేకపోయారు" రోషనార క్షణమాగి, బరువుగా వూపిరిపీల్చుకొంది.

"అప్పుడే శ్రీనివాస్‌తో నా పెళ్ళి సెటిల్ అయింది. శ్రీనివాస్‌తల్లి నన్ను ఏ పేరంటంలోనో చూసి, పెళ్లిమాట లాడింది. పిన్ని వెంటనే తన అంగీకారాన్ని తెలియ జేసింది. శ్రీనివాస్‌తో నా పెళ్లి అతి నిరాడంబరంగా జరిగి పోయింది. పిన్ని అండనుంచి బయట పడుతున్నందు కెంతగానో ఆనందించాను. అంతులేని ఆనందంతో అత్తింట కాలు మోపాను" రోషనార గొంతు ఆ చివరి పదాలలో వ్యధాభరితంగా ధ్వనించింది.

"శ్రీనివాస్ తల్లిదండ్రుల బలవంతం మీద నన్ను పెళ్లి చేసుకొన్నాడు. అతను స్నేహ అనే యువతిని ప్రేమిం చాడట. నేను శనిలా అతని జీవితంలోకి ప్రవేశించానని అన్నాడు. నాతో సంసారం చెయ్యలేనని విడాకులిమ్మని అడిగాడు. నా కంఠంలో ప్రాణముండగా విడాకులివ్వనని అన్నాను. అతను వుద్రేకంతో రెచ్చిపోయి, నా కంఠంలో ప్రాణం తీసైనా సరే, స్నేహని పెళ్ళాడతానని అన్నాడు."

"ఈ కారణంతోనే శ్రీనివాస్ మిమ్మల్ని చంపటానికి ప్రయత్నిస్తున్నారంటారా!" అడిగాడు గోపి.

"అనే నా అనుమానం. అతను నాతో వాదన పెంచు కొన్న మర్నాటినుంచే ఈ బెదిరింపు లేఖలు రావటం ప్రారంభించాయి. అతనేకాదు ఆ ఇంట్లో అంతా ఇంచు మించు నన్ను చంపాలనే చూస్తున్నారు" రోషనార కళ్లు తడయ్యాయి.

"శ్రీనివాస్ తల్లి మిమ్మల్ని చూసి ఇష్టపడి, కొడుక్కి పెళ్ళి చేసింది. అలాంటిది ఆవిడకూడా మిమ్మల్ని చంపాలని చూస్తోందా?" రాజా నమ్మలేనట్లన్నాడు.

"నేను చెప్పేది పూర్తిగా వింటే అర్ధమవుతుంది మీకు" రోషనార అభ్యర్ధనగా అంది.

"సరే చెప్పండి."

రోషనార హేండ్ బాగ్ తెరచి, అందులోంచి కర్చీఫ్ బయటకి తీసి, సున్నితంగా తడయిన కళ్ళను వత్తుకొని, తిరిగి యధాస్థానంలో పెట్టేసింది.

"మా మరిది తారానాథ్ వట్టి పోకిరీ మనిషి. కామంతో కళ్ళు మూసుకుపోయినతనికి వావివరసలు తెలియవు. శ్రీనివాస్ నన్ను దూరంగా వుంచడంతో తారానాథ్ నా దగ్గర పిచ్చి పిచ్చి వేషాలెయ్యటం ప్రారంభించాడు. ఓరోజు ఇంట్లో ఎవరూ లేని సమయం చూసి నన్ను బలాత్కరించబోయాడు. సమయానికి శ్రీనివాస్ స్నేహితుడెవరో మా ఇంటి తలుపు కొట్టటంతో నా శీలాన్ని కాపాడుకోగలిగాను."

రోషనార చెప్పటం ఆపి, డిటెక్టివ్ ముఖంలోకి చూసింది.

"ఈ విషయం మీ భర్తతో చెప్పారా?" రాజా ప్రశ్నించాడు.

"అతనితో చెప్పాలనే అనుకొన్నాను. తీరా చెప్పాక మా తమ్ముడికి నువ్ నచ్చావ్ అతనితో వుండు అని అనేస్తేనో, లేకపోతే నేనే అతన్ని కవ్వించానని నింద నామీద వేసి, ఆ ఇంట్లోంచి బయటికి గెంటివేస్తేపో—అనే సందేహం కలిగింది. దానితో ఆ విషయం అతనికి చెప్పాలనుకోలేదు.



అయితే ఇది జరిగిన మర్నాడు తారానాథ్ నేను ఒంటిగా కన్పించిన సమయాన ఒకే ఒక్కసారి తన కోర్కె తీర్చమని కోరాడు. కోపంతో రెచ్చిపోయిన నేను చెప్పుతో అతని రెండు దవడలు వాచిపోయేలా కొట్టాను. దానితో తారానాథ్ నామీద పగబట్టి, ప్రతీకారం తీర్చుకుంటానని వెళ్ళిపోయాడు. ఆ తరువాతనుంచే నాకు యమదూత పేరుతో లేఖలు రావటం ప్రారంభమయాయి."

"మిగతావాళ్లు మిమ్మల్ని చంపాలని ఎందుకనుకొంటున్నారు?" గోపి అడిగాడు.

"చెప్తాను. మా ఆడపడుచు రూపకు ఒక గొప్పింటి సంబంధం చూసారు. అబ్బాయి పెళ్ళిచూపులకు వచ్చాడు. ముందు రూపని చూసి నచ్చిందని ఒప్పుకొన్న పెళ్లికొడుకు నేను కాఫీలు తీసుకు వచ్చేసరికి నన్ను చూసి, రూప చెల్లెలి ననుకొని, నన్ను పెళ్లాడుతానని అన్నాడు. రూప అందగత్తెకాదు. నా భర్త కోపంతో నేను వివాహితురాలినని చెప్పాడు.

ఆ మాట వినగానే అతని ముఖంలో నిరాశ కన్పించింది. రూపని చేసుకోననిచెప్పేసి వెళ్ళిపోయాడు. ఆ తరువాత రెండు మూడు సంబంధాలు అదే రీతిలో తప్పిపోయాయి. కోరి చేసుకొన్న అత్తగారు పడగవిప్పిన త్రాచే అయింది. అందరికి నేనంటే కసి, ద్వేషం నిండిపోయింది.

ఈ లేఖలు వచ్చిన క్రొత్తలో ఓసారి నాపై హత్యా ప్రయత్నంకూడా జరిగింది.''

''మీపై హత్యా ప్రయత్నం జరిగిందా! ఎలా?'' డిటెక్టివ్ రాజా అడిగాడు.

రోషనార కనుకొసలలో కన్నీరు చిమ్మింది. పొంగి వస్తున్న దుఃఖాన్ని అతి ప్రయత్నంమీద ఆపుకొంటూ అంది.

''ఎండ్రిన్ కలిపిన అన్నం వడ్డించింది మా అత్తయ్య. అది నోటిలో పెట్టుకోబోతుండగా, నాలుగిళ్ళ అవతలున్న నా స్నేహితురాలు స్టవ్ అంటుకొని మరణించిందని, వాళ్ళ తమ్ముడు వచ్చి చెప్పాడు. ఆలాగే పరిగెట్టాను.

నా స్నేహితురాలి శవాన్ని చూసి ఎంతగానో దుఃఖించి వాళ్ళమ్మను వూరడించి, ఇంటికి వచ్చాను. నా కంచంలో ఎలుక చచ్చిపడివుంది. చాలా ఆశ్చర్యపోయాను. అప్పుడే యమదూత లేఖలు గుర్తుకొచ్చాయి. ఏదో అనుమానం పొడసూపింది. కొంచెం అన్నం తీసుకెళ్ళి రెండు ఎలకల ముందు వేసాను. నాలుగు మెతుకులుతిని అవీ చచ్చిపోయాయి. ఆ రెంటి మరణంతో ఆ అన్నంలో ఎండ్రిన్ కలపబడిందని తెల్సుకున్నాను.''

''ఇంట్లో అందర్నీ నిలబెట్టి అడగలేకపోయారా!''

''ఎవర్ని అడిగేది రాజాగారూ! అంతా నాకు శత్రువులే.

ఎవరు చంపాలని ప్రయత్నించారో ఎలా తెలుసుకోనేది. ఒకవేళ అడిగానే అనుకోండి. అంతా ఏకమయి, నన్ను మెడపట్టి బయటకి గెంటుతారు. పుట్టింటిలో కూడా ఆదరణ లేనిదాన్ని. ఒంటరి ఆడదాన్ని ఏంచెయ్యగలను. ఆఖరికి ఆలోచించి మీ దగ్గరకి వచ్చాను. చెప్పండి నన్ను కాపాడగలరా!" రోషనార కంఠం పూడుకుపోయింది.

రాజా బుర్ర ఆలోచనలకి గురైంది.

రోషనారాని చంపే అవకాశం ఎక్కువగా శ్రీనివాస్‌కి, తారానాధ్‌కి వుంది. మిగతావాళ్ళకి లేదూ అని చెప్పలేం. వాళ్ళూ అనుమానితులే. అయితే వాళ్ళలో రోషనారను పదిహేనవతారీకున చంపుతానని బెదిరించిన యమదూత ఎవరు?

యమదూతను గురించి తెలుసుకోవాలన్నా, రోషనారను రక్షించాలన్నా ఆ ఇంటి మనుషుల మధ్యనుండాలి తను.

రాజా ఆలోచనలను ఆపి, రోషనార ముఖంలోకి చూసాడు.

"రోషనారాగారూ! ఈ పదిహేనవతారీకున మీపై ఎలాంటి హత్యా ప్రయత్నం జరగకుండా చూడాలంటే మేము మీ ఇంట్లో వుండాలి."

"మా ఇంట్లోనా!"

"అవును. అలా అయితేనే అసలయిన నేరస్తులని పట్టుకోగలుగుతాం. మీవాళ్ళతో మేము మీకు వరసకు అన్నలమవుతామని చెప్పండి. నేనూ, నా అసిస్టెంట్ అన్నదమ్ముల్లా మీ ఇంటికి వస్తాం" రాజా చెప్పటం ఆపి, రోషనార ముఖంలోకి చూసాడు.

"మీ ఇష్టం! మీరెలా చెప్తే అలా చేస్తాను. మీరు ఏరోజు వస్తారు?"

"ఈరోజు పది కదూ! పదమూడవ తారీకున ఉదయం వస్తాం!"

రోషనార ఇద్దరికి నమస్కరించి వెళ్ళిపోయింది.

2

ఆ రోజు ఆదివారం కావటంతో తారానాధ్, తదితరు లంతా ఇంటిపట్టునే వున్నారు.

పదిన్నర అయేసరికి అందరి భోజనాలు అయిపోయాయి. రోషనార ముందుగదిలో కూర్చొని, ఏదో నవల పట్టుకొన్నది.

ఆమె చేతిలో నవల పేరుకుమాత్రమేవుంది. చూపులు మాటిమాటికీ వీధిద్వారం వైపుకు పరిగెడుతున్నాయి.

తారానాధ్, రూపా పేక ఆడుకొంటున్నారు అక్కడే కూర్చుని. శ్రీనివాస్ తన గదిలోనే వున్నాడు. కామేశ్వరమ్మ, సుందర్రామయ్య గుమ్మం దగ్గరే కూర్చుని, ఇంటిఖర్చుల గురించి మాట్లాడుకొంటున్నారు.

అదే సమయంలో తలుపుతట్టిన శబ్దమైంది.

రోషనార బుక్ క్రిందపడేసి, వెళ్ళి తలుపు తీపింది.

ఎదురుగా డిటెక్టివ్ రాజా, అసిస్టెంట్ గోపి నిలుచుని వున్నారు. గోపి చేతిలో సూట్‌కేసుంది.

"హాయ్! రాజన్నయ్యా, గోపన్నయ్యా! ఎప్పుడొచ్చారు? ఇన్నాళ్ళు యెటు మాయమైనారు!" రోషనార ముఖభావాలు చూడ చక్కగా వున్నాయి. మంచి ప్రావీణ్యంగల నటిలా నటించేస్తోంది.

రోషనార గోపి చేతిలోని సూట్‌కేసు అందుకొంది.

"అత్తయ్యా! మా పెద్దమ్మ కొడుకులు వీళ్ళిద్దరూ. మా అమ్మ వున్నప్పుడు దొడ్డమ్మ, మేము కలిసే వుండే వాళ్లం. అమ్మ పోయాక, పిన్ని రావటంతో వీళ్లు

హైదరాబాద్ వెళ్లిపోయారు. అన్నయ్యలిద్దరూ నన్ను చూడటానికి అప్పుడప్పుడు వచ్చేవారు. నా పెళ్లికి రమ్మని శుభలేక పంపించాను. కాని దొడ్డమ్మకి జబ్బు చెయ్యటంతో యెవరూ రాలేకపోయారు" రోషనార ఆయాసంగా ఊపిరి పీల్చుకొని, మళ్లీ ఏదో చెప్పబోతుంటే శ్రీనివాస్ ముందు గదిలోకి వచ్చాడు.

"రోషనారా! వచ్చిన అన్నదమ్ముల్ని బయటే నిలబెట్టి మాట్లాడేస్తున్నావు. వాళ్ళని లోపలకి రానివ్వవా!" అని అన్నాడు నవ్వుతూ.

నెత్తిమీద చిన్నగా కొట్టుకొంది రోషనార.

"అయ్యో! గుమ్మంలోనే నిలబెట్టేసానే. రాజన్నయ్యా! లోపలకి రండి" రోషనార వారిద్దరికి దారి ఇచ్చింది.

ఇద్దరూ లోపలకి వచ్చాక అందరికీ ఆ ఇద్దర్నీ పరిచయం చేసింది. వారికి తనవాళ్ళనందర్నీ పేరు పేరున పరిచయంచేసి, వాళ్ళిద్దర్నీ ఓ గదిలోకి తీసుకెళ్ళింది.

అలా వాళ్ళిద్దర్నీ తీసుకెళుతూ, ఎవరికీ ఎటువంటి అనుమానం రాకుండా, "ఏరా రాజా! పెద్దనాన్నగార్కి అప్పుడు మాటాడితే తల నొప్పి వచ్చేది కదా, తగ్గిందా ఏమైనా?" అంటూ ప్రశ్నిస్తోంది.

గదిలోకి రాగానే సూట్‌కేసు మంచం క్రింద పెట్టి, ఇద్దరి ముఖాలలోకి చూస్తూ "ఎలా వుంది సార్ నా నటన?" అని అడిగింది.

"వండర్! ఫ్రెమండస్! ఇదే స్టేజి, మీరే నటి, నేనే జడ్జి అయితే మీకు ఊర్వశి అవార్డ్ బహూకరిద్దును" అంటూ గోపి చమత్కరింపుగా నవ్వాడు.

తనూ అతనితో శృతి కలిపింది.

"ఇది మీ గది. మీరు ఎన్నాళ్లున్నా నిరభ్యంతరంగా

వుండొచ్చు!" అని "కాఫీ తెస్తానుండండి" అంటూ రోష నార బయటకి వెళ్ళిపోయింది.

ఆమె వెళ్ళాక డిటెక్టివ్ రాజా తన అసిస్టెంట్ ని దగ్గరగా పిలిచి, "గోపీ! నువ్వు తారానాధ్ ని, రూపని కనిపెట్టు. మిగతావాళ్ళని నేను అబ్జర్వ్ చేస్తాను" అని చెప్పాడు నెమ్మదిగా.

"ఓకే సార్! ఇప్పుడే ప్రారంభిస్తాను" గోపి ముందు గదిలోకి వెళ్ళిపోయాడు.

ఒంటిగా మిగిలిపోయిన రాజా గది నంతటిని పరీక్షగా చూసాడు.

గదికి రెండువైపుల రెండు ద్వారాలు, రెండు కిటికీలు వున్నాయి. ఒక కిటికీలోంచి చూస్తే వరుసగా వున్న గదులన్నీ కన్పిస్తాయి. మరో కిటికీలోంచి చూస్తే బయట పెరడు కనిపిస్తుంది. మరో ద్వారం పెరటివైపుకే వుంది.

కిటికీలోంచి చూసాడు రాజా.

గోపి తారానాధ్, రూపలతో ఖుషీగా మాట్లాడేస్తున్నాడు.

రూప గోపి అందమైన విగ్రహాన్ని విస్ఫారిత నేత్రాలతో చూస్తూ, వుషారుగా మాట్లాడుతున్నది. తారానాధ్, తదితరులు కూడా ఒక క్రొత్త వ్యక్తితో మాట్లాడుతున్న రీతిలో కాకుండా తమ ఇంటిలో వ్యక్తులతో మాట్లాడుతున్నట్లే చాలా సరదాగా మాట్లాడుతున్నారు.

ఎవరి ముఖాలలో ఆ ఇద్దరి రాకకు చిరాకుగాని, అసంతృప్తిగాని కావరాలేదు.

"వీరిలో నిజమైన హంతకులెవరు?" రాజా ఆలోచించసాగాడు.

అంతా అమాయకంగా కన్పిస్తున్నారు. వీళ్ళలో ఎవరు



రోషనారని పదిహేనవ తారీకున చంప ప్రయత్నిస్తున్నారు?

రాజా, శ్రీనివాస్ ముఖంలోకి చూసాడు.

గండుముఖం. పెద్దకళ్లు. సూదిముక్కు. ఎర్రటి పెదవులు. పొడవాటి చేతులు. చేతివ్రేళ్ళు పొడువుగా, సన్నగా వున్నాయి.

రోషనార అద్భుతసౌందర్యం గలదే కాని ఆమె అతనికి నచ్చకపోవచ్చు. స్నేహను పెళ్ళిచేసుకునేందుకు రోషనార అడ్డు తొలగించుకోవాలని చూస్తున్నాడేమో!

"హలోసార్!" రోషనార పిలుపుతో ఆలోచనలకు పుల్‌స్టాప్ పెట్టి, వెనక్కి తిరిగాడు.

"కాఫీ!" కాఫీకప్పు అందించింది అతనికి.

3

ఆ రోజు పదిహేనవ తారీకు.

రోషనార వుదయం నుంచే చాలా కంగాడుగా వుంది. ఒకరు పిలిస్తే, మరొకర్ని పిలిచారా అని అడగటం, ఒకటి అడిగితే మరొకటి వడ్డించటం లాంటి పనులు చేస్తున్నది. ఎవరైనా నెమ్మదిగా పిలిచినా తృళ్ళిపడుతున్నది.

ఆమె భయపడటం గమనించి ఇద్దరూ ఆమెకు ధైర్య

వచనాలు చెప్తూనేవున్నారు. అయినా ఆమె గుండెలో అలజడి అంతమవటం లేదు.

రాత్రి భోజనాలు కాగానే అంతా యెవరి గదుల్లోకి వాళ్లు వెళ్లిపోయారు.

రాజా తమగదిలోకి రాగానే ఆ రాత్రి హత్యాప్రయత్నం జరగకుండా వుండేందుకు వంతుల వారీగా నిద్ర మేల్కొవాలని చెప్పాడు. ఒంటిగంట వరకూ గోపి నిద్ర మేల్కొవాలి. ఆ తరువాత నుంచి రాజా మేల్కొవాలి.

ఒంటిగంటకు తనను నిద్రలేపమని చెప్పి, మంచ మెక్కాడు రాజా.

గోపి లైటార్పి, దగ్గరే స్టూలు వేసుకొని కూర్చున్నాడు.

ఒంటిగంటదాకా కళ్లలో వత్తులేసుకొని కాపుకాసాడు. కానైతే చీమ చిటుక్కుమన్న శబ్దం కూడా ఏ గదిలోంచి వినరాలేదు. హత్యలనేవి చెయ్యటం చాతకాని యమదూత తన ప్రయత్నాన్ని విరమించుకొని వుంటాడని అనుకొంటూ, తన బాస్‌ని నిద్రలేపాడు. తనకెలాంటి శబ్దం వినపడలేదని చెప్పి మంచం మీద వాలిపోయాడు.

రాజా స్టూల్ మీద కూర్చుని చీకట్లోకి గ్రుచ్చి చూసాడు.

వాతావరణం నిశ్శబ్దంగా వుంది. చీకట్లోనే చూస్తూ కూర్చున్నాడు రాజా.

సమయం మెల్లమెల్లగా కరిగిపోతున్నది.

డిటెక్టివ్‌కి ఆ నిరీక్షణ చాలా విసుగనిపించింది. చిరాగ్గా భృకుటి ముడిచి చూస్తున్నాడు. చిన్నధ్వని కూడా వినరావటం లేదు ఏవైపు నుంచి.

వరండాలో గడియారం మూడుగంటలు కొట్టింది. ఇంకో గంట అయితే ఇంట్లోవాళ్ళు నిద్ర మేల్కొంటారు. ఆ తరువాత హత్యాప్రయత్నం జరగటం అనేది దుర్లభం.

రోషనారమీద కోపంతో యెవరో చంపుతామని బెదిరించి, తీరా ఆ కోపం చల్లారాక ఆ ప్రయత్నాన్ని విరమించుకొని వుంటారని అనుకొన్నాడు.

ఐదు గంటలయింది.

ముందుగా కామేశ్వరమ్మ, సుందర్రామయ్య లేచారు. కామేశ్వరమ్మ, రూప గది దగ్గరకి వెళ్ళి తలుపు కొట్టింది. ఓ రెండు నిముషాలకి రూప నిద్రకళ్ళు నులుపుకొంటూ బయటకి వచ్చింది.

రాజా ఆ చీకటిలో కూర్చుని వారి చర్యలను గమనిస్తున్నాడు.

ముగ్గురూ దంతధావనం కానిచ్చి, వంటింటిలోకి వెళ్ళారు.

కామేశ్వరమ్మ కాఫీచేసి మొగుడికి, కూతురికి యిచ్చి, రాజావాళ్ళువున్న గదివైపు చూస్తూ, "అబ్బాయిలు ఇంకా పడుక్కొన్నట్లున్నారు. మీ వదినకి కాఫీ యిచ్చిరామ్మా" అంది.

రూప తను కాఫీ తాగేసి, ఓ కప్పుతో కాఫీ పట్టుకొని రోషనార గది దగ్గరకి వెళ్ళింది.

మెల్లగా తలుపు తట్టి "వదినా!" అని పిలిచింది.

లోపల నుంచి యెలాంటి జవాబు వినరాలేదు.

"అటునుంచి వెళ్ళవే రూపా!" భర్త ప్రక్కన కూర్చుంటూ అరిచింది కామేశ్వరమ్మ.

రూప విసుక్కొంటూ తన గదిలోంచి వెళ్ళింది.

రోషనార గదిలో లైట్ వెలిగినట్లు వెలుగు రేఖలు చీకటిలో వున్న రాజా కళ్ళకు కన్పించాయి. ఆ మధు

నిముషం కప్పు క్రిందపడి పగిలిన ధ్వని, ఆ వెనుకే 'కెవ్వు'మన్న రూప కేక వినిపించాయి.

రాజా మనసు కీడును శంకించింది. ఆదమరచి నిద్ర పోతున్న తన అసిస్టెంట్‌ని ఒకే ఒక్క వూపుతో లేపి కూర్చోబెట్టి, తను బయటకి పరుగెత్తాడు.

రూప గావుకేకలు పెట్టూ గది తలుపు తీసింది.

"ఏమైంది! ఎందుకలా అరుస్తున్నావ్! ఆ కప్పు పగిలిన శబ్దమేమిటే!" కామేశ్వరమ్మ చిరాగ్గా ప్రశ్నిస్తోంది.

"అమ్మా! అన్నయ్య....అన్నయ్య" రూప కంఠం విపరీతంగా కంపిస్తోంది. మనిషి కూడా నిలువెల్లా వణికి పోతున్నది.

"అన్నయ్య కేమయిందే!" కామేశ్వరమ్మ కలవరంగా అంటూ, భర్తతో రోషనార గదిలోకి ప్రవేశించింది.

రాజా, గోపి చురుగ్గా ఆ గదిలోకి అడుగుపెట్టి, శ్రీనివాస్ శవాన్ని చూసి నిశ్చేష్టులై, ఎలా వున్నవారు అలాగే నిలిచిపోయారు.

శ్రీనివాస్ గుండెల్లోంచి కారిన రక్తం తెల్లటి దుప్ప టిని ఎర్రటి రంగులోకి మార్చివేసింది. కనుగుడ్లు భయం కరంగా వెళ్ళుకొచ్చి, ముఖమంతా అతి వికృతంగా కని పిస్తున్నది.

కామేశ్వరమ్మ గుండెలు బాదుకొంటూ ఏడ్వసాగింది.

ఆమె ఏడుపుతో రోషనార, తారానాధ్ మేల్కొని ఆ గదిలోకి వచ్చి, కనిపించిన దృశ్యం చూసి, క్షణ కాలం కొయ్యబారిపోయారు. ఆ మరుక్షణమే ఆ ఇల్లు శోక సముద్రంలో మునిగిపోయింది.

డిటెక్టివ్ లిద్దరికీ మతిపోయినంతపనైంది.

తాము షిప్టులువారిగా నిద్రమేల్కొని వుండగా హత్య

జరగటమా! అది తమ అసమర్థతా? లేక హంతకుని శక్తి సామర్థ్యాలా?

రాజా కర్తవ్యం గుర్తుకొచ్చిన వాడిలా అసిస్టెంట్‌ని వారకు పిలిచి, ఇన్‌స్పెక్టర్‌కి విషయమంతా తెలియజెయ్యమన్నాడు.

గోపి బయటకి వెళ్ళి, ఓ పబ్లిక్ టెలిఫోన్ బూత్ నుండి పోలిస్‌స్టేషన్‌కి ఫోన్‌చేసి, రోషనార తమ దగ్గరకి వచ్చిన దగ్గరనుంచి, శ్రీనివాస్ చావుదాక చెప్పి, రోషనార ఇంటి ఎడ్రస్ ఇచ్చి ఫోన్ పెట్టేసాడు.

4

ఇన్‌స్పెక్టర్ వచ్చిన మరో రెండు నిముషాలలో పోలీస్ డాక్టర్, ఫింగర్‌ప్రింట్ ఎక్స్‌పర్ట్స్, ఫోటోగ్రాఫర్ అంతా వచ్చి, చక చకా తమ పనులు ప్రారంభించారు.

ఇన్‌స్పెక్టర్ డిటెక్టివ్‌ని, అతని అసిస్టెంట్‌ని ఎరగనివాడిలా అందరితోపాటు వారిని ఏవేవో ప్రశ్నిస్తున్నాడు.

గదులన్నీ పరీక్షించాలని అన్నాడినస్పెక్టర్.

రోషనార, రాజా, గోపి ఇన్‌స్పెక్టర్‌తో నడిచారు.

ప్రతీ గదికి ఓ గదిలోంచి, మరో గదికి దారివుంది.

శ్రీనివాస్ పడుక్కొనే గదికి, ప్రక్కగది రోషనారాది. ఆమె గది తరువాత గది తారానాథ్‌ది. ఆ ప్రక్క కామేశ్వరమ్మ, సుందర్రామయ్య గది. దాని తరువాత రూప గది.

"మీ గదిలోకి మీ భర్త ఎలా వచ్చారు!" రాజా సూటిగా అడిగాడు.

"రాజాగారూ! మీరు నా కెలాంటి ప్రమాదం కలుగకుండా కాపాడుతానని హామీ ఇచ్చినా, భర్త అండ కొండంత బలమని ఆయన్ని నా దగ్గరే పడుక్కోమని

అర్థించాను. ఏ కళనున్నారోగాని సరేనని నా దగ్గర పడుకొన్నారు.

ఆయనంతే నిశ్చింతగా నిద్రపోతున్నారు గాని, మృత్యు భయంతో నాకు నిద్ర రావటంలేదు. మాటి మాటికి ఆయన్నిలేపి, ఏదైనా మాట్లాడుతుండమని కోరాను. ఆఖరికి ఆయన తన నిద్ర పాడుచేస్తున్నానని తిట్టిపోసి, నీ కిక్కడ నిద్రపట్టకపోతే నా గదిలో నిద్రపో అన్నారు.

ఇంకేమనలేక నేను ఆ చీకట్లోనే లేచి, ఆయన గదిలోకి వెళ్ళి, పడుకొన్నాను. ఓ అరగంట తరువాత నిద్ర పట్టేసింది. తిరిగి అత్తయ్యగారి ఏడుపుతో మేల్కొన్నాను" రోషనార చెప్పటం ముగించింది.

అర్థమయిందన్నట్లు తల తాటించాడినస్పెక్టర్.

"రోషనారగారూ! హంతకుడు మీరనుకొని మీ భర్తని హత్యచేసాడు. ఇది మాత్రం నిజం. ఇకపోతే మరోసారి మీపై హత్యా ప్రయత్నం జరగవచ్చు. ఎందుకైనా మంచిది, తగు జాగ్రత్తలో వుండండి—" ఇన్‌స్పెక్టర్ మాటలకు రోషనార కళ్ళు అశ్రుపూరితాలయాయి.

"నావల్ల ఆయన చనిపోయారన్నమాట" అంది గాద్గదిక స్వరాన.

డిటెక్టివ్ రాజా తిరిగి శవం వున్న గదిలోకి వచ్చాడు. అతని కళ్ళు మరోసారి శవాన్ని పరీక్షించాయి.

శ్రీనివాస్ తలక్రింద వుండవలసిన దిండు ఆ ప్రక్కన వుంది. దానికి కూడా రక్తం కొద్ది, కొద్దిగా అంటుకొని వుంది. రాజా చూపులు శవం మీంచి, డాక్టర్ మీదకు మళ్ళాయి.

"డాక్టర్! మీ రిపోర్ట్ ఏమిటి?"

"పావుతక్కువ ఒంటిగంటకు, హత్య జరిగింది. ఒకే

ఒకపోటు అతిబలంగా గుండెల్లో దిగబడటంతో హతుడు వెంటనే మరణించాడు" డాక్టర్ చెప్పింది విని, ఇద్దరు డిటెక్టివ్‌లు తెల్లబోయారు.

పావుతక్కువ ఒంటిగంటకు హత్య జరిగింది. ఆ సమయంలో తన అసిస్టెంట్ నిద్ర మేల్కొనేవున్నాడు. అతను మేల్కొనివుండగా యెలా జరిగింది హత్య. తన అసిస్టెంట్ కార్యదీక్షాపరుడు. చెప్పిన పని అతిచక్కగా నిర్వహిస్తాడు. నిద్రకు లొంగిపోయే ఘటంకాదు. ఎంతో మేధావైన అసిస్టెంట్ మేల్కొనివుండగా హత్య యెలా జరిగింది?

"సార్! ఇదేదో మిస్టరీలావుంది. పావుతక్కువ ఒంటిగంటకు నేను మేల్కొనేవున్నాను. నా కళ్లముందు నుంచి, చిన్నపురుగు కూడా వెళ్లలేదు. చీమచిటుక్కుమన్న శబ్దం కూడా వినరాలేదు నా చెవులకు. శ్రీనివాస్ చావుకేక నాకు విన్పించి తీరాలి. కాని చిన్న మూల్గు కూడా విన్పించ లేదు నాకు" అన్నాడు గోపి ఆశ్చర్యంగా.

ఇనస్పెక్టర్ అయోమయంగా చూసాడిద్దర్నీ.

5

డిటెక్టివ్ రాజా, అసిస్టెంట్ గోపి బయట వరండాలో కూర్చొని, కేసుని గురించే మాట్లాడుకొంటున్నారు.

అంతట్లో వీధిలోంచి ఓ కుర్రాడు పరుగు, పరుగున లోపలకి వచ్చాడు.

రాజాని, గోపిని చూసి "రోషనారగారున్నారా!" అని ప్రశ్నించాడు.

"ఆవిడ హాస్పిటల్‌కి వెళ్లారు. ఆవిడతో నీకేం పని?" గోపి అడిగాడా కుర్రాణ్ణి.

ఆ కుర్రాడు జేబులోంచి ఓ చీటీ తీసి, గోపి చేతిలో

పెడ్తూ, "ఆయనెవరో ఈ చీటీని రోషనారగార్కి ఇమ్మన్నారు. ఆవిడ రాగానే ఇచ్చెయ్యండి" అని అన్నాడు.

"నాకు చూపిస్తావా ఆయన్ని" గోపి ఆ కుర్రాడ్ని జబ్బపట్టి అడిగాడు.

అతనలా అడిగేసరికి ఆ కుర్రాడు బెంబేలు ఎత్తిపోయి, "ఆయన వెళ్లిపోయారండి" అంటూ గోపీ చేతిని విడిపించుకోబోయాడు.

"ఈ చీటీ ఇచ్చిరమ్మని నీకెంతిచ్చాడా మనిషి?" రాజా శాంతంగా అడిగాడు.

రాజా అలా నెమ్మదిగా అడిగేసరికి ఆ కుర్రాడు ధైర్యంగా నిలబడి ఐదువేళ్లు చూపించాడు.

"బాబూ! అతనెలా వున్నాడో చెప్పగలవా!" ఈసారి మరింత నెమ్మదిగా అడిగాడు.

"ఏమోనండీ నేను చెప్పలేను."

ఆ కుర్రాణ్ని ఇంకా ప్రశ్నలతో వేధించటం వ్యర్థమని వెళ్లిపొమ్మన్నాడు.

ఆ కుర్రాడు వెళ్ళాక గోపి ఆ చీటీ మడతవిప్పి, లోపల వున్న అక్షరాలు చదివాడు.

"రోషనారా!

నువ్వనుకొని అనవసరంగా నీ భర్తని చంపాను.
ఈ రాత్రికి నీ మృత్యువుకు ముహూర్తం పెట్టాను.
సిద్ధంగా వుండు.

ఇట్లు,
యమదూత."

ఆ కాయితం గులాబీ రంగులోనే వుంది. అక్షరాలు మార్పులేదు.

గోపి ఆ కాయితాన్ని తన బాస్ చేతిలో పెట్టాడు.

రాజా దాన్ని చదివి, మడిచి జేబులో పెట్టుకొన్నాడు.

ఇంట్లో రూప, తారానాథ్ మాత్రమే వున్నారు. నిన్న శ్రీనివాస్ చావుతో కామేశ్వరమ్మకి ఫిట్స్ వచ్చేసాయి. డాక్టర్ రావటం మందులివ్వటం జరిగింది. ఈరోజు కామేశ్వరమ్మని తీసుకొని రోషనార, సుందర్రామయ్య హాస్పటల్‌కి వెళ్లారు.

రూప వంట చేస్తున్నది. తారానాథ్ తన గదిలో తలుపులు బిడాయించుకు కూర్చున్నాడు.

రాజా, శ్రీనివాస్ గదిలోకి వెళ్ళాడు.

మొన్నటివరకూ ఆ గది చాలా నీటుగా వుండేది.

శ్రీనివాస్ మరణంతో గదిలో సామానంతా చెల్లాచెదురుగా తయారైంది.

ఒక్కొక్క వస్తువే జాగ్రత్తగా పరిశీలించారిద్దరూ.

గాద్రేజ్ బీరువా, రెండు సూట్‌కేసులు యింకా ఏదో సామానుంది.

ఓ వారగా టేబిల్, దానినిండా ఏవేవో పుస్తకాలు పేర్చబడి వున్నాయి.

దండెంమీద శ్రీనివాస్ బట్టలు హేంగర్స్‌కి వ్రేలాడుతున్నాయి.

గోపి తనదగ్గరున్న మారు తాళాలగుత్తి తీసి, రెండు సూట్‌కేసులు తెరిచాడు. ఆ రెండింటినిండా బట్టలే వున్నాయి. అడుగున ఏమైనా వుండొచ్చునేమోననే అనుమానంతో బట్టలన్నీ తొలగించి చూసిన గోపికి శ్రీనివాస్ డైరీ కనిపించింది.

ఆ తరువాత బట్టలన్నీ ఎలా వున్నవి అలా పెట్టేసి, తాళాలు వేసేసి, తమ గదిలోకి వెళ్లిపోయారిద్దరూ.

రోషనార యింటికి వచ్చాక, ఆమెని తమ గదిలోకి

పిలిచి, యమదూత వ్రాసిన చీటీ చూపించాడు.

దాన్ని చదవగానే రోషనార ముఖం తెల్లగా పాలి పోయింది. చెమటలు పట్టాయి.

"మళ్ళీ....మళ్ళీ నాపై హత్యాప్రయత్నమా?" అంది బొంగురుపోయిన స్వరాన.

"మరోసారి ఈ యింట్లో హత్య జరగనివ్వనని మీకు మాటిస్తున్నాను" రాజా దృఢస్వరాన అన్నాడు.

6

భోజనాలు అయి, పనులన్నీ తొందర, తొందరగా ముగించుకొని, ఎవరి గదుల్లోకి వాళ్లు వెళ్లిపోయి, తలుపులు బిడాయించేసుకొన్నారు.

రాజా, గోపి తమ గదిలోకి వచ్చి, లైట్ ఆర్పేసి కిటికీ దగ్గర నిలుచొని, మిగతా గదులకేసి పరీక్షగా చూసారు.

కామేశ్వరమ్మ, సుందర్రామయ్య వున్న గదిలోనే లైట్ వెలుగుతున్నది. మిగతావాళ్ళ గదులన్నీ చీకటిగా కన్పిస్తున్నాయి. వారి గదిలో ఓ పదినిముషాలుదాకా లైట్ వెలిగింది. ఆపై వారి గదిలో కూడా చీకటి అలుముకొంది.

డిటెక్టివ్ లిద్దరూ గదిలోంచి బయటకి వచ్చారు.

అడుగులో అడుగు వేసుకొంటూ తారానాధ్ గది దగ్గరకి వచ్చి, అటూ ఇటూ ఓసారి పరికించి, ఆ కిటికీదగ్గర కెళ్ళి, లోపలకి తొంగి చూసారు. చీకటిలో తారానాధ్ మంచంమీద అస్పష్టంగా కనిపిస్తున్నాడిద్దరికి.

గోపి తన జేబులోంచి రివాల్వర్ని, పెన్‌టార్చిని బయటికి తీసి పట్టుకొన్నాడు.

సమయం ముందుకు సాగిపోతున్నది.

ఎక్కడో దూరానున్న చర్చిలో పన్నెండు గంటలు కొట్టారు.

అదే సమయంలో ఓ ఆకారం తారానాథ్ మంచం దగ్గరగా వచ్చి, నెమ్మదిగా అతని తలక్రింద నున్న దిండు తీసింది. ఆ కదలికకు అతను ఓసారి అటునుంచి యిటు దొర్లి మళ్ళీ మామూలుగా పడుకొన్నాడు.

ఆ ఆకారం ఓ రెండు క్షణాలాగి, దిండును అతని ముఖానికి గట్టిగా అదిమిపట్టి,కత్తిని అతని గుండెల్లో దింపేందుకు బలంగా పైకి ఎత్తింది.

అదే క్షణంలో హాలులో లైటు వెలగటం, గోపి "హేండ్సెప్!" అని అరవటం ఒకేసారి జరిగాయి.

అంతవరకూ నిద్ర నటిస్తున్న తారానాథ్ ఒక్కవుదుటన లేచి, మంచం దిగి కత్తి పట్టుకు నిల్చున్న వదిన గార్ని చూసి, గజగజలాడిపోయాడు.

రోషనార అలాగే మౌనంగా నిలిచిపోయింది.

తారానాథ్ తలుపు గడియతీసి, డిటెక్టివ్ లిద్దర్నీ చూసాడు.

"గోపీ! ఇన్స్పెక్టర్ని బేడీలతోసహా రమ్మను" రాజా, రోషనార ముఖంలోకే చూస్తూ అన్నాడు.

7

రోషనార హంతకురాలంటే నమ్మలేకపోతున్నాడిన స్పెక్టర్. అతి సుకుమారమైన ఆమె హస్తాలకు బేడీలు తగిలిస్తున్నప్పుడు అతను కించిత్ బాధపడ్డాడు.

"మై డియర్ డిటెక్టివ్! రోషనార కట్టుకొన్న భర్తని చంపిందంటే నేను నమ్మలేకుండా వున్నాను. భారతస్త్రీకి పతియే ప్రత్యక్షదైవం అంటారు. మరీ రోషనార!"

అంటూ అయోమయంగా చూసాడు.

రాజా చిన్నగా నవ్వాడు.

"నిజమే. శ్రీనివాసే గనక భర్త అయితే పాపం రోషనారకి ఈ దుస్థితి పట్టేది కాదు," అన్నాడు జాలిగా.

"అంటే!" తెల్లబోతూ అడిగాడినస్పెక్టర్.

రాజా, సుందర్రావ్ దంపతుల్ని, తారానాధ్‌ని చూసాడు. అంతా అపరాధుల్లా తలలు దించేసుకున్నారు.

"ఇనస్పెక్టర్ రోషనార చరిత్ర కడు దయనీయమైనది. ఆమె పినతల్లి ఆమెపట్ల రాక్షసే అయింది. ఏదో పేరంటంలో కామేశ్వరమ్మ రోషనారని చూసి, ఆమె పినతల్లితో పెళ్ళి మాటలాడింది. ఆవిడ వెంటనే ముహూర్తం నిశ్చయించేసింది.

అయితే రోషనార కుమార్ అనే అతన్ని ప్రేమించింది. ఈ సంగతి ఆమె పినతల్లికి తెల్సు. సవతికూతురు ప్రేమించినవాడితో ఎక్కడ సుఖపడిపోతుందో అని బలవంతాన శ్రీనివాస్‌తో పెళ్ళి జరిపించింది.

ఎవరికెంత ప్రాప్తమో అంతే అనుకున్న రోషనార క్రొత్తకోర్కెలకు వూపిరిపోసుకొని, అత్తింట అడుగు పెట్టింది. పెళ్ళాడిన శ్రీనివాస్‌తో సంసార బంధనాలు పెంచుకోవాలనుకొంది. కానైతే శ్రీనివాస్‌కు పురుషత్వం లేదనే విషయం ఆమెకు మొదటిరాత్రే తెలిసిపోయింది.

రోషనారకి దాదాపు మతిపోయినట్లు అన్పించింది. ఈ విషయం ముందెందుకు చెప్పలేదని అందర్నీ నిందించింది.

కామేశ్వరమ్మ, రోషనార పిన్నితో ఈ విషయం చెప్తే పరవాలేదందట.

రోషనారకి తన జీవితం చితికిపోయినట్లయింది. అదే సమయంలో ఆమె ప్రేమించిన కుమార్ రోషనారకి తారస పడ్డాడు. ఆమె కథనంతా తెల్సుకొని తను అమెరికా వెళ్లి పోతున్నానని తనతో వచ్చెయ్యమని కోరాడు.

రోషనార అమాయకంగా ఈ వార్త ఇంట్లోచెప్పి, కోర్టుద్వారా తనకు విడాకులివ్వాలని కోరింది. అంతా ఆమెకు ఎదురుతిరిగారు.

తమబిడ్డ మగవాడుకాడు అని కోర్టులో నిరూపించటం తమకెంతో అవమానకరం, అన్నారు సుందర్రావ్ దంపతులు. పైగా తమకొడుకు నపుంశకుడు కాడని లోకమంతా అనుకోవాలంటే, తారానాధ్‌తో రోషనార వుండాలట. అతనివల్ల కలిగిన సంతానం శ్రీనివాస్‌వల్లనే కలిగిందని చెప్పుకోవాలిట.

రోషనార రెచ్చిపోయింది. తన బట్టలు సర్దుకొని, వెళ్లిపోబోయింది. అప్పుడే వీళ్ళందరి ప్రోత్సాహంతో తారానాధ్ ఆమె శీలాన్ని బలిగొన్నాడు. పవిత్రమైన మనసుతో తనని ఆరాధిస్తున్న ప్రియుడికి అపవిత్రమైన తన శరీరాన్ని అర్పించలేక ఈ నాలుగుగోడల మధ్యనే నలిగిపోయింది.

అప్పట్నుంచి తన కవసరమైనపుడల్లా రోషనారని వాడుకోవటం మొదలెట్టాడు తారానాధ్. ఆమెలో పగ పడగలెత్తింది. తన జీవితాన్ని నలిపిపారేసిన ఆ కుటుంబ సభ్యులని చంపితీరాలనుకొంది.

బాగా ఆలోచించి చక్కగా ప్లాన్ వేసింది. తనని ఇంట్లో వాళ్లంతా చంప ప్రయత్నిస్తున్నారని చెప్పింది. తనకి తనే యమదూత పేరుతో చావులేఖలు వ్రాసుకొంధి.

కేసు తికమకపెట్టించాలని నా హెల్ప్ కోరింది. అయితే మేము వచ్చి ఇక్కడే తిష్టవేస్తామని ఆమె ముందుగా ఊహించలేదు. శ్రీనివాస్ హత్య జరిగేంతవరకూ రోషనార నిర్దోషనే నమ్మాను. కాని శ్రీనివాస్ హత్యతో నా అనుమానం ఆమె మీదకు మళ్ళింది."

"ఎలా సార్?" తారానాధ్ ఆశ్చర్యంగా అడిగాడు.

"శ్రీనివాస్ పావుతక్కువ ఒంటిగంటకు మరణించాడు. ఆ సమయంలో నా అసిస్టెంట్ మేల్కొని వున్నాడు. హంతకుడు బయటనుంచి రాలేదు. ఇంట్లో వాళ్ళెవరికీ అతన్ని చంపాల్సిన అవసరంలేదు.

రెండవ హత్యాప్రయత్నం తారానాధ్ పైనే అని ఊహించాను. అందుకే అతన్ని నిద్ర నటించమని చెప్పాను" రాజా చెప్పటం ఆపి, అందరి ముఖాలలోకి చూసాడు.

"ఇన్ని విషయాలు మీకెలా తెలిసాయి" రూప ఆశ్చర్యంగా అంది.

"జీవితానికి ప్రతిబింబం డైరీ. శ్రీనివాస్ డైరీ చదివితే ఈ వివరాలు లభించాయి. రోషనార పువ్వులాంటి జీవితంతో మీరంతా ఆడుకొని, కాళ్ళక్రిందవేసి నలిపి పారేసారు" రాజా గాఢంగా నిట్టూర్పువిడిచి, తన అసిస్టెంటుని సూట్ కేస్ సర్దమన్నాడు.

రోషనార జీప్ ఎక్కుతూ చెమర్చిన కన్నులతో డిటెక్టివ్‌కి నమస్కరించి, "మీకు ఫీజేం యివ్వలేకపోతున్నందుకు మన్నించండి" అంది.

"సారీ! రోషనార! నీకుజరిగిన అన్యాయానికి ఎప్పుడూ చింతిస్తాను. కాని నా వృత్తిధర్మం నెరవేర్చక తప్పదు," రాజా బాధగా అని ముందుకు కదిలిపోయాడు. ★

ఎస్. కృష్ణవేణి

పిట్టల వేట

"నమస్కారమండీ."

ప్లాస్టిక్ బాస్కెట్ పుచ్చుకొని బజారువేపు కూరగాయల కోసం వెళ్తున్న అనూరాధ ఆగి, అతనివేపు ఆశ్చర్యంగా చూసింది, ఈ నూతనప్రదేశములో తనకి పరిచయస్థులు

ఏవరాః అని.

అతను ఎర్రగా ఎగిసిపడుతున్న యౌవ్వనంలో మిస మిసలాడుతున్నాడు. బాగా క్రిందికి దిగి వెడల్పుగావున్న సైడ్‌లాక్సు, ఎర్రజీరకళ్ళు, పొగరుగా గాలికి ఎగురుతున్న వుంగరాలజుట్టు, ఖరీదైన బెల్‌బాటమ్‌లో పాతికేళ్ళ వయస్సులో వున్నాడు.

"మీ....మీ పేరు లక్ష్మిగారు కదూః" అతను యెంతో మర్యాదగా ప్రశ్నించాడు.

"కాదండీ...." మర్యాదగానే జవాబిచ్చి ముందుకి అడుగు వేయబోయింది. రాధకి అర్థం అయింది అతను తనని చూసి పొరబడ్డాడని. మనిషిని పోలిన మనుష్యులు ఈ లోకంలో ఏడుమంది వుంటారని నాయనమ్మ ఎన్నో సార్లు అనగా వింది తను.

కానీ! అతను అంతటితో అక్కడే ఆగిపోలేదు. ఆమెతో కలిసి అడుగులువేస్తూ—"అరే! మీరు అచ్చు నా చిన్నప్పటి స్నేహితురాలు లక్ష్మిలానే వున్నారండీ. మేము ఏలూరులో వుండేటప్పుడు ఇద్దరం చాలా స్నేహంగా వుండేవారం. ఎంత అంటే....ఒకే కంచంలో తిని ఒకే మంచంలో పడుకొనే వాళ్ళం అంటే నమ్మండీ" అతను అమాయకంగా చెప్తున్నట్లు అని ఓరగా ఆమె ముఖంలోని రియాక్షన్సుని కనిపెడుతున్నాడు.

రాధ మనస్సులో "ఛీ" అని అనుకొందిగానీ, ఆ భావాన్ని బయటికి రానీయలేదు.

అతను అలా చెడవాగుతూనే ఆమెకూడా బజారువరకూ వచ్చి, ఆమె కూరగాయలు కొన్నతరువాత వెనక్కి తిరిగి వారు కలుసుకున్న చోటికి వచ్చిన తరువాత అతను ఆగి- "వుంటానండీః మళ్ళీ రేపు కలుసుకొందామండీ! మిమ్మల్ని

చూస్తూవుంటే నా లక్ష్మిని చూస్తూవున్నట్లే వుందండి" అని ఎంతో సంతోషాన్ని ప్రకటిస్తూ అన్నాడు.

ఆమె—'పాపం! నన్ను చూడగానే అతని చిన్ననాటి స్నేహితురాలు గుర్తుకొచ్చింది కాబోలు' అని అనుకొని ముందుకి సాగిపోయింది.

ఆమె కనుమరుగవగానే రంగారావు మిత్రబృందం అతనిని చుట్టుముట్టేశారు.

"గురూ! చేప ఎరని చూసినట్టేనా?" నాలికతో పెదాలని తడుపుకొంటూ అన్నాడు మూర్తి.

"పిట్టమాత్రం మా పిటపిటలాడుతోందోయ్!" రమణ నోరూరగా లాలాజలాన్ని మ్రింగుతూ అన్నాడు.

"అసలు ఇటువంటిది దొరికతే మందుతో పని వుండదోయ్! మా పసందుగా వుంటుందిలే!" మస్తాను వ్యాఖ్యానించాడు.

"నీ కెప్పటికప్పుడు పరగడుపే. మొన్న మన గదికి గురుడు కొట్టుకొచ్చిన పిట్టమాత్రం పసందుగా లేదేంటి?" మూర్తి అన్నాడు.

"నీవో అల్పసంతోషివి. దొరికిందే చాలంటావ్!" మస్తాను రివ్వుమన్నాడు.

"ఛా! పూర్కొండ్రా! అసలు ఏం జరిగిందో తెలుసుకోకుండా మీలో మీరే కుక్కల్లా కొట్లాడుకొంటే ఎలా?" రమణ విసుక్కున్నాడు.

అందరూ నోళ్ళుమూసి రంగ వేపు చూశారు.

"చెప్పుగురూ! పిట్ట వలలో పడినట్టేనా?" ఏకకంఠంతో ఆత్రంగా అడిగారు.

"ఆఁ....వలదగ్గిర కొచ్చింది. రేపు గదికి కొట్టుకొచ్చేస్తాను. ఈ రంగారావు వలవేసిన తరువాత పిట్ట జారి

పోవడమే!" గర్వంగా మీసంమీదికి చెయ్యి పోనిచ్చాడు.

ఈ శుభవార్త విని మిత్రులు ఒకరినొకరు కౌగిలించుకొని ముద్దులు పెట్టుకున్నారు.

అది నాలుగుకూడల సెంటరు. ఎటుప్రక్కకి ఎటు వెళ్లాలన్నా ఆ వూరిలోని జనమంతా, ఆ కూడలి మధ్య నుండే వెళ్ళాలి. వూర్లోని మగవెధవల గూర్చి యెవరికి కావాలిగానీ, ఆడకూతుళ్ళ లిస్టుమాత్రం ఈ దుష్టచతుష్టయం దగ్గర వున్నది.

వీళ్ళ నలుగురికి మరో పనిలేదు. బాబుల సంపాదన మీద హాయిగా ఆనందంగా తిని తిరగడమేకాక, ఇలా అమ్మాయిల వేటలో కాలాన్ని ఖుషీఖుషీగా జామ్‌జామ్‌గా గడుపుతున్నారు.

ఆ వూరి ఆడపిల్లల తండ్రులు అరచేతుల్లో మానాన్ని పెట్టుకొని బ్రతుకుతున్నారు. పిల్లల్ని బయటకి ఎటువంటి పరిస్థితులలోనూ పంపడంలేదు. ఈ చతుష్టయం వలవిసిరి అయినా పడుతున్నారు లేదా దౌర్జన్యంగానైనా ఆడపిల్లల్ని చెరుస్తున్నారు. వారిని ఏమీ అనేదానికి లేదు. ఎందుకంటే వాళ్ళ బాబులే ఆ వూరిని పరిపాలిస్తున్న పెద్దలు.

2

లీలా వినోదిని మంచంమీద పడుకొని ఏప్రిల్‌నెల 'అపరాధన పరిశోధన' చదువుతోంది.

మంచంమీద పడుకొన్న లీలావినోదిని స్ప్రింగ్‌లా లేచికూర్చొని వ్వాట్....వ్వాట్....అని ఏప్రిల్ 'అపరాధ పరిశోధన' కథల పుస్తకాన్ని, సప్లిమెంటుని రెండును కూడదీసింది. సప్లిమెంటులో 'మర్డర్ కాంట్రాక్టు' కథల పుస్తకంలో 'మిత్రద్రోహి' కథ రెండూ మరోసారి చదివింది.

ఇంతలో ఆ గదిలోకి లీలామోహన్ ఎంట్రయ్యాడు.

"అన్నయ్యా! ఏప్రిల్ నెల అపరాధపరిశోధన కథల పుస్తకం, సప్లిమెంటు రెండూ చదివి ఒక రచయిత చేసిన మిస్టేక్ ఏమిటో కనుక్కో! అందునా తమరు పోలీసు సబ్ ఇన్స్పెక్టరాయే" నవ్వుతూ అంది, కాళ్ళని పరుపుకేసి టపటప కొడుతూ.

వినోదినికి మోహన్ సమాధానం చెప్పక కుర్చీలో బారచాపుకొని కూర్చొని, ఇంటి పైకప్పుకేసి చూస్తున్నాడు.

అన్నగారి నుండి సమాధానం రాక వినోదిని పుస్తకం మీద నుండి దృష్టిని అన్నగారివేపు మళ్ళించింది. అతని కనుల నుండి ప్రవాహంలా అశ్రుకణాలు జాలు వారుతోంది.

"అ....న్న....య్యా" ఆశ్చర్యంగా అరచింది.

లీలామోహన్‌లో ఎటువంటి కదలికా కలగలేదు.

వినోదిని లేచి అతని కుర్చీవద్దకి వెళ్ళి—"అన్నయ్యా! ఏమైంది?" అనునయంగా అడిగింది.

జేబులో నుండి ఒక లెటరుని మౌనంగా తీసి చెల్లెలి చేతిలో పెట్టాడు.

వినోదిని ఆత్రంగా దాన్ని విప్పింది.

"లీలా డియర్!

నీమీద అకారణంగా కోపగించుకొని తణుకు వచ్చేసినందుకు భగవంతుడు నాకు యింత పెద్ద శిక్ష వేస్తాడని నేను అనుకోలేదు.

మా అత్తయ్య యెప్పటినుండో తణుకు రమ్మనమని అడుగుతోంది కదా అని కావాలని ఆ రోజు

సాయంకాలం నీతో దెబ్బలాట వేసుకొని నిన్ను యేడిపించాలని తఱుకు వచ్చేశాను. ఇక్కడ నాకోసం యింతటి విషాదం దాగివుందని తెలిసి వుండి వుంటే నీమీద అలుక సాగించేదాన్ని కాదు కదా, పైగా నీ కౌగిలిని కోటగోడల్లా చేసుకొని జీవితాంతం వుండిపోయేదాన్నే.

ఈ లెటరు నీకు చేరేసరికి నేను ఈ లోకాన్ని వదిలి రెండురోజులుకూడా అయివుంటుంది. నిన్ను ఎందుకు వదిలివెళ్తున్నానో తెలుసా? ఈ అపవిత్ర మైన శరీరాన్ని నా దేవునికి అర్పించలేక.

జరిగింది నీకు వ్రాయలేను. వ్రాయకుండా వుండ లేను. ఇక్కడ అత్తయ్యగారి వూరిలో ఒకదుష్టుడు నన్ను చూపి తన చిన్ననాటి స్నేహితురాల్నిగా వున్నానని నమ్మించి ఎంతో మర్యాద నటించి తన రూముకి తీసుకొని వెళ్లాడు. అక్కడ.... అక్కడ....దుష్ట చతుష్టయం...."

"ఢన్...."మని పెద్ద శబ్దం అయింది

లీలా వినోదిని వులిక్కిపడి చూసింది. మోహన్ తన చేతితో ప్రక్కనే వున్న టేబుల్‌మీద గ్రుద్దాడు. ఆ అదు రుకి ట్రాన్సిస్టర్ ఎగిరి క్రిందపడింది.

వినోదిని అచేతనంగా మంచంమీద వాలిపోయింది.

అనూరాధ, లీలామోహన్ ప్రేయసీప్రియులు. మోహన్ అనూరాధని తన ప్రాణంకన్నా ఎక్కువగా ప్రేమిస్తు న్నాడు. అయితే వినోదిని పెండ్లి అయ్యేవరకూ వారి పెండ్లి వాయిదాపడింది. ఇది వుభయపెద్దల సమ్మతినే నిర్ణయింప బడింది. కాని ఇప్పుడు అనూరాధ నిండు జీవితం నలుగురు దుష్టుల క్షణికావేశానికి బలి అయిపోయింది.

3

తలుపుమీద టక్, టక్‌మని శబ్దం వినబడుతూనేవుంది. అయినా లక్ష్మీదేవమ్మ లేచి వెళ్ళలేదు.

గదిలో పడుకొనివున్న రాజారావుగారు కూడా ఆ శబ్దాన్ని విన్నారు. లేచివెళ్ళి తలుపు తీశారు.

ఓ ఇరవై సంవత్సరాల యువతి సూటుకేసు పట్టుకొని వుంది.

"రాజారావుగారి యిల్లు యిదేనాండి" ఆ అమ్మాయి అడిగింది. ఆయన ఔనన్నట్లు తలాడించారు.

ఆమె సూటుకేసుతో ఆయనని త్రోసుకొని లోనికి అడుగుపెట్టింది.

ఆయన అనుమానంగా ఆమెవేపు చూస్తూ—"ఎవ రమ్మా నీవు?" అని ప్రశ్నించారు.

ఆమె కొంగుతో మొఖానికి పట్టిన చెమటని తుడుచు కొంటూ—"నా పేరు లీలావినోదినండి. తాడేపల్లిగూడెం నుండి వస్తున్నాను. అనూరాధ నా స్నేహితురాలు" అని అంది.

అనూరాధ పేరు ఆమె వుచ్చరించగానే అప్పటివరకూ హాలులో మౌనంగా పండుకొని వాళ్ళ మాటలని వింటున్న లక్ష్మిదేవి 'ఓ' అని ఏడవసాగింది.

వినోదిని లేచి ఆమెవద్దకు వెళ్ళి "ఏడవకండమ్మా. అనూ చావు యిలా వ్రాసిపెట్టివుందని మేము వూహించ నైనా వూహించలేదు" అని అంది.

"అనూ ఆత్మహత్య చేసుకుందని నీకెలాతెలుసమ్మా?" ఆయన ప్రశ్నించారు.

"అనూని మా అన్నయ్య నా పెండ్లి అయిన తరువాత

చేసుకోవాలని అనుకొన్నాడండి! ఇంతలోకి యింత ఘోరం...."

లక్ష్మీదేవి ఏడుపు హెచ్చించింది. "పాపిష్టి వూరు సంగతి నాకు తెలుసు. అయినా నా పిల్లే బలి అవుతుందని అనుకోలేదమ్మా! ఏదో అన్నకూతురు. పెండ్లి అయితే రావడం పోవడం కుదరదని నేనే బలవంతంచేసి రప్పించు కొన్నాను. బంగారంవంటిపిల్ల. దాని బంగారు భవిష్యత్తు ఇలా నాశనం అయింది" ఆమె ఏడుస్తూనే వున్నది.

"ఆ దుర్మార్గుల చేతుల్లోపడి యెంతోమంది యిలానే నాశనం అవుతూ వున్నారు. మా పిల్లని చెరిచారు అని ఏ తండ్రి పోయి పోలీసు కంప్లయింటు యివ్వగలడు? అదీ గాక వాళ్ళ తండ్రులు మదించిన ఏనుగుల్లాంటివారు. వారికి యిక్కడ అడ్డంలేదు" ఆయన విచారంగా అన్నారు.

"పార్టీ మారిందికదండీ" అమాయకంగా అనింది.

ఆయన, 'ఓసి పిచ్చిపిల్లా' అన్నట్లు నవ్వారు.

కొంతసేపు అయినతరువాత వినోదిని వచ్చిన కారణం తెలుసుకొని రాజారావుగారు ప్రక్కలో బాంబు పడినట్లు వులిక్కిపడ్డారు.

4

ఇన్‌స్పెక్టర్ జగదీశ్‌చంద్ర తన రెండుకాళ్ళని టేబుల్ మీదవేసి, కుర్చీలో వెనక్కి జారగిలబడి, పెన్నుని నోటిలో పెట్టుకొని త్రిప్పుకొంటూ, తన అసిస్టెంటు రాజుతో—

"రాజూ! మన వూరివాళ్ళు, ప్రక్క వూరివాళ్ళు అంతా మంచివాళ్ళు అయిపోయినట్లున్నారయ్యా! ఒక్క కేసు రావడంలేదు" అని అన్నాడు.

ఇన్‌స్పెక్టర్ జగదీశ్‌చంద్ర చామనఛాయలో, ఆరడుగుల ఎత్తుతో, ఎత్తుకితగ్గ లావుతో, చిన్న సూదంటురాయి

చూపులతో. ఎదుటిమనిషిని ఆకర్షించేలా వుంటాడు. సబ్ ఇన్‌స్పెక్టర్ రాజు అతనికి కుడిభుజం.

తన మాటకి రాజునుండి సమాధానం రాకపోవడంతో కుర్చీలోనుండి నిటారుగా కూర్చున్నాడు.

రాజు స్టేషనులోకి వస్తున్న వ్యక్తివేపు ఆత్రంగా చూస్తున్నాడు.

జగదీశ్‌చంద్రకూడా అతనిని చూసి—"ఓ పెండ్లి కొడుకుగారా! సుస్వాగతం. రాజూ! మీ ఫ్రెండు వెడ్డింగ్ కార్డ్సు తీసుకొచ్చినట్లున్నాడు. నీవు స్వీట్సుకి ఆర్డర్ యివ్వు" అని హడావుడి చేశాడు.

"స్సా....ర్!" దీనంగా అన్నాడు లీలామోహన్.

"ఏవిటోయ్! పెండ్లికి ముందే నీరు కారిపోతున్నావ్! ఆ అమ్మాయి యింక నీతో ఏం కాపురం చేస్తుంది" రాజుని చూసి కన్నుకొట్టి ఛలోక్తిగా అన్నాడు.

లీలామోహన్ ఖర్చీఫ్‌తో మొహాన్ని తుడుచుకొని— "సార్! నేను పెళ్ళాడాలనుకున్న అమ్మాయిని మీ వూరి యువకులు రేప్ చేశారు. ఆ అమ్మాయి ఆత్మహత్య చేసుకొంది" దుఃఖాన్ని బలవంతంగా గొంతుకలో నొక్కిపట్టి అన్నాడు మోహన్.

"లంజాకొడుకులు వాళ్ళేస్సార్!" గర్జించాడు రాజు ఉద్రేకంగా.

జగదీశ్‌చంద్ర నిరుత్తరుడయ్యాడు. అతను ఎన్నో హత్యలని చూశాడు. ఎన్నో విషాద సంఘటలని కన్నాడు, విన్నాడు గానీ....ఈ రోజులా సూటిగా గుండెలకి తగల లేదు.

అతని కంటికొనలనుండి రెండు వెచ్చటి బొట్లు అప్ర

యత్నంగా వెలువడ్డాయి. బాధగా మోహన్ చెయ్యిమీద తన చెయ్యివేసి నొక్కాడు.

"సార్! వాళ్ళని ఇంక వదలకూడదండి. నేను ఇప్పుడే పోయి వాళ్ళని అరెస్టుచేసి బొక్కలోకి తోస్తాను. ఏ కీలుకి ఆ కీలుని వూడదీస్తాను" ఆవేశంగా అన్నాడు సబ్ ఇన్‌స్పెక్టర్ రాజు.

"రాజూ! నీవు వుండు తొందరపడకూ...." అని "....మోహన్ అసలు కథ నీవు చెప్పు" అని అన్నాడు.

మోహన్ మౌనంగా తన జేబులోనుండి అనురాధ వ్రాసిన లెటరు తీసి యిచ్చాడు.

5

దూరం నుండి వస్తున్న శాస్త్రీని చూసి రమణ వుషారుగా ఈలవేశాడు. అందరూ అటు చూశారు.

"క్రొత్తపిట్ట వలసవచ్చినట్లు వున్నదే" మూర్తి అన్నాడు.

"భలే రంజుగావుంది గురూ!" నాలిక తడుపుకొంటూ అన్నాడు మస్తాను.

"నీకు ఎప్పటికప్పుడు పరగడుపే" అని తను గుటకలు మింగాడు మూర్తి.

"పిటపిటలాడుతోంది" రంగారావు వ్యాఖ్యానించాడు.

"గురూగురూ! వచ్చేస్తోంది. వూ(....వూ(రంగంలోకి దిగి ముగ్గులోకి దింపు" కంగారుగా రంగారావుని ముందుకి తోశాడు రమణ.

"హల్లో ! రేణుకా!" రంగారావు పిల్చాడు.

ముందుకు వెళ్తున్న ఆమె ఆగి ఎనక్కి తిరిగి చూసి "ఎవరా?" అన్నట్లు చూసింది.

"మీరు రేణుక కదూ!" అతను అడిగాడు.

"ఔను నా పేరు రేణుకే! మీరెవరూ?" కళ్ళని టపటప లాడించి అడిగింది.

అతని గుండెలు గతుక్కుమన్నాయి. అలవాటైన గ్రామఫోన్ రికార్డులా వర్ణించడమే ఇన్నాళ్ళు తెలిసింది. ఇప్పటికిప్పుడు క్రొత్తకధని అల్లడం ఏలా?

"నేను .... నేను .... మీరు .... మీరు...." అతను తడబడ్డాడు.

"సరి! నేను నేనే....మీరు మీరే! నా పేరుపెట్టిపిల్చారు. ఇప్పుడు అలా కంగారుపడిపోతున్నారే."

"అబ్బే! కంగారు ఏవీలేదు. మీరు రేణుకే కదూ!"

"అవునూ! నా పేరు రేణుకే. నేను రేణుకనే."

"అయితే నేను గుర్తువున్నానంటారా? ఏలూరులో నేను మీతోబాటు చ....చదువుకొన్నాను" నసుగుతూ అన్నాడు.

"వ్వాట్ ....? ఏలూరులో నాతోబాటు చదువుకున్నారా?" ఆశ్చర్యంగా అనింది,

"ఔనండి! నన్ను గుర్తుపట్టలేదూ!" అతను అన్నాడు.

"మీ పేరు....?"

"నా....నా పేరు రమేష్."

ఆమె పగలబడి నవ్వింది. అది రోడ్డు అనే సంకోచం అయినా లేకుండా కదిలి కదిలి నవ్వింది.

"ఏందుకండి అలా నవ్వుతారు?" అతను కంగారుగా అడిగాడు.

అతనికి తానే వలలో చిక్కుకున్నంత కంగారుగా వున్నది.

"నవ్వకేం చెయ్యమంటారు? ఔనూ! అమెరికాలోనో ఎక్కడో అబ్బాయిని ఆపరేట్ చేస్తే అమ్మాయి అయిందట!

అలా కేరళాలో కూడా. ఒకవేళ మీరు ఆ విధంగా అమ్మాయి నుండి అబ్బాయి అయ్యారా ఏం ఖర్మ" నవ్వుతూ అన్నది.

అతను ఖంగు తిన్నట్లు ఆమెవేపు చూశాడు.

"అలా చూస్తారేం? నేను ఏలూరులో బేబిక్లాసు నుండి బి.ఏ వరకూ ఏలూరు కాన్వెంటులో చదువుకున్నాను. అది కో ఎడ్యుకేషన్ స్కూలు కాదు, కాలేజీకాదు. మరి మీరు నాతో ఎలా చదువుకున్నారు!" కళ్ళలో నుండి కొంచెంతనం, ఎదుటి మనిషిని కవ్వించే ధోరణి కనబడింది.

అతను కొంచెంసేపు మౌనంగావుండి "నిజం చెప్పమంటారా?" అని అన్నాడు.

"వద్దనను" ఆమె అంది.

"మీరు ఎందాకా?" అతను అన్నాడు.

"ఎందాకా అని లేదు. మా బాబాయిగారి యింటికి వచ్చాను. నాకు మా వూరిలో బాయ్‌ఫ్రెండ్సు వున్నారు. వాళ్లతో ఈవినింగ్సు సర్దాగా గడపడం అలవాటు అయింది. ఇక్కడకి వచ్చిన గంటకే బోర్ అనిపిస్తోంది. అలా తిరుగుదామని బయటికి వచ్చాను" అని అంది.

అబ్బా! పెద్ద హేండేనన్న మాట. పర్వాలేదు. కష్ట పడక్కర్లేదు అని మనసులో అనుకొని...."యిక్కడికి దగ్గిరే నా రూము. వెళ్దాం వస్తారా?" అని అడిగాడు.

ఆమె కొంచెంసేపు తటపటాయిస్తున్నట్లు చుట్టూ చూసింది. వీళ్ళకి కొంచెం దూరంలో ఒక చిన్నహోటలు వున్నది. అందులో ఒక వ్యక్తిని చూసి ఆమె ఫ్రీగా గాలిని వదిలి—"ముందు హోటలుకి వెళ్లి కాఫీత్రాగి వెళ్దాం. నాకు గంటగంటకి కాఫీత్రాగడం అలవాటు" అని అంది.

"ఓ యస్...." అని రంగారావు తమకి కొంచెం

దూరంలో ఫాలో అవుతున్న మిత్రబృందానికి సిగ్నల్ యిచ్చి, ఆమెవెంట హోటల్లోకి నడిచాడు. మిత్రబృందం వుషారుగా ఈలల వేసుకొంటూ రూం వేపు వెళ్లింది.

కాశీచోటు చూచుకొని కూర్చున్నారు. వీరికి వీపుపెట్టి ఒక టేబుల్‌వద్ద ఒక సాయిబు కూర్చున్నాడు. ఆ సాయిబు సర్వరుతో వచ్చీరాని తెలుగులో మాట్లాడు తున్నాడు!

"కాఫీత్రాగిన తరువాత మీ రూముకి వెళ్దామంటారా?" ఆమె అంది.

"ఆఁ మా రూము యెంతో పుణ్యంచేసుకొంది యీ రోజు" అతను అన్నాడు.

"ఇక్కడికి యెంత దూరం" ఆమె అన్నది.

"దగ్గరే"

"అది సరే! ఏదో చెప్తానన్నారు...." ధైర్యంగా చుట్టూ చూస్తూ అన్నది.

అతను చెప్తున్నాడు-"నా కసలు ఆడవాళ్లతో మాట్లాడా లంటేనే భయం, సిగ్గు. నేను మిమ్మల్ని చూడగానే ఏదో పూర్వజన్మ సంబంధం వున్నట్లు నా కనిపించింది. అందుకే మిమ్మల్ని పలకరించాను. నా జన్మ తరించినది. నా స్వప్న సుందరి మీరేనేమోనని నాకు మిమ్మల్ని చూడగానే అని పించినది" అతను అన్నాడు.

ఆమె కొంటెగా నవ్వింది.

"మీరేమి చదువుతున్నారు?" ఆమె ప్రశ్నించినది.

"వైజాగ్‌లో 'లా' చదువుతున్నానండి. ఇప్పుడు హాలీడేస్ కదా!" నెమ్మదిగా అన్నాడు.

"అరే! 'లా' స్టూడెంటుకి ఆడవాళ్ళంటే భయమా?" ఆశ్చర్యం నటిస్తూ అడిగింది.

"నాది చిన్నప్పటి నుండీ షైపైపేనండీ. నాకు మా అమ్మదగ్గిరే చనువులేదు. కానీ .... ఎంత విచిత్రమో చూడండి మిమ్మల్ని చూడగానే నా కెంత ధైర్యం వచ్చిందో?" ఛాతినీ పొంగించుకొంటూ అన్నాడు.

"రాస్కెల్" మనసులోనే తిట్టుకుంది.

ఇద్దరూ కబుర్లు చెప్పుకుంటూ స్వీటు, దోసె తిన్నారు.

"మీరు కాఫీనా, టీనా?" అతను ప్రశ్నించాడు.

"ఐస్క్రీమ్" ఆమె సమాధానం యిచ్చింది.

"అది ఇక్కడ దొరకదు కదండీ" ఫీల్ అవుతూ అన్నాడు.

"ఫర్వాలేదు! కాఫీనే తెప్పించండి" అని అన్నది.

కాఫీలు వచ్చాయి.

ఇద్దరూ తాగిన తరువాత అతను బిల్లుని పే చేశాడు. ఇద్దరూ హోటలు బయటికి వచ్చారు.

"వస్తానండీ! నమస్కారం. ఈ అందమైన సాయం కాలం బోర్ కాకుండా చక్కగా గడిచినది మీ దయవలన" అంటూ చేతులు జోడించింది.

అతను కొంచెంసేపు తటపటాయించి "ఇక్కడికి నాలుగడుగుల దూరంలో నా రూమువుంది. మీరు వస్తా నన్నారు" అతను గుర్తుచేశాడు.

ఆమె నాలుక కొరుక్కొని — "మరిచేపోయాను సుమండీ! అయినా నేను యిప్పుడే యింటికి వెళ్ళి చేసే పాటు ఏమీ లేదు పదండి" అంది కదులుతూ.

అతను మహానందపడిపోయాడు.

"అవునూ! మీరు వైజాగ్లో 'లా' చదువుతూ వున్నా నన్నారు? ఇక్కడ రూమేమిటి?" ఆశ్చర్యపోతూన్నట్లు అడిగింది.

'దీని దుంపతెగా! అన్నీ 'లా, పాయింట్లే లాగు తోంది!' మనసులోనే కసిగా పళ్లు నూరుకొని—"అబ్బే! మాది ఉమ్మడికుటుంబమండి. ఇంట్లో సందడి ఎక్కువ. నాకు నలుగురితో కలసి వుండేకన్నా ఒంటరిగా వుండటం అంటే ఇష్టం అండి" వినయంగా చెప్పాడు.

6

రూములోవున్న మస్తాను, రమణ, మూర్తి ముగ్గురూ రెండు వైట్‌హార్స్ బాటిల్సుని, ఐస్‌ని, జీడిపప్పుని, పొటేటో చిప్సుని, బిరియాని ప్యాకెట్సుని, ఎగ్, రొయ్యల ఫ్రైని అన్నీతెచ్చి సిద్ధంచేసివుంచారు. రంగారావు పిట్టని కొట్టుకొని రావడం ఆలశ్యం కావడంతో ఆగలేక ఓ రౌండ్ పూర్తిచేసి, జీడిపలుకులని, చిప్సుని నములుతూ సిగరెట్లని వూదుతూ, తమ అదృష్టానికి తమకి తామే మురిసి పోతున్నారు.

"నిజంగా మనం నలుగురం పెట్టిపుట్టామురా!" మురిసి పోతూ అన్నాడు రమణ.

"కాదామరి! బంగారు చెమ్చాని నోట్లో పెట్టుకుని పుట్టాంరా! మన బాబులు వూరుని కొల్లగొడుతున్నారు. మనం ఆనందాన్ని కొల్లగొడుతున్నాం. మనం పితృవాక్య పరిపాలకులంవంటివారం. మనపెద్దల అడుగుజాడలలోనే నడుస్తున్నాం" గర్వంగా మూర్తి అన్నాడు.

"అయితే శ్రీరామచంద్రులం మాత్రం కాం" రమణ అన్నాడు.

"ఆ రాముడికి రోజుకో ఆడది దొరికివుండదు. అలా వుండివుంటే అలా ఏకపత్నీవ్రతం చేసివుండడు. పెళ్ళాల దగ్గర ఏముంటుంది. ఇలా రోజుకో ఆడదాన్ని రుచి

చూడటంలోనే వున్నది మజా" మస్తాను లాలాజలాన్ని మ్రింగుతూ అన్నాడు.

నిషా కొంచెం కొంచెం పైకి ఎక్కడంవలన వాళ్ళు విచ్చలవిడిగా మాట్లాడుకుంటూ రంగారావు తెచ్చే ఆడదాని కోసం ఎదురుచూడసాగారు.

రంగారావు రేణుకాదేవితో గదిలోకి అడుగుపెట్టాడు.

గదిలోవున్న ముగ్గురు లేచి ఇద్దరికి స్వాగతం పలికారు ఆనందంగా.

గదిని చూడగానే వినోదిని ఒళ్ళు భయంతో జలదరించినది. వాళ్ళని చూడగానే అప్పటివరకూ ఆమెలోవున్న ధైర్యం దిగజారసాగింది. తెలిసి పులిబోనులో అడుగు పెట్టానా? అని భయపడింది.

ఆమె వెనుక గదితలుపులు మూసుకున్నాయి.

ఉలిక్కిపడి రంగారావువేపు చూసింది. అతను నడుం మీద చేతులు వుంచుకొని, సినిమాలో త్యాగరాజులా వికటంగా పగలబడి నవ్వుతున్నాడు.

"మిస్టర్ రమేష్! ఏమిటిదంతా" బెదురుతున్నట్లు అడిగింది.

"ఇదా? ఈ రోజు మేము నలుగురం కలిసి నీకు కన్నెచెర విడిపిస్తాం" రంగారావు అన్నాడు.

"ఈ రోజు నీకు శోభనం తాళికట్టని మొగుళ్ళతో" వెకిలిగా అన్నాడు రమణ.

"పెండ్లి అయిన తరువాత యీ అనుభవంతో మొగుడితో రంజుగా గడపవచ్చును" మస్తాను అన్నాడు.

రంగారావు గబగబా త్రాగుతున్నాడు.

రేణుక పరుగున వెళ్ళి గదిగడియ తెరవబోయింది. మూర్తి ఒక్క అడుగులో రేణుకని అంది పుచ్చుకొని___

"ఈ గదిలోకి వచ్చిన ఏ జామపండు కూడా ఈ నాలుగు చిలుకల కొరుకుడు పడకుండా గదిదాటి వెళ్ళలేదు. అమ్మడూ! ఎదిరించకు" రేణుక మొఖంమీద చిటుకవేస్తూ అన్నాడు.

రేణుక పకాపకా నవ్వింది. పడీపడీ నవ్వింది. అమాయకత్వం మాయమైయింది. హేళనగా వారివేపు చూస్తూ నవ్వింది.

నలుగురూ విచిత్రంగా ఆమెవేపు చూశారు.

"దుర్మార్గుల్లారా! ఏ దుర్మార్గానికైనా ఒకరోజు అంతం అంటూ వుంటుంది. మీ పాపం ఈ రోజుతో పండినది. ఇన్నాళ్ళ ఆడపిల్లల వుసురు యీనాడు మీకు సంకెళ్ళ రూపంలో దర్శనమివ్వబోతోంది" నవ్వుతూ అన్నది.

"హః....హః....హః...." క్రూరమైన నవ్వులతో గది ప్రతిధ్వనించినది.

"ఏయ్! పిల్లా! నీలాంటి వాళ్ళని మేము చాలామందినే చూశాము. బెదిరించి చివరికి మానం పోగొట్టుకొని గుమ్మం దాటినవాళ్ళు నా తలలో వెంట్రుకలంత మంది అయ్యారు. నీవో లెక్కా. ఎవడూ మమ్మల్ని ఏమీ చేయలేడు. ఏ కుక్కా అయినా డబ్బుకి తోకాడిస్తుంది. అటువంటి డబ్బు మా దగ్గర...."

తలుపులు దబాదబా బాదిన శబ్దం అయింది.

"ఎవడోయ్! అంతధైర్యంగా మన తలుపుల్ని కొట్టే నా కొడుకు" అరచాడు రంగారావు.

శబ్దం ఎక్కువైంది.

"రేయ్! యెవడో చూసి నాలుగు వడ్డించు" ఆజ్ఞ జారి చేశాడు.

రమణ తలుపులు తెరిచాడు ఒకరెక్క మాత్రం.

రేణుక పారిపోతుందేమోనని రంగారావు, మస్తాను, మూర్తి ఒడిసి పట్టుకొనివున్నారు.

బిలబిల్లాడుతూ పోలీసువారు లోనికి రావడం, టకటకా ఫోటోలు లాగడం క్షణాలమీద జరిగిపోయింది.

తణుకు ప్రజలంతా ఆ రూముముందు గుంపుగా చేరారు.

రాజు....ఇనస్పెక్టర్ రాజు కసిగా లాటీతో వాళ్ళని చావబాదసాగాడు.

"రాజూ!" ఇనస్పెక్టర్ జగదీశ్‌చంద్ర అడ్డుగొనక పోతే వాళ్లు రాజుచేతుల్లో చనిపోయివుండేవారే.

నలుగురికి బేడీలు పడ్డాయి.

లీలామోహన్ విచారంగా బలవంతంగా, ఏడుపుని దిగ మ్రింగుకుంటూ వున్నాడు.

వీళ్ళ సంభాషణ అంతా వినోదిని జాకెట్టులో దాచబడిన చిన్న టేపురికార్డర్ రికార్డు చేసింది.

పిట్టలవేట ముగిసింది. ★

వ్రేలాడే కుక్కలు?

ఒక యువకుడు కుక్కబొమ్మలున్న చొక్కా వేసుకొని, రోడ్డంట వెళుతున్నాడు. అతని వెనుక ముగ్గురు కాలేజీ విద్యార్థినులు నడుస్తున్నారు. అతన్ని ఏడ్పించటానికని వాళ్ళు ఇలా అన్నారు.

"ఏయ్ మిష్టర్! నిన్ను పట్టుకుని కుక్కలు వ్రేలాడుతున్నాయి."

వెంటనే ఆ యువకుడు వెనక్కి తిరిగి— "వాటి అరుపులు ఇప్పుడే విన్నాను," అన్నాడు.

అంతే! ఆ యువతులు తెల్ల ముఖాలేశారు.

జె. ఎస్. కె. వి. ప్రసాద్, పెదపాడు.

సీరియల్

రమణశ్రీ అతీంద్రియ శక్తులు

(గత సంచిక తరువాయి)

"బై ది బై మిస్టర్ బెనర్జీ, ఒక ముఖ్యమైన కండిషన్। మీ బృందం కేవలం పురాతత్వపరిశోధనకే దృష్టిని కేంద్రీకరించాలి. ఎట్టి పరిస్థితిలోనూ ముత్యాలను అంటరాదు" హెచ్చరించాడు గాబ్రియేల్.

"అలాగే మిస్టర్ గాబ్రియేల్. మా బృందం తరపున నేను హామీ యిస్తున్నాను" అన్నాడు బెనర్జీ.

"వెల్. ఇకపోతే మీ బృందానికి సముద్రంలో నడవడం, ఆయుధాలను ఉపయోగించడం అంతా క్రొత్తేనను కుంటాను. ఈ రోజు సాయంత్రం యిక్కడకు తీసుకురండి. వారికి, మీకు యీ ప్రాథమిక శిక్షణ యిప్పిస్తాను" అన్నాడు ఉత్సాహంగా గాబ్రియేల్. అతనిలో ఏదోరకంగా సహాయపడుతున్నామన్న తృప్తి మాటల్లో వ్యక్తమవుతోంది.

"థాంక్యూ మిస్టర్ గాబ్రియేల్! సాయంకాలం మళ్ళీ కలుస్తాను" అంటూ లేచాడు ప్రొఫెసర్.

"వెల్. సీ యు ఎగైన్ మిస్టర్ గాబ్రియేల్" అంటూ షేక్‌హాండిచ్చాడు రంజిత్.

25

అనుకున్న సమయానికి ప్రొఫెసర్ బృందం పేట్రియట్ షిప్పింగ్ కార్పొరేషన్ ఆఫీసును చేరుకుంది.

వారికోసమే ఎదురుచూస్తున్న జనరల్ మేనేజర్ గాబ్రియేల్ ప్రొఫెసర్ బృందాన్ని రిసీవ్ చేసుకొని కంపెనీ వాన్‌లో హార్బర్‌కు తీసుకెళ్ళాడు.

కొలంబో ప్రధాన రేవుపట్టణానికి షుమారు అయిదు కిలోమీటర్ల దూరంలో కార్పొరేషన్ స్వంతంగా నిర్మించుకున్న చిన్న హార్బరది. కంపెనీకి చెందిన ఓడలన్నీ తీరానికి దాదాపు కిలోమీటర్ దూరంలోనే లంగరు వేస్తారు. అక్కడనుండి కొన్ని చిన్న మరపడవలు మాత్రమే తీరానికి వస్తాయి.

అరగంట నిరీక్షణ అనంతరం దూరంగా నీళ్ళపై జలాంతర్గామి పెద్ద డాల్ఫిన్ చేపలా పైకి తేలింది.

వెంటనే రెండు చిన్న పడవలు జలాంతర్గామిని చేరుకున్నాయి.

జలాంతర్గామిలో ఇంధనం నింపడానికి, సిబ్బంది షిఫ్టు మారడానికి, జలాంతర్గామి మైనర్ రిపేర్లు చూసుకోవడానికి మరో గంట పట్టింది.

చివరగా మరో పడవలో ప్రొఫెసర్ బృందంతో సహా జనరల్ మేనేజర్ గాబ్రియేల్ గూడా జలాంతర్గామిని చేరుకున్నారు.

జలాంతర్గామిలో కాలు పెడుతూంటే ప్రొఫెసర్ మదిలో ఆనందకెరటాలు పెల్లుబికేయి.

ప్రొఫెసర్ బృందంలో ప్రతి ఒక్కరూ ముందు ప్రయాణంలో పొందబోయే అనుభూతుల్ని వూహించుకుంటూ ఆనందిస్తున్నారు.

ముందుగా గాబ్రియేల్ ప్రొఫెసర్ బృందానికి సబ్ మెరీన్ మొత్తం తిప్పి చూపించాడు.

యుద్ధకాలంలో ఉపయోగించిన సబ్ మెరీన్ కావటం వలన మామూలు సబ్ మెరీన్లకన్న సైజు తక్కువగా వుంది.

ఆ సబ్ మెరీన్లో మామూలుగా కెప్టెన్‌గాక యిద్దరు ఆపరేటర్లు, ఒక వైర్‌లెస్‌మాన్, ఒక ఇంజనీర్, ఒక డాక్టర్, మరో పదిహేనుమంది సిబ్బంది, మొత్తం ఇరవై ఒక్కమంది ప్రయాణం చేస్తుంటారు. ఇప్పుడు ప్రొఫెసర్ బృందంతోసహా ఇరవై ఆరుగురు.

చివరకు ప్రొఫెసర్ బృందాన్ని తీసుకొని కెప్టెన్‌రూంలోకి నడిచాడు గాబ్రియేల్.

గాబ్రియేల్‌ను చూడగానే కెప్టెన్ వినయంగా ఆహ్వానించాడు.

"మీట్ మిష్టర్ దేవర్! ఈ సబ్ మెరిన్‌కు కెప్టెన్!

ఉత్సాహంగల యువకుడు'' పరిచయం చేశాడు.

"గ్లాడ్ టు సీ యు'' కరచాలనం చేశాడు ప్రొఫెసర్.

"మిష్టర్ దేవర్, వీరు ప్రఖ్యాత భారతీయ శాస్త్రవేత్త ప్రొఫెసర్ బెనర్జీ! కొన్ని ముఖ్యమైన పరిశోధనల నిమిత్తం మీ వెంట వస్తున్నారు'' అంటూ తమమధ్య జరిగిన సంభాషణ అంతా చెప్పాడు గాబ్రియేల్.

"వెల్ సర్! నేను చేయగలిగినంత సహాయం మీకు చేయగలను'' అన్నాడు ప్రొఫెసర్ వైపు చూస్తూ కెప్టెన్ దేవర్.

ఆపరేటర్లు స్టార్టింగ్ సిగ్నల్‌కోసం చూస్తున్నట్లుగా కేబిన్‌రూంకి మెసేజ్ పంపారు.

"వెల్ మిష్టర్ బెనర్జీ. విష్ యు గుడ్‌లక్'' వీడ్కోలు తీసుకుంటూ అన్నాడు గాబ్రియేల్.

అంతా చిరునవ్వుతూ వీడ్కోలు చెప్పారు.

గాబ్రియేల్ జలాంతర్గామి నుండి వెలుపలకు వచ్చి మరపడవ ఎక్కగానే సిగ్నల్ యిచ్చాడు కెప్టెన్ దేవర్.

జలాంతర్గామి మెల్లగా కదిలింది అనంతసాగర గర్భంలోనికి.

26

జలాంతర్గామి నీటిలో తిమింగిలంలా కదులుతూ ముందుకు పోతోంది.

కాబిన్‌రూంలో పైలట్‌తోబాటుగా ప్రొఫెసర్ బృందం కూడా కూర్చొనివుంది.

వెలుపల అంతా గాఢాంధకారంగా వుంది. గ్లాస్ విండోస్‌లో నుండి సముద్రాన్ని పరికిస్తున్నారు బృందమంతా.

సబ్ మెరిన్‌కు నలువైపులా వెలుగుతున్న ప్రకాశవంత మైన ఫ్లడ్‌లైట్స్ గాఢాంధకారంలో కాంతిపుంజాల్లా మెరుస్తున్నాయి.

కాంతి వర్షంలో తడుస్తున్నట్లుగా రంగురంగుల చేపలు మిలమిల మెరుస్తూ తిరుగుతున్నాయి.

అపురూపమైన ఆ దృశ్యాల్ని తనివిదీరా చూస్తున్నారు ప్రొఫెసర్ బృందం.

ఇంతకుముందు రంజిత్‌కు, లాల్‌కు మాత్రమే జలాం తర్గామిలో ప్రయాణం చేసిన అనుభవంవుంది. మిగతా ముగ్గురికీ ఆ అనుభవం చాలా క్రొత్తగానూ, వింతగానూ వుంది.

"మిష్టర్ దేవర్! కొలంబోనుండి మన్నార్ అఖాతం ఎంతదూరం ఉంటుంది" ప్రశ్నించాడు ప్రొఫెసర్ కెప్టెన్‌ను.

"సుమారు 310 నాట్ కిలోమైల్స్ ఉండవచ్చు సర్" అన్నాడు కెప్టెన్ దేవర్.

"మనం ఎన్నాళ్ళలో ఆ ప్రదేశాన్ని చేరగలం?" మళ్ళీ ప్రశ్నించాడు.

"మీకు పని మన్నార్ అఖాతం దగ్గరా?" ప్రశ్నించాడు దేవర్.

"అవును మిష్టర్ దేవర్! బహుశా మీకు తెలిసేవుండ వచ్చును. కొన్ని శతాబ్దాల క్రితం మన్నార్‌అఖాత ప్రాంత మంతా దీవుల మయం. అక్కడ మానవజాతి నాగరికతతో సంచరించిన చిహ్నాలు వున్నాయి. ఆ దీవులు కాలప్రవా హంలో మునిగిపోయాయి. ప్రస్తుతం మాకు ఆ దీవులలో మునిగిపోయివున్న ఓ చాతుర్లింగాలయం కావాలి" చెప్పాడు ప్రొఫెసర్.

ప్రొఫెసర్‌వైపు ఆశ్చర్యంగా చూశాడు కెప్టెన్.

"సార్, మీరు చెప్పేది వింటుంటె చాలా ఆశ్చర్యంగా వుంది. కొంతవరకు నిజమేమోనన్న అనుమానం గూడా కలుగుతోంది. ఎందుకంటె సాధారణంగా 100, 150 అడుగుల లోతుకు వెళితేనేగానీ తగలని నేల మన్నార్ అఖాతానికి సమీపప్రాంతాలలో 60, 70 అడుగుల లోతునే నేల తగులుతుంది" అన్నాడు కెప్టెన్ దేవర్.

ప్రొఫెసర్ బెనర్జీ కళ్ళు మెరిసాయి.

"థాంక్యూ మిష్టర్ దేవర్. చాలా ఆశాజనకమైన వార్త చెప్పారు. సాధ్యమైనంత త్వరగా మమ్మల్ని ఆ ప్రాంతానికి చేర్చండి" అన్నాడు బెనర్జీ ఆనందంగా.

"అలాగేసర్! ఎంత లేదన్నా నాలుగురోజులు పడుతుంది. ఈలోపు నాలుగైదు విడతలుగా ముత్యాల అన్వేషణ సాగుతుంది" అన్నాడు కెప్టెన్.

"బైదిబై మిష్టర్ దేవర్! మీరు అఖాతంప్రాంతంలో ముత్యాల అన్వేషణ సాగించేటప్పుడు మీకేమైనా శిథిల గృహాలుగానీ, ఆలయాలుగానీ కన్పించాయా?" కుతూహలంగా ప్రశ్నించాడు బెనర్జీ.

"లేదు మిస్టర్ బెనర్జీ! నాకు జ్ఞప్తి ఉన్నంతవరకు అలాంటి శిథిలాలు ఏమీ కన్పించలేదు" అన్నాడు దేవర్.

అదే సమయంలో "కెప్టెన్, అటు చూడండి. ఏదో జంతువు మన జలాంతర్గామివైపు పరిగెత్తుకువస్తోంది" అంటూ కంగారుగా అరిచాడు నవీన్.

అంతా కంగారుగా అటువైపు చూశారు.

దూరంగా చిన్నకొండ వేగంగా కదిలి వస్తున్నట్లుగా ఓ జంతువు పరుగున వస్తోంది. ఆ జంతువు కళ్ళు స్పాట్ లైట్స్‌లా మెరుస్తున్నాయి.

కెప్టెన్ ఆ జంతువువైపు పరిశీలనగా చూసి చిన్నగా

నవ్వాడు.

"డోంట్‌వర్రీ మిష్టర్! అది హ్వేల్ జాతికి చెందిన పెద్దచేప. ఆ చేపకు ఈ జలాంతర్గామిని మ్రింగగల శక్తి వుంది కానీ, దీనిని దరిచేరలేదు. ఎందుకంటే మన సబ్‌మెరిన్‌కు చుట్టూ ఫర్లాంగు పరిధిలో ఒక విద్యుత్ వలయం ఏర్పడివుంటుంది. ఆ వలయాలన్నీ ఛేదించుకొని ఏ జంతువూ సబ్‌మెరీన్‌ను చేరలేదు. లేకుంటే ప్రతిచిన్న జంతువుకు మనం భయపడవలసి వచ్చేది" విపులంగా చెప్పాడు.

అదే సమయంలో వేగంగా ముందుకు వస్తున్న హ్వేల్ చేప ఏదో పర్వతానికి ఢీ కొన్నట్లుగా ఎగిరి త్రుళ్ళిపడింది. తిరిగి వేగంగా వెనుతిరిగి పరుగు ప్రారంభించింది.

"థాంక్ గాడ్!" గుండెలపై చేతులు వేసుకొని నిట్టూర్చారు ప్రొఫెసర్ బృందం.

"కెప్టెన్! మీల్స్‌రెడీ" అంటూ కిచన్‌లో నుండి మెసేజ్ వచ్చింది.

"వెల్‌సర్! మనం డైనింగ్ హాల్‌కు వెళదాం" అంటూ లేచాడు కెప్టెన్ దేవర్.

27

ప్రొఫెసర్ బృందం సబ్‌మెరీన్‌లో ప్రయాణం ప్రారంభించి మూడురోజులయింది.

ఈలోపు సబ్‌మెరీన్‌ను మూడు ప్రదేశాలలో ఆపి ముత్యాల అన్వేషణ సాగించింది సబ్‌మెరీన్ బృందం.

"మిష్టర్ దేవర్, ఈసారి మీరు సాగించే ముత్యాల సేకరణలో మేముగూడా పాల్గొంటాము" చెప్పాడు బెనర్జీ.

అభ్యంతరంగా చూశాడు కెప్టెన్.

"సార్, మీరు రావడానికి నాకైతే అభ్యంతరంలేదు గానీ, మిస్టర్ గాబ్రియేల్ అంగీకరించరనుకుంటాను" అన్నాడు.

"లేదు మిస్టర్ దేవర్! మిస్టర్ గాబ్రియేల్‌కు అన్నీ చెప్పాము. ముత్యాలతో మాకేమీ అవసరంలేదు. సముద్రంలో నడక ప్రాక్టీస్ అవుతుందన్న భావంతో మిమ్మల్ని అనుమతి అడుగుతున్నాము" అన్నాడు బెనర్జీ.

ఒకక్షణం ఆలోచించి చివరకు 'సరే' నన్నాడు కెప్టెన్ దేవర్.

ఉదయం ఏడుగంటలయింది—

ముత్యాల సేకరణకు బయలుదేరే సిబ్బంది అంతా డ్రెస్ చేసుకోసాగారు.

జలాంతర్గామిలో వున్న పదిహేనుమంది సిబ్బందిలో ఆరుగురు మాత్రమే ముత్యాలసేకరణకు వెళతారు.

ఈసారి ఆ ఆరుగురితోబాటుగా ప్రొఫెసర్ బృందం గూడా సముద్రంలోపలకు వెళ్లడానికి రెడీ అయ్యారు.

అంతా ఒక విధమైన రబ్బరుతో తయారుచేయబడిన స్విమ్మింగ్ డ్రెస్ ధరించారు. ముఖానికి మాస్క్ తగిలించుకున్నారు. ఆ మాస్క్‌నుండి వెలువడిన చిన్న చిన్న ట్యూబులు భుజాన వ్రేలాడుతూవుండే ఆక్సిజన్ సిలిండర్స్‌కు కనెక్టు చేయబడి వుంటాయి.

తల పైభాగాన అమర్చుకున్న హెల్మెట్‌నుండి బ్యాటరీ ద్వారా ఉత్పత్తి అయ్యే విద్యుత్‌కాంతులు అయిదారు మీటర్ల దూరంవరకు వెలువడుతుంటాయి. అందరి చేతులలోనూ వాటర్‌గన్స్ రెడీగా వుంటాయి. అవిగాక ఇన్నర్ పాకెట్స్‌లో గ్రనేడ్స్‌కూడా వుంటాయి.

ఆపరేషన్ ప్రారంభమయిన తరువాత ముగిసేవరకు

ఎవరూ మాట్లాడడానికి అవకాశం వుండదు.

సరిగ్గా ఏడుగంటల పదిహేను నిమిషాలకు ఒకరి తర్వాత ఒకరు అంతా సీడోర్ తెరుచుకొని సముద్రంలోకి ప్రవేశించారు.

మెల్లగా ఒకరి తర్వాత ఒకరు తేలుతూ నడవసాగారు. బృందంలో ఎవరూ దారి తప్పకుండా అందర్నీ కలుపుతూ ఒక చైన్ వుంది. ఆ చైను అంచును జలాంతర్గామికి కట్టి వుంచుతారు.

దాదాపు 50 అడుగుల లోపలకు వెళ్ళిన తరువాత కాళ్ళ క్రింద కొంచెం గట్టిగా తగిలింది.

అది బహుశా కొండప్రాంతం కావచ్చు. మెల్లగా కాళ్ళు భూమిపై ఆనించి నడక సాగించారు.

ప్రొఫెసర్ బృందానికి యిది సరికొత్త అనుభవం! అయినా నిర్భయంగా నడుస్తున్నారంతా. వారి హృదయాల నిండా ఒకేరకమైన థ్రిల్ ఆవరించుకొని వుంది.

అందరి దృష్టి పరిసరాలను జాగ్రత్తగా పరికిస్తోంది.

రంగురంగుల చేపలు, తాబేళ్ళు, ఇంతకుముందెన్నడూ చూడని చిన్నచిన్న జంతువులు నీళ్ళలో హడావిడిగా తిరుగుతున్నాయి.

కొంతసేపటిలోనే ముత్యాలు లభించే ప్రాంతం చేరుకున్నారు.

నేలపై ముత్యపుచిప్పలు చిందరవందరగా పడి వున్నాయి. విడిపోయిన ముత్యపుచిప్పలనుండి జారిపోయిన ముత్యాలు క్రింద మట్టిలో కలసిపోయి మెరుస్తున్నాయి.

క్రిందవున్న ఇసుక అంతా బంగారంలా మెరిసిపోతోంది.

ముత్యాలు సేకరించే బృందం చకచక తమ పని కానిస్తు

న్నారు. క్రిందపడిన ముత్యాలను, అక్కడక్కడ వున్న ముత్యపుచిప్పలను జాగ్రత్తగా ఏరి తమ నడుములకు బిగించివున్న తోలు సంచులలో భద్రపరుస్తున్నారు.

ఆక్సిజన్ సిలిండర్స్ ఎట్టి పరిస్థితిలోనూ గంటమించి పనికిరావు. అందుకే బృందం చకచక పని కానిస్తున్నారు.

ప్రొఫెసర్ బృందం మాత్రం వాళ్ళు చేసే పనిని కుతూహలంగా పరిశీలిస్తున్నారు. అక్కడ లభిస్తున్న ముత్యాలను చూస్తుంటే వారి కళ్ళు చెదిరిపోతున్నాయి.

ఆహా! సాగరగర్భం ఎంత సంపదను తనలో నిక్షిప్తం చేసుకుంది!

గంట పూర్తవుతుందనగా బృందం నాయకుడు టైమ్ అయిపోయిందన్నట్లుగా సైగ చేశాడు.

వెంటనే అంతా జలాంతర్గామివైపు తిరుగుప్రయాణ మయ్యారు.

పదినిమిషాలలో జలాంతర్గామిని చేరుకున్నారు.

వెంటనే సీడోర్ దగ్గరవున్న వ్యక్తి డోర్ తెరచి చకచక అందర్నీ లోపలకు లాక్కున్నాడు.

లోపలకు ప్రవేశించగానే అందరూ చకచక దుస్తులు మార్చుకున్నారు.

వెంటనే అందరికీ టీ సర్వ్‌చేయబడింది.

మెల్లగా టీ సిప్‌చేస్తూ తోలు సంచులు పెద్ద టార్పాలిన్‌పై గుమ్మరించారు సిబ్బంది.

"వెల్! ఫర్వాలేదు. కృషికి తగ్గట్లుగా దొరికాయి" సంతోషం ప్రకటించాడు కెప్టెన్ దేవర్.

"సార్, ఎలావుంది మీకీ ట్రిప్?" ప్రొఫెసర్‌వైపు తిరిగి ప్రశ్నించాడు కెప్టెన్.

"అద్భుతంగా వుంది మిస్టర్ దేవర్! ఇంతవరకు

జీవితంలో చూడని దృశ్యాలు ప్రత్యక్షంగా తిలకించాము. వాటిని వర్ణించడానికి మాకు మాటలు రావడంలేదు. మా బృందంలో ప్రతి ఒక్కరూ యెంతో మధురానుభూతిని పొందారు" చెప్పాడు బెనర్జీ.

"వెల్! మనం త్వరలోనే మన్నార్‌ను చేరుకోవచ్చు. అప్పటివరకు రెస్ట్ తీసుకోండి. గుడ్‌లక్!" అంటూ కేబిన్‌లోకి నడిచాడు కెప్టెన్.

ప్రొఫెసర్ బృందం తమకు కేటాయించిన గదిలోకి నడిచారు.

28

జలాంతర్గామి ప్రయాణంలో మరోరోజు గడిచింది.

ప్రొఫెసర్ బెనర్జీ, డాక్టర్ మొహిత్‌తో చదరంగం ఆడుతున్నాడు.

"ఇక మీ రాజు త్రోసిరాజు! మీ ఆటకట్టు!" అన్నాడు బెనర్జీ పావును కదుపుతూ.

అదే సమయంలో జలాంతర్గామి ఒక్కసారిగా ఏదో కొండను ఢీ కొన్నట్లుగా ఢీ కొని ఆగిపోయింది. లోపల భూకంపం వచ్చినట్లుగా కంపించిపోయింది.

కంగారుగా ప్రొఫెసర్ బెనర్జీ కాబిన్‌లోకి పరిగెత్తాడు.

"వాట్ హాపెండ్ మిష్టర్ దేవర్?" ఆదుర్దాగా అడిగాడు బెనర్జీ.

"నథింగ్ టు వర్రీ సర్! మనం మన్నార్ అఖాతాన్ని సమీపించాం. మీకు చెప్పాను కదా, యిక్కడ సముద్రంలో లోతు తక్కువని. మనం మామూలు కక్ష్యలో ప్రయాణం చేస్తున్నాం కాబట్టి చిన్న ఆక్సిడెంట్‌కు గురయ్యాము. ఘరేం ఫర్వాలేదు. పదినిముషాలలో తిరిగి ప్రయాణం

ప్రారంభమవుతుంది" అన్నాడు కెప్టెన్ దేవర్.

"థాంక్యూ దేవర్! మంచి శుభవార్త చెప్పావు" సంతోషంగా అన్నాడు బెనర్జీ.

అనుకున్నట్లుగా తిరిగి పదినిమిషాలలో ప్రాయాణం ప్రారంభమయింది. గ్లాస్‌విండోలోంచి ఆ పరిసరాలను జాగ్రత్తగా గమనించసాగారు ప్రొఫెసర్‌బృందం.

మరో నాలుగు గంటలు ప్రయాణం సాగినతర్వాత జలాంతర్గామిని ఆపించాడు కెప్టెన్.

"ప్రొఫెసర్‌సాబ్! మా బృందం ముత్యాల అన్వేషణకు సిద్ధమవుతోంది. మీరు గూడా రెడీ అయితే మీ అన్వేషణ మీరు సాగించవచ్చు" అన్నాడు కెప్టెన్ దేవర్.

"ఓ.కె. కెప్టెన్ విత్‌ప్లెజర్" అంటూ లేచాడు బెనర్జీ.

మరో అరగంటకల్లా అంతా సముద్రసంచారానికి సర్వసన్నద్ధులయ్యారు.

"మిష్టర్ బెనర్జీ! ఒక్క విషయం గుర్తుంచుకోండి. మీరు ఎక్కడ సంచరించినా గంటలోపు జలాంతర్గామిని చేరుకోవాలి. ముఖ్యమైన సమాచారం లభించినా మీరు సమయాన్ని నిర్లక్ష్యం చేయవద్దు. మరోసారి వెళ్ళవచ్చు" హెచ్చరించాడు కెప్టెన్.

"ఓ.కె." చెప్పాడు బెనర్జీ.

అంతా సీడోర్ తెరచుకొని సముద్రంలోకి ప్రవేశించారు.

ఈ సారి ప్రొఫెసర్ బృందం జలాంతర్గామి బృందాన్ని అనుసరించడంలేదు. వేరొక దిక్కుగా తమ అన్వేషణ ప్రారంభించారు.

కొద్దిదూరం వెళ్ళేసరికి కాళ్ళకి భూమి తగిలింది.

మెల్లగా నడక సాగించారు.

ఆశ్చర్యం! అక్కడ అంతా మామూలు భూప్రదేశం

లాగానే వుంది. నిలువెత్తు ప్రవహిస్తున్న నీరు తప్ప మరోమార్పు కన్పించడంలేదు.

చిన్నచిన్న పొదలు, చెట్లు, కొండరాళ్లు, బిలాలు.... అంతా మరో కొత్తలోకానికి వచ్చినట్లుగావుంది.

ఎంతదూరం తిరిగినా అనుమానాస్పద శిథిలాలు ఏమీ కన్పించలేదు.

ఎక్కడ చూసినా బంగారులా మెరుస్తున్న ఇసుక, కుప్పలు తెప్పలుగా తిరుగుతున్న రంగురంగుల చేపలు, అక్కడక్కడ విసిరివేసినట్లుగావున్న ముత్యపుచిప్పలు, వెదజల్లబడినట్లున్న ముత్యాలు తప్ప ప్రొఫెసర్‌కు ఉపయోగ పడే ఆధారాలేమీ లభించలేదు.

హఠాత్తుగా టైమ్ చూసుకున్న ప్రొఫెసర్ అదిరి పోయాడు. అరగంటకు యింకా అయిదు నిమిషాలు మాత్రమేవుంది.

వెంటనే తన బృందానికి సైగచేసి తిరుగుప్రయాణ మయ్యాడు బెనర్జీ.

అంతా వేగంగా జలాంతర్గామి దిశగా నడకసాగించారు.

హఠాత్తుగా ముందు నడుస్తున్న ప్రొఫెసర్ బెనర్జీ ఆగి పోయాడు. అతని నోటిలోనుండి కెవ్వుమని కేక రాబో యింది కానీరా లేదు. అడుగు ముందుకు పడటంలేదు.

క్రిందకు తొంగిచూసిన బెనర్జీ గుండె దడదడలాడాయి.

కుడికాలును ఒక పెద్దమొసలి పట్టివేసింది.

మొసలి మెల్లగా నోరును పైకి జరుపుతోంది.

ఈ హఠాత్సంఘటనకు వెనకవస్తున్న వారంతా నిశ్చేష్టులై నిల్చుండిపోయారు. ఎవరికీ చేతిలో ఆయుధాలు గుర్తుకు రాలేదు.

చివరగావున్న రంజిత్ గబగబ ముందుకు వచ్చాడు.

అతని చేతిలోని వాటర్‌గన్ ఛక్ ఛక్ మంటూ వరుసగా నిప్పుకణాలను వెదజల్లింది.

వరుసగావెళ్ళిన నిప్పుకణాలు సూటిగా మొసలితలలో దూసుకుపోయాయి.

నిర్జీవమైపోయిన మొసలి మెల్లగా తల వాల్చేసింది.

వెంటనే ముందుకు నడవమన్నట్లుగా సైగచేశాడు రంజిత్.

దీర్ఘంగా శ్వాసవదులుతూ తిరిగి నడక సాగించారంతా. ప్రొఫెసర్‌కు మాత్రం నడక సాగడంలేదు. కాలు అంతా చచ్చుబడిపోయినట్లుగా వుంది.

రంజిత్ బలవంతంగా యీడ్చుకుపోసాగాడు ప్రొఫెసర్‌ను.

ఎట్టకేలకు చివరకు అంతా జలాంతర్గామిని చేరుకున్నారు.

అప్పటికే అంతా ఆందోళనగా వీరి రాకకై యెదురు చూస్తున్నారు.

వెంటనే సరంగు సీడోర్ తెరచి అందర్నీ లోపలకు లాక్కున్నాడు.

జరిగిన సంఘటన వినగానే కెప్టెన్ కంగారుగా డాక్టర్‌ను పిలిపించాడు.

డాక్టర్ వచ్చి పరీక్షచేసి కాలుకు బేండేజ్ వేశాడు. బాధ తెలియకుండా వుండటంకోసం ఇంజక్షన్ యిచ్చాడు.

అప్పటికి కొంచెం తేరుకున్న బెనర్జీ మెల్లగా కళ్ళు తెరిచాడు.

తనవైపే ఆందోళనగా చూస్తున్న బృందాన్ని చూసి చిరునవ్వు నవ్వాడు.

రంజిత్ వైపు తిరిగి దగ్గరకు రమ్మని సైగ చేశాడు.

"మై బాయ్! నీ ఋణం ఎలా తీర్చుకోను?" చెమ్మగిల్లిన కళ్ళతో రంజిత్ తల నిమురుతూ అన్నాడు బెనర్జీ.

29

మరుసటిరోజు తిరిగి యధాప్రకారం ముత్యాలసేకరణకు సిద్ధమయ్యారు జలాంతర్గామి బృందం.

ప్రొఫెసర్ బెనర్జీని కనీసం రెండురోజులైనా పూర్తి విశ్రాంతి తీసుకోమని సలహా యిచ్చాడు డాక్టర్.

ఈ సంఘన జరిగిన తర్వాత డాక్టర్ మొహిత్‌కూ లాల్‌కు తిరిగి సముద్రంలో కాలు పెట్టాలంటే భయమేస్తోంది.

డాక్టర్ సలహాకు నిరాశగా క్రుంగిపోయాడు బెనర్జీ.

రంజిత్ ఒక నిశ్చయానికి వచ్చాడు.

బెనర్జీ దగ్గరకు వెళ్ళి "సార్, నాదొక అభ్యర్ధన! డాక్టర్ సలహా ప్రకారం మీరు బయటకు రాలేరు. అనవసరంగా డాక్టర్ మొహిత్‌నుకూడా యెందుకు శ్రమపెట్టడం! మీరు అనుమతిస్తే నేనూ, నవీన్ కలసి అన్వేషణ సాగిస్తాము. ఏదైనా ఆధారం లభిస్తే అప్పుడు అంతా కలసి వెళ్ళవచ్చు!" అన్నాడు.

బెనర్జీ వాత్సల్యంగా చూశాడు రంజిత్ వైపు.

"వెల్ మై బోయ్! డూ యాజ్ యు లైక్!" అన్నాడు.

"థాంక్యూసర్!" అంటూ నవీన్‌వద్దకు నడిచాడు రంజిత్.

రంజిత్, నవీన్‌లు కలసి సాగరగర్భంలో అన్వేషణ సాగించసాగారు.

ఇరువురూ యువకులే అవడంవలన అన్వేషణ చురు

కుగా సాగుతోంది. చూసిన దిక్కు చూడకుండా సాధ్యమైనంత మేర లోపలకు వెళ్ళి పరిశోధిస్తున్నారు. అన్ని ప్రదేశాలు కలిపి ఫోటోలుకూడా తీస్తున్నారు.

అయినా ప్రయోజనం కన్పించడంలేదు.

చివరకు యిరువురికీ విసుగుపుట్టింది.

"సార్, బహుశా మీ అంచనాలు పొరపాటు పడివుండవచ్చు" అన్నాడు రంజిత్ ప్రొఫెసర్‌తో, మూడురోజుల అన్వేషణ అనంతరం.

ప్రొఫెసర్ ముఖం కళావిహీనమైంది.

తాము ఇంత కష్టపడి, యింత ఖర్చుకు ఓర్చి వచ్చినది రిక్తహస్తాలతో మరలి వెళ్లడానికా!

"మిస్టర్ బెనర్జీ! ఈరోజుతో మీ పరిశోధన ముగించాలి. రేపు జలాంతర్గామి తిరుగుప్రయాణం ప్రారంభిస్తుంది. కాల నియమం చాలా ముఖ్యం. లేకపోతే మేము ఇంధనానికి చాలా ఇబ్బంది పడవలసి వస్తుంది" చెప్పాడు కెప్టెన్ దేవర్.

"ఓ. కె. మిస్టర్ దేవర్! ఈసారి మేము ఓడిపోయాము" నీరసంగా అన్నాడు బెనర్జీ.

జాలిగా ప్రొఫెసర్‌ను చూస్తూ కేబిన్‌లోకెళ్ళిపోయాడు కెప్టెన్ దేవర్.

"మిస్టర్ రంజిత్! మీరు అన్వేషించిన ప్రదేశాలలో ఏ ఆధారాలు లభించలేదా? ఏదీ మీరు తీసిన ఫోటోలు తీసుకు రండి."

మరుక్షణంలో నవీన్ ఫోటోలు తెచ్చి ప్రొఫెసర్‌కు యిచ్చాడు.

యెంతో ఆతృతగా ఆ ఫోటోలను పరిశీలించసాగాడు బెనర్జీ.

ఫోటోలు పరిశీలిస్తున్న బెనర్జీ కళ్ళు ఒక ఫోటో దగ్గర ఆగిపోయాయి.

మళ్ళీ మళ్ళీ పరిశీలించి చూశాడా ఫోటోవైపు.

అతనిలో ఎక్కడో ఆశ తళుక్కున మెరిసింది.

"మిస్టర్ రంజిత్, యీ ఫోటోను చూశారా?" అడిగాడు ఉత్సాహంగా.

"ఫోటో ఏమిటి సార్, ప్రత్యక్షంగానే చూశాము" అన్నాడు రంజిత్.

"విల్ మిస్టర్ రంజిత్! మీకు తెలియకుండానే మీరు చాలా ఉపయోగకరమయిన వార్త తెచ్చారు. మిస్టర్ నవీన్. మీ కృషికి కృతజ్ఞతలు" అన్నాడు ప్రొఫెసర్ సంతోషంగా.

"ఏమిటిసర్, మీరనేది?" ఆశ్చర్యంగా ప్రశ్నించారు మిత్రద్వయం.

"మిస్టర్ రంజిత్, యీ ఫోటో చూడండి. అక్కడ సమూహంగా వున్న గుహలమధ్య పైకి పొడుచుకు వచ్చి నట్లు కనబడుతుందే, అది ధ్వజస్థంబంలా కన్పించడం లేదూ!" అన్నాడు.

పరిశీలనగా చూసిన రంజిత్, నవీన్‌లు ఆనందంతో చిన్నగా కేకపెట్టారు.

"ఎస్ బాస్! అది మేము గుర్తించనేలేక పోయాము" అన్నారు యిద్దరూ.

"వెల్, రంజిత్! మళ్ళీ మనమొకసారి ఆ ప్రదేశానికి వెళదాం!" అన్నాడు బెనర్జీ ఉత్సాహంగా బెడ్‌పైనుండి లేస్తూ.

30

సీ డోర్ తెరుచుకుంది.

ప్రొఫెసర్ బృందం అంతా మెల్లగా నీటిలోకి జారారు.

ముందుగా రంజిత్, ఆ తరువాత నవీన్ మిగిలినవారు నడుస్తున్నారు.

అందరి చేతులలోనూ వాటర్ గన్స్ ఎలర్ట్‌గా కదులుతున్నాయి.

ఆ ప్రదేశమంతా మిట్టపల్లాలుగా వుంది. నడవడం చాలా కష్టంగా వుంది. పెద్దపెద్ద రాళ్ళగుట్టలు, అడుగు తడబడితే చాలు లోపలకు జారిపోయేటట్లుగా వున్న బిలాలు, ముళ్ళ పొదలు ఆ ప్రదేశం నిండా వున్నాయి.

ఇంతవరకు సముద్రగర్భంలో అలాంటి గతుకుల ప్రదేశాన్ని చూసివుండలేదు ప్రొఫెసర్ బృందం.

దాదాపు పదినిమిషాల నడక అనంతరం ఆ ప్రదేశాన్ని చేరుకున్నారంతా.

పెద్ద రాతిగుట్టలను దాటుకుంటూ మరి కాస్త ముందుకు దారితీశాడు రంజిత్.

కొంతదూరం ప్రయాణించిన తర్వాత ఓ పెద్ద లోయ కన్పించింది. ఆ లోయలోకి తొంగిచూశారు.

అక్కడ నాలుగయిదు గుహల సముదాయం! వాటి మధ్యలోనుండి తొంగిచూస్తున్న ధ్వజస్థంబం!

'వెల్ మిస్టర్ రంజిత్, భగవంతుని దయవలన అదే మనం అన్వేషిస్తున్న ఆలయంకావచ్చాను' అనుకున్నాడు బెనర్జీ మెల్లగా లోయలోకి దిగుతూ.

అంతా ఆ గుహలను సమీపించారు.

చెప్పుకోండి చూద్దాం?

1. సిగరెట్ పీకపై వేలిముద్రలు పడినట్లే, పెదవుల గుర్తులు కూడా పడతాయా?

2. జైలులోని నేరస్తులకు ఆహారం పెట్టడానికి, అధికారులు చట్టాన్ని పాటించవలసి వుంటుందా?

3. ఒక ప్రదేశంలో దొరికిన వేలిముద్రలను పరీక్షించి, అవి అక్కడ పడి ఎన్ని రోజులయిందో చెప్పవచ్చునా?

4. ఒక నేరము చేసిన కొంతమంది నేరస్తులు పట్టుబడి, మిగతావారు పారిపోయారు. పట్టుబడ్డ నేరస్తులను ఏమిచేస్తారు?

5. కొన్ని సమయాలలో వేలిముద్రలవలె హతుల ఒంటిపై హంతకుల పంటిగాట్లు కూడా పడుంటాయి. వాటివల్ల హంతకుడిని పట్టుకోవచ్చునా?

—కె. చందర్‌రావ్.

—) : o : (—

జవాబులు :

1. పడవు.
2. అవును.
3. ఖచ్చితంగా చెప్పలేము.
4. పారిపోయినవాళ్ళు దొరికేవరకూ పట్టుబడ్డవాళ్ళను 'లాకప్'లో పెడ్తారు.
5. హంతకుడిని పట్టుకోవడానికి అవీ తోడ్పడతాయి.

నిజానికి అవి గుహలు కావు. భూకంపానికి నెర్రలు విచ్చుకుపోయిన చిన్నచిన్న పర్వతాలు!

పర్వతంపై నిర్మించిన ఆలయమేమో, సమూలంగా కూలిపోయి వుంది.

దారికడ్డంగావున్న రాతిబండలను తొలగించుకుంటూ అంతా లోపలకు ప్రవేశించారు.

కొంతదూరం నడిచిన తర్వాత విశాలమైన మందిరం అంతర్భాగం కన్పించింది.

అంతా పరిశీలనగా చూసిన బెనర్జీ సంతోషంతో తల మునకలై పోయాడు.

అది చాతుర్లింగాలయం!

నాలుగు శివలింగాలు నాలుగు దిక్కులా ప్రతిష్టించబడి వున్నాయి. ఆలయం చాలాభాగం ధ్వంసమైపోయినా గర్భగుడి మాత్రం చెక్కుచెదరలేదు.

ఆ ఆలయం చూడగానే అందరి మేను పులకరించింది.

డాక్టర్ మొహిత్ మరోసారి మదిలోనే ప్రొఫెసర్ బెనర్జీకి అంజలి ఘటించాడు.

బెనర్జీ చకచక శివలింగాలవైపు కదిలాడు.

ఒకసారి మదిలో సర్వేశ్వరుడ్ని ధ్యానించుకొని దక్షిణ దిశగావున్న శివలింగంవైపు నడిచాడు.

ప్రొఫెసర్ చకచక తన పని ప్రారంభించాడు.

శివలింగాన్ని పట్టుకొని గట్టిగా త్రిప్పాడు.

శివలింగం స్క్రూలా తిరిగింది.

శివలింగాన్ని స్క్రూలా త్రిప్పి తీసి ప్రక్కన పెట్టాడు.

లోపలకు తొంగిచూసిన బెనర్జీ కళ్లుమెరిశాయి.

అపరాధ పరిశోధన పోటీ-123
[ఫలితాలు]

అక్టోబరు '78 నెల "అపరాధ పరిశోధన పోటీ—123"కి సరియైన సమాధానాలు :

1. ఎలక్ట్రానిక్.
2. జబ్బు.
3. గీతాచో్ప్రా-సంజయ్‌ల హత్య.
4. యం. వి. నారాయణరావు.
5. సరదాకు.

పై జవాబుల ప్రకారం నలుగురు పాఠకులు ఆల్ కరెక్టుగా పంపారు. వీరికి జనవరి '79 నెల నుండి ఒక ఏడాదిపాటు "అపరాధ పరిశోధన" మాసపత్రిక లేదా సప్లిమెంట్ బహుమతిగా పంపబడుతుంది.

1. శ్రీ పొట్నూరు రజనీకాంతరావు,
S/o పి. క్రిష్ణమూర్తి, అడ్వొకేట్,
పార్వతీపురం, (శ్రీకాకుళం జిల్లా.)
2. శ్రీ కె. శ్రీధర్,
పోస్టు బాక్సు నెం-2,
కడప—516 001.
3. శ్రీ ఎస్. రాఘవేంద్రరాజు, టీచర్,
పోస్టు: వెల్మజాల,
వయా: ఆలేరు, (నల్లగొండ జిల్లా,)
4. శ్రీ భవనం వెంకటరెడ్డి,
మల్లాయ పాలెం,
వయా: ప్రత్తిపాడు, (గుంటూరుజిల్లా.)

అదే పాతదృశ్యం! రాజస్థాన్ ఎడారిలో దర్శించిన దృశ్యం!

లోపల తెల్లగా స్వచ్ఛంగా మెరుస్తున్న దంతపుపెట్టె కన్పించింది.

ఆ పెట్టె నెమ్మదిగా అందుకొని బయటకు తీస్తుంటే తనువంతా ఆనందంతో పులకరించింది.

మిగిలిన బృందమంతా ఆ దృశ్యాన్ని తనివిదీరా తిలకిస్తున్నారు. ఫలకం! ఆ ఫలకంమీద యేదో గజిబిజిగా అక్షరాలు!

మెల్లగా ఆ దంతపుపెట్టె నడుముకు బిగించివున్న తోలు సంచిలోకి జారవిడిచి, తన బృందంవైపు తిరిగి విజయం సిద్ధించిందన్నట్లుగా సైగ చేశాడు బెనర్జీ.

అప్పటికే టైమ్ చాలా గడిచిపోయింది.

ఇక వెళదామన్నట్లుగా సైగ చేశాడు రంజిత్.

అంతా తిరిగి వెనక్కు ప్రయాణమయ్యారు.

ఇంకా అయిదు నిమిషాలు మాత్రమే వుంది ఆక్సిజన్ స్టాక్.

ఒకసారి వచ్చిన దారి కాబట్టి అంతా వేగంగా నడుస్తున్నారు.

అదే సమయంలో హఠాత్తుగా ఎవరూ వూహించని సంఘటన జరిగింది.

ఒక రాతిగుట్ట చాటునుండి వేగంగా బయటకువచ్చిందో షార్కు చేప.

చేపలలోకెల్లా ప్రమాదకరమయిన చేప షార్కు!

అది ఒక్కసారిగా తమపైకి దూసుకురావడంతో ముందు నడుస్తున్న రంజిత్, నవీన్‌లు అదిరిపడి తమ వాటర్‌గన్స్‌ను గురిపెట్టి టపటట కాల్చారు.

"హోమ్ డెలివరీ"

1. మీరు 'హోమ్ డెలివరీ' సభ్యులుగా చేరితే, నెల నెలా పత్రిక మరియు సప్లిమెంట్ రెండూ కలిపి అసలు ధరకే రు. 7-00 లకు మా ఏజెంట్ ద్వారాగాని, వి. పి. ద్వారాగాని మీ ఇంటిదగ్గర అందజేయబడతాయి. ఇందుకు అవసరమయ్యే ఖర్చు లన్నీ మేమే భరిస్తాము.

2. 'హోమ్ డెలివరీ' సభ్యత్వము పొందటానికి మీరు చేయవలసిందల్లా సభ్యత్వ రుసుము రు. 5/-లు పంపటమే. పైకం మనియార్డరుద్వారాగాని, పోస్టలు స్టాంపులుగాని పంప వచ్చును. సొమ్ము చేరగానే మీకు సభ్యత్వము కార్డు అందుతుంది.

3. 'హోమ్ డెలివరీ' వల్ల మీకు కాపీలు నెల నెలా గ్యారంటీగా, త్వరితంగా చేరుతాయి. మీ ఇంటిదగ్గరనే డబ్బు చెల్లించి కాపీలు పొందవచ్చును. కాపీలకోసం మీరు ఏజెంట్ చుట్టూ తిరుగనవసరంలేదు. కాపీలు దొరకలేదనే నిరాశ, పోస్టులో పోయే సమస్య, ఎంతమాత్రం వుండదు. పైగా సభ్యులు పోటీ లలో ఫ్రీగా పాల్గొనవచ్చును.

4. ఏ కారణం చేతనైనా మీకు పంపిన వి. పి. తిరిగొస్తే, వాటి పైకం రు. 7/-లు వెంటనే **M.O.** చేయాలి. కాపీలు తిరిగి 'రికార్డెడ్ డెలివరీ'లో పంపుతాము. లేదా మీ సభ్యత్వము అంత టితో రద్దవుతుంది.

5. ఇండియాలో మీరు ఏ మూరుమూలనున్నా కాపీలు ఖచ్చి తంగా అందజేయబడతాయి. మీ చిరునామా మారినప్పుడల్లా తగినంత ముందుగా మాకు తెలియజేయండి.

6. పాత కాపీలు కావలసినవారు వాటి పైకం ముందుగా **M.O.** చేయాలి. ఎక్కువ కాపీలు కావలసినవారు సెట్టుకు రు. 5/-లు చొప్పున పంపితే చాలు.

7. నెల నెలా వి. పి. తీసుకోవటం కష్టమనుకునేవారు, ఏడాది పైకము రు. 80/-లు ముందుగా పంపితే వారికి కాపీలు 'రికార్డెడ్ డెలివరీ'లో పంపగలము. దీనివల్ల మీకు ఖర్చులు కూడా కొంత తగ్గుతాయి.

నేడే మీరూ 'హోమ్ డెలివరీ'లో చేరండి!

అయినా ఆ షార్క్ వెనుతిరగలేదు. గాయాలనుండి రక్తం స్రవిస్తున్నా లెక్కచేయక ముందుకు దూసుకు వస్తూనేవుంది.

ఇక ఆలశ్యం చేయలేదు నవీన్. రంజిత్‌కు సైగచేసి తోలుసంచిలో నుండి హేండ్‌గ్రనేడ్ తీసి పిన్‌లాగి విసిరేశాడు. రంజిత్ కూడా నవీన్‌ను అనుసరించాడు.

అంతే సముద్రంలో పెద్దగా విస్ఫోటకం జరిగింది.

షార్క్ ఖండఖండాలుగా ధ్వంసమై ముక్కలు చెదిరి దూరంగా పడ్డాయి.

రక్తంతో నీళ్ళన్నీ ఎర్రబారుతున్నాయి.

మరింతవేగంగా నడకసాగించారు బృందం.

వారికి తెలుసు. నెత్తురువాసన పసిగట్టాయంటే చుట్టుపక్కల షార్క్‌చేపలు ఎక్కడున్నా పరుగుపరుగున వచ్చేస్తాయని!

అందుకే వేగంగా నడుస్తున్నారు.

అప్పటికే చుట్టూ కలకలధ్వనులతో నీళ్ళు చెల్లాచెదురు కాసాగాయి.

అంటే షార్క్‌చేపలు వచ్చేస్తున్నాయన్న మాట!

భయంతో అందరి గుండెలూ బరువెక్కాయి.

అదే సమయంలో ఆక్సిజన్ సిలిండర్స్ నిల్ అయిపోయాయి.

అంతా చకచకా నీళ్ళపై తేలారు.

ఎవరికి వారు తమప్రాణాలమీద ఆశ వదులుకొని యీదడం ప్రారంభించారు.

షార్క్‌చేపలు కనుచూపుమేరలోకి వచ్చేశాయి.

అయినా పట్టు విడవకుండా ఈదుతున్నారు.

అలా ఈదుతూ చుట్టూచూసిన రంజిత్ అదిరిపోయాడు.

పాఠకుల అభిప్రాయాలు: (అక్టోబరు '78)

అక్టోబరు నెల పత్రికలో కదిలేబొమ్మలు, నాకు ఓటమి లేదు, తెగిన గాలిపటం—కథలు హైలైట్స్. నవలల్లో వసుంధర గారి 'చిత్రమైన ఖైదు' నాకెంతో నచ్చింది. రచయిత్రికి నా ధన్యవాదాలు. 'అతీంద్రియ శక్తులు' సీరియల్ ఘుమఘుమలాడే 'పొలావ్'లాగ నవరసాలతో ఆసక్తికరంగా సాగుతోంది.

—ఎమ్. కృష్ణకుమార్, సికింద్రాబాదు.

ఈ నెల పత్రిక మరియు సప్లిమెంట్ల ముఖచిత్రాలు చెప్ప లేనంతగా బాగున్నవి. కొత్తవారెవరైనా హఠాత్తుగా చూస్తే, ఫారిన్ పత్రికేమో అని అనుకునేంత అందంగా వున్నాయి. ఆర్టిస్టులకి నా హృదయపూర్వక అభినందనలు.

—యం. వీరాస్వామి. మల్కాజిగిరి.

అక్టోబరు అపనలు రెండూ అందాలు చిందిస్తూ మాకు కన్నుల పండువు చేసాయి. అడుగడుగునా పాఠకుల ప్రశంసల కోసం మీరు శ్రమిస్తున్న తీరు ద్యోతకమవుతూనే వుంది. అందుకు మా అభినందనలు. 'అతీంద్రియ శక్తులు' సీరియల్ ఉత్సాహభరితంగా వుంది.

—కరణం శివానందరావు, బెక్కెం.

కథల్లో అజీజ్‌గారి 'దంత వైద్యుడు', యస్.యస్. శాస్త్రిగారి 'నాకు ఓటమి లేదు', నవలల్లో చిత్రమైన ఖైదు, నకిలీ భర్తలు-చాలా బావున్నాయి. అపనను త్వరగా అందిస్తున్నందులకు మెనీ మెనీ థాంక్స్.

—పి. గణేష్, కోరుట్ల.

నకిలీ భర్తలు, చిత్రమైన ఖైదు సప్లిమెంట్‌కే హైలైట్స్. కార్టూన్లు, జోక్స్ మమ్మల కడుపుబ్బ నవ్విస్తున్నవి.

—కె. వీరాస్వామి, భువనగిరి.

కథలలో 'నాకు ఓటమి లేదు' ఎక్సలెంట్‌గా వుంది. కదిలే బొమ్మలు, పాకుడు రాళ్ళు కథలుకూడా చాలా బావున్నాయి. కార్టూన్లు పత్రికకే హైలైట్స్.

—ఆర్. కృష్ణ, హన్మకొండ.

ఇక తాము ముందుకు రావడం కూడా అసంభవం!

షార్క్-చేపలు వలయాకారంలో బృందాన్ని చుట్టు ముట్టాయి.

"వాటికీ యుద్ధవ్యూహాలు వున్నాయన్న మాట!" అంత విషాదంలోనూ నవ్వువచ్చింది రంజిత్‌కు.

అదే సమయంలో దూరంగా ఏదో శబ్దం విన్పించింది. క్రమేపీ దగ్గరవుతున్న ఆ శబ్దం తమ జలాంతర్గామిదని గుర్తించగానే అందరి హృదయాలలో ఆనంద తరంగాలు ఉవ్వెత్తున లేచాయి.

షార్క్-చేపలు మెల్లమెల్లగా సమీపిస్తున్నాయి.

ఏమవుతుంది? షార్క్-చేపలు ముందు సమీపిస్తాయా? జలాంతర్గామి ముందు సమీపిస్తుందా?

రక్షణా? భక్షణా?

ప్రాణాలు బిగపట్టుకొనివున్న ప్రొఫెసర్ బృందాన్ని ముందుగా సమీపించింది జలాంతర్గామి.

వెంటనే సీడోర్ తెరచుకోవడం, గబగబ అందర్నీ లోపలకు లాక్కోవడం క్షణాలమీద జరిగిపోయింది.

షార్క్-చేపలు నిరాశగా బుసలుకొట్టాయి. జలాంతర్గామిని వెంబడించబోయాయి.

అప్పటికే జలాంతర్గామి వేగం పుంజుకుంది.

31

"థాంక్యూ మిష్టర్ దేవర్!" అన్నాడు కెప్టెన్‌ను ఆలింగనం చేసుకుంటూ ప్రొఫెసర్ బెనర్జీ.

"ఈ రోజు మా బృందం మొత్తాన్ని ప్రాణాలతో కాపాడావు. నీ ఋణం మాటలతో తీర్చుకోలేనిది. మిష్టర్ దేవర్" అన్నాడు డాక్టర్ మోహిత్ కరచాలనం చేస్తూ.

పాఠకుల పరిశోధన పోటీ-125

ఈ క్రింద కొన్ని ప్రశ్నలు, వాటి పక్కనే జవాబులు కూడా ఉన్నవి. మీరు సరియైనదని వూహించిన జవాబును, నెంబరు వారీగా ఒక (పోస్టుకార్డు సైజు) తెల్లకాగితంపై వ్రాసి. దానితో 75 పైసలు విలువగల పోస్టలు స్టాంపులు జతపరిచి పంపండి. ఆల్ కరక్టుగా పంపినవారికి ఒక్కొక్కరికి ఒక ఏడాదిపాటు పత్రిక లేదా సప్లిమెంట్ ఉచితంగా పంపుతాము.

దీనిలో ఎవరైనను పాల్గొనవచ్చును. ఒక్కొక్కరు మూడు కూపన్లకు మించి పంపరాదు. ప్రతి కూపనుకీ 75 పైసల పోస్టలు స్టాంపులు జతపరచాలి. స్టాంపులు వేటికీ అతికించకూడదు. ప్రతి కూపను వెనుక మీ పూర్తి చిరునామా, హో౦. డె. సభ్యులైతే వారి నెంబరుకూడా స్పష్టంగా వ్రాయాలి.

మీ కూపనులు 15-11-'78 తేదీలోగా మాకు చేరాలి ఫలితాలు వచ్చే నెల సంచికలో ప్రకటిస్తాము. *

1. కొందరికి వీటిని మొదటిరోజే చూడాలనిపిస్తుంది—?
   (ఆటల పోటీలు, కొత్త సినిమాలు.)
2. మతిమరుపు ఎక్కువగా వున్నవారిని ఏమని పిలుస్తారు—? (ప్రొఫెసర్, మందమతి.)
3. కళాశాలల్లో దీనినికూడా నేర్పాలంటున్నారు—?
   (చోరవిద్య, సెక్స్ విజ్ఞానం.)
4. పెద్ద పెద్ద అడవుల్లో ఇవి వుంటాయి—?
   (క్రూరమృగాలు, అంతులేని సంపదలు.)
5. నేడు సామాన్య మానవుడికి అందుబాటులోని వార్తా సాధనాలు—? (వార్తా పత్రికలు, టెలివిజన్.)

"సార్, నా డ్యూటీ నేను నిర్వర్తించాను. అంతే! మీరు రెస్ట్ తీసుకోండి. తరువాత మాట్లాడదాం" అంటూ కెప్టెన్ దేవర్ వెళ్ళిపోయాడు.

అంతా అలసటగా కళ్లు మూసుకున్నారు.

చావుతప్పి కన్ను సొట్టబోయివచ్చిన ప్రొఫెసర్‌బృందం మరుసటిరోజుకుగానీ తేరుకోలేకపోయారు.

"మిష్టర్ బెనర్జీ, మనం తిరుగుప్రయాణంలో వున్నాము. ఏమయింది మీ పరిశోధన?" పలకరించాడు కెప్టెన్‌దేవర్.

చిన్నగా నవ్వాడు బెనర్జీ.

"మిష్టర్ దేవర్! ఇటీజ్ గ్రాండ్‌సక్సెస్" అంటూ సంతోషంగా దంతపుపెట్టెలోని తామ్రపత్రాలను తీసి చూపించాడు బెనర్జీ.

వాటిని చూసి నివ్వెరబోయాడు దేవర్.

"పిటీసర్! ఈ రాగిరేకులకోసం మీరు యింత రిస్కు పడ్డారా?" అన్నాడు జాలిగా.

చిద్విలాసంగా నవ్వాడు బెనర్జీ మళ్ళీ.

"ఎస్ మిష్టర్ దేవర్! శతాబ్దాల క్రిందటి యీ రాగి పత్రాలలో మహోన్నతమైన సమాచారం దాగివుంది. వీటి కోసం నేనుపడిన శ్రమ, తపస్సు అంతా యింతా కాదు" తృప్తిగా మెరిసే కళ్ళతో అన్నాడు బెనర్జీ.

అర్థం కాన్నట్లు ముఖంపెట్టాడు దేవర్.

"ఆల్‌రైట్! ఎవరి డ్యూటీ వారిది! మీ గొడవ నాకర్థం కాదు, నా గొడవ మీకర్థంకాదు. బైదిబై, మనం మరో నాలుగు రోజులలో తీరాన్ని చేరబోతున్నాం" చెప్పాడు దేవర్.

"అబ్బా! వెరీగ్లాడ్ న్యూస్!" అంటూ రెండు క్షణాలు కళ్ళు మూసుకొని ఏదో ఆలోచించాడు బెనర్జీ.

ముఖచిత్ర వ్యాఖ్యాల పోటీ

(బహుమతి రు. 50/-లు నగదు)

ఈ నెల "అపరాధ పరిశోధన" ముఖచిత్రాలను పరిశీలించండి. రెండు ముఖచిత్రాలకు సంబంధం వుండేట్లుగా చక్కని వ్యాఖ్యలను ఒక్క మాటలోగాని, చిన్న వాక్యంలోగాని ఓ పోస్టుకార్డు సైజు తెల్ల కాగితంపై వ్రాసి ఈ నెల 10వ తేదీ లోపల మాకు చేరేటట్లు పంపండి.

ఇదేవిధంగా "సప్లిమెంట్" ముఖచిత్రాలకు కూడా మీ వ్యాఖ్యలు పంపవచ్చును. రెండు పత్రికల వ్యాఖ్యలు వేరువేరు తెల్లకాగితాంపై వ్రాసి పంపాలి. హో.డె. సభ్యులు తమ నెంబర్లను స్పష్టంగా వ్రాయాలి. ఇతరులు తమ వ్యాఖ్యలతో 30 పైసల స్టాంపులు జతపర్చి పంపాలి.

అత్యుత్తమమైన వ్యాఖ్యలు పంపిన ఇద్దరు పాఠకులకు ఒక్కొక్కరికి రు. 25/-లు బహుమతి పంపుతాము. ఫలితాలు వచ్చే సంచికలో చూడండి. *

అక్టోబరు నెల పోటీ ఫలితాలు

(1) అక్టోబరు '78 నెల "అపరాధ పరిశోధన" ముఖచిత్రాలకు బహుమతి పొందిన వ్యాఖ్య:

మగువ చూపు,
మగవానికి కైపు!!

పంపినవారు: శ్రీమతి ఏ.వీ. సుబ్బలక్ష్మి, బి.ఏ., 6-8-37, కవాడిగూడ, సికింద్రాబాదు.

(2) "సప్లిమెంట్"కు బహుమతి పొందిన వ్యాఖ్య:

అంగ విన్యాసం!
అతివ సావాసం!!

పంపినవారు: శ్రీ కరణం శివానందరావు, శ్రీ నిలయం, బెక్కెం, మహబూబ్‌నగర్ జిల్లా.

పై విజేతలకు ఒక్కొక్కరికి రు. 25/-లు చొప్పున బహుమతి పంపబడుతుంది.

"మిష్టర్ దేవర్! నీ కొక చిన్న బహుమతిని యిస్తే కాదనకుండా స్వీకరించగలవా?" ప్రశ్నించాడు.

"నాకెందుకు సర్!" చిన్నగా గొణిగాడు దేవర్.

"మై పూర్ ఫ్రెండ్! మధురమైన మన యీ స్నేహ బంధానికి గుర్తుగా యీ వుంగరం తీసుకో. ప్లీజ్!" చిటికినవ్రేలు వుంగరం తీసి యిచ్చాడు బెనర్జీ.

మొహమాటపడుతూనే తీసుకున్నాడు దేవర్.

"మిష్టర్ బెనర్జీ! సాగరగర్భంలో లెక్కలేనన్ని విలువైన ముత్యాలమధ్య సంచరిస్తూ గూడా మీరు ఒక్క ముత్యం గూడా ముట్టుకోలేదంటే నాకే చాలా ఆశ్చర్యంగా వుంది. మీ శిక్షణ ఎంత గొప్పదో మీ బృందాన్ని చూస్తే అర్థమవుతోంది. నిజంగా మీలాంటి వ్యక్తులు అరుదు. మీరు నాకు చిరస్మరణీయులు" అన్నాడు కరస్పర్శచేస్తూ.

నాలుగురోజుల అనంతరం జలాంతర్గామి తీరాన్ని చేరింది.

ప్రొఫెసర్ బృందమంతా ఒక చిన్న మరపడవలో ఒడ్డుకు చేరుకున్నారు.

అప్పటికే టూవే ట్రాన్స్‌మీటర్ ద్వారా ప్రొఫెసర్ విజయవార్తను విన్న పేట్రియట్ షిప్పింగ్ కార్పొరేషన్ జనరల్ మేనేజర్ గాబ్రియేల్ స్వాగత సత్కారాలతో ఎదురుచూస్తున్నాడు.

మరపడవ దిగగానే ఎదురువచ్చిన గాబ్రియేల్‌ను గాఢాలింగనం చేసుకున్నాడు ప్రొఫెసర్ బెనర్జీ.

"మిష్టర్ గాబ్రియేల్! మీ సహకారం జన్మలో మరవలేనిది. మేము అనుకున్న కార్యం సాధించాము" ఉద్విగ్న కంఠస్వరంతో చెప్పాడు బెనర్జీ.

నిండుగా నవ్వాడు గాబ్రియేల్.